

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 2-5-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 55 | శ్రీ పరాభవనామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా.12:50 తదుపరి విదియ, నక్షత్రం: విశాఖ పూర్తి, వర్జ్యం: ఉ.10:47-12:33, దుర్ముహూర్తం: ఉ.5:52-7:33, అమృత ఘడియలు: రా.9:25-11:11, రాహుకాలం:ఉ.9.00-10:30, సూర్యోదయం:5:52, సూర్యాస్తమయం:6:32, | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జీఎస్‌టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

● ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్లుగా నమోదు
● దిగుమతులపై పన్ను ఆదాయంలో 26% వృద్ధి



న్యూఢిల్లీ: ఏప్రిల్ నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 8.7 శాతం వృద్ధితో సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్లకు పెరిగాయి. దిగుమతులపై పన్ను ఆదాయంలో భారీ వృద్ధి ఇందుకు దోహద పడిందని శుక్రవారం విడుదల చేసిన డేటాలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియా ఉద్రిక్తంగా మారినప్పటికీ, దేశీయ ఆర్థిక కార్యకలాపాల్లో జోరును ఈ గణాంకాను ప్రతిబింబిస్తున్నాయి. జీఎస్‌టీ వసూళ్లలో క్రితం రికార్డు గత ఏడాది ఏప్రిల్‌లో రూ.2.23 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ ఏప్రిల్‌లో దేశీయ లావాదేవీల ద్వారా స్థూల పన్ను వసూళ్లు 4.3 శాతం పెరిగి రూ.1.85 లక్షల కోట్లను మించాయి. దిగుమతులపై జీఎస్‌టీ ఆదాయం ఏకంగా 25.8 శాతం పెరిగి రూ.57,580 కోట్లకు చేరుకుంది.

గతనెలలో వసూళ్లు (రూ.కోట్లు)	
సెంట్రల్ జీఎస్‌టీ	52,140
స్టేట్ జీఎస్‌టీ	61,331
ఐజీఎస్‌టీ	1,29,232
మొత్తం	2,42,702

నికర వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లు: ఈ ఏప్రిల్‌లో జీఎస్‌టీ రిఫండ్లు వార్షిక ప్రాతిపదికన 19.3 శాతం పెరుగుదలతో రూ.31,793 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్లు మినహాయించగా జీఎస్‌టీ నికర ఆదాయం రూ.2.11 లక్షల కోట్లుగా ఉంది. గత ఏప్రిల్‌తో పోలిస్తే 7.3 శాతం అధికమిది.

గత సెప్టెంబరులో భారీ సంస్కరణలు: మార్కెట్లో వస్తు ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం 2025 సెప్టెంబరులో 375 ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గించింది. అలాగే, 5,12,18,28 శాతంగా ఉన్న జీఎస్‌టీ శ్లాబులను కేవలం 5,18 శాతానికి కుదించింది. పొగాకు ఉత్పత్తులు, అత్యంత విలాస వస్తువులను మాత్రం 40 శాతం పన్ను శ్లాబులో చేర్చింది. జీఎస్‌టీ తగ్గింపుతో తొలుత జీఎస్‌టీ ఆదాయానికి కొంత గండిపడినప్పటికీ, వసూళ్లు క్రమంగా పెరుగుతూ వచ్చాయి.

ఈ ఏడాది ప్రీమియం వసూళ్లలో 20% వృద్ధి టార్గెట్

2025-26లో రూ.5,000 కోట్లుగా నమోదు

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ కాస్పరస్ క్రోమ్‌హౌట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (ఎస్ఎల్ఐఎల్) మంచి పనితీరు కనబరిచింది. ఈ కాలానికి గాను కంపెనీ స్థూల ప్రీమియం వసూళ్లు రూ.5,000 కోట్లు మించాయి. కంపెనీ చరిత్రలో ప్రీమియం వసూళ్లు రూ.5,000 కోట్లు దాటడం ఇదే మొదటిసారని సంస్థ ఎండీ, సీఈఓ కాస్పరస్ క్రోమ్‌హౌట్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో ప్రీమియం వసూళ్లలో 20 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, ఇప్పటి వరకు బీమా కవరేజీ లేని వారిని లక్ష్యంగా పెట్టుకుని శ్రీరామ్ లైఫ్ పనిచేస్తోందని చెప్పారు. గత మూడేళ్లుగా బీమా పరిశ్రమ ప్రీమియం వసూళ్లు సగటున 15 శాతం చొప్పున పెరిగితే శ్రీరామ్ లైఫ్ ప్రీమియం వసూళ్లు మాత్రం 30 శాతం చొప్పున పెరిగినట్టు వెల్లడించారు.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వాటా రూ.1,086 కోట్లు: గత ఆర్థిక సంవత్సరం కంపెనీ వసూలు చేసిన మొత్తం ప్రీమియంలో రూ.1,085.80 కోట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే సమకూరింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.493.60 కోట్లు సమకూరగా, తెలంగాణ నుంచి రూ.592.50 కోట్లు సమకూరాయి. ప్రస్తుతం శ్రీరామ్ లైఫ్‌కు తెలుగు రాష్ట్రాల్లో 109 శాఖలు ఉన్నాయి. మరే ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి తెలుగు రాష్ట్రాల్లో ఇన్ని శాఖలు లేవని కాస్పరస్ చెప్పారు. ఏపీ, తెలంగాణల్లోని డ్వాక్రా గ్రూపు మహిళలకు కూడా జీవిత బీమా, టర్మ్ పాలసీలు అందించాలని ఎస్ఎల్ఐఎల్ భావిస్తోంది. ఇందుకోసం త్వరలోనే రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తామని ఆయన చెప్పారు.

కొత్తగా 4 పాలసీలు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాలుగు కొత్త పాలసీలు తీసుకురావాలని ఎస్ఎల్ఐఎల్ భావిస్తోంది. వ్యక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ పాలసీలు ఉంటాయని కాస్పరస్ చెప్పారు. ప్రభుత్వ విధానాలతో పాటు పాలసీల ప్రీమియం తగ్గితే తప్ప 2047 నాటికి ప్రభుత్వ లక్ష్యమైన 'అందరికీ బీమా కవరేజీ' లక్ష్యం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

వైకే లేబొరేటరీస్ కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ : వైకే లేబొరేటరీస్ మార్కెట్లోకి సాంటాల్, హైఫాస్, వ్యూహం పేరుతో మూడు కొత్త ఉత్పత్తులను తీసుకువచ్చింది. రైతులు విత్తనం నాటే దశ నుంచి కోతల వరకు ఈ ఉత్పత్తులు అండగా నిలుస్తాయని కంపెనీ ఎండీ వెంకట రమణ రాయుడు తెలిపారు. ప్లాంట్ ప్రొటెక్షన్, న్యూట్రిషన్, తక్కువ రసాయనాలతో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. హైఫాస్.. వరి, మొక్కజొన్న, మిర్చి, టమాటా, ద్రాక్ష పంటలకు అత్యంత అనుకూలమైదని అన్నారు.

ట్రంప్ మళ్లీ టారిఫ్‌ల బెదిరింపులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ టారిఫ్‌ల బెదిరింపులకు దిగారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల నుంచి దిగుమతయ్యే కార్లు, ట్రక్కులపై ప్రస్తుతం ఉన్న 15 శాతం సుంకాన్ని 25 శాతానికి పెంచేస్తానని ప్రకటించారు. వచ్చే వారం నుంచే ఈ సుంకాల పెంపు ఉంటుందని ప్రకటించారు. గత ఏడాది జూలైలో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఈయూ సరిగా అమలు చేయకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈయూ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇప్పటికే గల్ఫ్ యుద్ధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ట్రంప్ తాజా సుంకాల యుద్ధంతో మరింత కష్టాల్లోకి జారుకుంటుందని భావిస్తున్నారు.

వసుధ ఫార్మాకు భారీ ఊరట

● 'ఫెంటానిల్' కేసు నుంచి విముక్తి

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బల్క్ డ్రగ్స్ ఇంటర్మీడియట్ ఉత్పత్తుల తయారీ సంస్థ వసుధ ఫార్మా కెమ్ లిమిటెడ్ (వీపీసీఎల్)నకు పెద్దఊరట లభించింది. 'ఫెంటానిల్' అనే ముడి పదార్థాన్ని ఈ సంస్థ అక్రమంగా అమెరికాకు తరలిస్తోందనే అభియోగాలను అమెరికా న్యాయ శాఖ (డీఓజే) వెనక్కి తీసుకుంది. దీనికి సంబంధించి డీఓజేతో నాన్ ప్రాసిక్యూషన్ ఒప్పందం కూడా కుదుర్చుకున్నట్టు కంపెనీ తెలిపింది. దీంతో అమెరికా కోర్టులో దీనికి సంబంధించి తమపై నమోదైన కేసును కూడా కొట్టివేసినట్టు తెలిపింది. తమపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవని నిర్ధారించుకున్నాకే అమెరికా న్యాయ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. అత్యంత శక్తివంతమైన ఫెంటానిల్‌ను వసుధ ఫార్మా అమెరికాకు అక్రమ రవాణ చేస్తున్నట్టు గత ఏడాది వార్తలు గుప్పుమన్నాయి.

మరింత అకింతభావంతో పని చేస్తాం: డీఓజే నిర్ణయంపై వసుధ ఫార్మా హర్షం వ్యక్తం చేసింది. డీఓజే ఇలా కేసును ముగించడంపై కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంతెన అశోక్ శ్రీనివాస రాజు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో మరింత జాగ్రత్తగా, అంకిత భావంతో ఖాతాదారుల సేవకు అంకితమవుతామని మరో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంతెన ఆనంద్ చెప్పారు. గత మూడు దశాబ్దాలుగా బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్స్ తయారు చేస్తూ, 4,000 మంది ఉద్యోగులతో కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోంది. కాగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని వసుధ ఫార్మా గుర్తు చేసింది.

2026-27 ఆర్థిక సంవత్సరం ఆరంభం అదిరింది..

ఏప్రిల్‌లో వాహన విక్రయాల జోరు
మొత్తం 4.5 లక్షల యూనిట్ల సేల్స్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2026-27) ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు శుభారంభం పలికాయి. ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో ఏకంగా 4.5 లక్షల యూనిట్ల వరకు టోకు విక్రయాలు జరిగాయని అంచనా. గత ఏప్రిల్‌లో నమోదైన 3.54 లక్షల యూనిట్లతో పోలిస్తే 27 శాతం అధికమిది. మారుతి సుజుకీ, హ్యుండయ్, కియా వంటి కంపెనీలు రికార్డు విక్రయాలను జరపడం ఇందుకు దోహదపడింది. "గత సెప్టెంబరులో కార్లపై జీఎస్‌టీ భారం తగ్గినప్పటి నుంచి విక్రయాలు ఊపందుకున్నాయి. ఆ జోరు ఇంకా అలాగే కొనసాగుతోంది. వాహన రుణాలపై తగ్గిన వడ్డీ రేట్లు, వ్యక్తిగత ఆదాయం పన్ను ఊరట అంశాలూ కలిసి వస్తున్నాయ"ని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు.

మారుతి చిన్న కార్ల సేల్స్‌లో 74.4% వృద్ధి: మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు గత నెలలో కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 1,91,122 యూనిట్లకు పెరిగాయి. గత రికార్డు గరిష్ఠం 2025 డిసెంబరులో 1,82,165 యూనిట్లుగా నమోదయ్యాయి. గత నెల విక్రయాల వృద్ధిలో చిన్న కార్లు గణనీయ పాత్ర పోషించాయని పార్థో బెనర్జీ అన్నారు.

రెండో స్థానానికి టాటా మోటార్స్: ఏప్రిల్ నెలలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ లిమిటెడ్ దేశీయ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 30.5 శాతం వృద్ధితో 59,000 యూనిట్లకు చేరాయి. దీంతో మారుతి సుజుకీ తర్వాత అత్యధిక ప్యాసింజర్ వాహనాలను విక్రయించిన కంపెనీల్లో రెండో స్థానానికి ఎదిగింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,331 యూనిట్ల సేల్స్‌తో మూడో స్థానంలో ఉంది. హ్యుండయ్ మోటార్ ఇండియా 51,902 యూనిట్ల విక్రయాలతో ఆ తర్వాత స్థానానికి పరిమితమైంది. కియా ఇండియా అమ్మకాలు 16 శాతం వృద్ధితో 27,286 యూనిట్లకు పెరిగాయి. కాగా, టయోటా కార్ల విక్రయాలు 21 శాతం పెరిగి 30,159 యూనిట్లకు చేరాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా టోకు విక్రయాలు 3 శాతం పెరిగి 6,108 యూనిట్లుగా, రెనో సేల్స్ రెండింతలకు పైగా పెరిగి 5,143 యూనిట్లుగా, నిస్సాన్ విక్రయాలు 3,203 యూనిట్లుగా నమోదయ్యాయి.

టూవీలర్లూ రయ్ రయ్: గత నెలలో హీరో మోటోకార్ప్ మొత్తం టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 85 శాతం పెరిగి 5,66,086 యూనిట్లుగా నమోదయ్యాయి. హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా విక్రయాలు 14.7 శాతం పెరుగుదలతో 4.84 లక్షల యూనిట్లకు చేరాయి. సుజుకీ మోటార్ సైకిల్ దేశీయ అమ్మకాలు 3 శాతం పెరిగి 98,004 యూనిట్లుగా నమోదయ్యాయి.

సొరంగాల నిర్మాణంలో నవయుగ సత్తా

గిన్నిస్ రికార్డుల్లోకి ముంబై-పుణె మిస్సింగ్ లింక్ ప్రాజెక్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రహదారి ప్రాజెక్టులకు సంబంధించిన సొరంగాల నిర్మాణంలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఈసీఎల్) మరోసారి తన సత్తా చాటింది. శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేతుల మీదుగా ప్రారంభమైన ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే మిస్సింగ్ లింక్ ప్రాజెక్టులో భాగంగా కంపెనీ నిర్మించిన రెండు సొరంగాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో నమోదయ్యాయి. రద్దీగా ఉండే ఖండాలా ఘాట్ రహదారిని బైపాస్ చేస్తూ ముంబై-పుణెల మధ్య దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గించే 13.3 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టులో భాగంగా 10.67 కిలోమీటర్ల పొడవైన రెండు సొరంగ మార్గాలను (టన్నెల్స్) ఎన్ఈసీఎల్ నిర్మించింది. ఐదు వరుసలతో ఒక్కోటి 22.33 మీటర్ల వెడల్పుతో ఈ సొరంగ మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రపంచంలో ఇప్పటి వరకు మరే కంపెనీ ఇంత వెడల్పుతో సొరంగ రహదారి మార్గాలు నిర్మించలేదని ఎన్ఈసీఎల్ ఎండీ చింతా శ్రీధర్ తెలిపారు. అత్యంత కఠినమైన అగ్ని శిలలతో కూడిన సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో నిర్మించిన ఈ సొరంగ మార్గాల నిర్మాణంలో కంపెనీ అనేక సవాళ్లు ఎదుర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,52,350 ▲	1,39,650 ▲	2,65,000 ▲
విజయవాడ	1,55,000 ▲	1,43,000 ▲	2,47,000 ▲
విశాఖపట్నం	1,52,730 ▲	1,40,000 ▲	2,65,000 ▼
రాజమండ్రి	1,52,000 ▲	1,40,000 ▲	2,70,000 ▲
ప్రొద్దుటూరు	1,51,600 ▲	1,39,470 ▲	2,45,000 ▲
ముంబై	1,50,263 ▲	1,37,641 ▲	2,40,331 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	118
వరంగల్	125	గుంటూరు	118
కరీంనగర్	125	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	108
కర్నూలు	125	నెల్లూరు	113
విశాఖపట్నం	124	అనంతపురం	113
గోదావరి	118		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — చెన్నై X ముంబై — వేదిక: చెన్నై — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	9	5	4	0	10	-0.192
ఢిల్లీ	9	4	5	0	8	-0.895
చెన్నై	8	3	5	0	6	-0.121
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబై	8	2	6	0	4	-0.784
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

ఢిల్లీ దంచేసింది

రాజస్థాన్‌పై ఘన విజయం
అదరగొట్టిన రాహుల్, నిస్సాంక
పరాగ్, ఫెరీరా శ్రమ వృథా


రాహుల్ (75)

జైపూర్: గత మ్యాచ్‌లో చెత్త ఆటతీరు (16.3 ఓవర్లలో 75 ఆలౌట్)తో తీవ్ర విమర్శలపాలైన ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి జూలు విదిల్చింది. రాజస్థాన్ రాయల్స్‌తో శుక్రవారం జరిగిన పోరులో అద్భుత ఆటతీరుతో ఆకట్టుకుంది. కేఎల్ రాహుల్ (40 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75), నిస్సాంక (33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62), నితీశ్ రాణా (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) బెంబేలెత్తించిన వేళ 7 వికెట్లతో ఘన విజయం సాధించింది. 226 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఢిల్లీ ఛేదించింది. ఐపీఎల్ చరిత్రలో క్యాపిటల్స్‌కిది అత్యధిక ఛేదన కావడం విశేషం. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 225/6 స్కోరు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 90), జురెల్ (30 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 42) సత్తా చాటారు. చివర్లో ఫెరీరా (14 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 47 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. స్టార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఓపెనర్ల సుడిగాలి ఇన్నింగ్స్: ఛేదనలో ఓపెనర్లు నిస్సాంక, కేఎల్ రాహుల్ తొలి బంతి నుంచే రెచ్చిపోయారు. మరీ ముఖ్యంగా నిస్సాంక ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడడంతో ఢిల్లీ క్యాపిటల్స్ పవర్ ప్లేలో 70/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఈ క్రమంలో నిస్సాంక హాఫ్ సెంచరీ పూరించాడు. నిస్సాంక జోరుకు 10వ ఓవర్లో జడేజా చెక్ పెట్టగా.. మొదటి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 11వ ఓవర్లో రాహుల్ సైతం అర్ధ శతకానికి చేరుకోగా.. కేఎల్‌కు జత కలిసిన నితీశ్ రాణా కూడా భారీషాట్లతో అలరించాడు. కానీ 15వ ఓవర్లో రాణా, 16 ఓవర్లో రాహుల్ నిష్క్రమించినా..ఢిల్లీ అప్పటికే విజయానికి చేరువైంది. ఇక, అశుతోష్ (25 నాటౌట్), స్టబ్స్ (18 నాటౌట్) లాంఛనాన్ని పూర్తి చేశారు.


నిస్సాంక (62)

జైస్వాల్, వైభవ్ విఫలం: ఈ సీజన్‌లో రాజస్థాన్‌కు ధనాధన్ ఆరంభాలిస్తున్న ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) ఈ మ్యాచ్‌లో తేలిపోయారు. వీరిద్దరిని కట్టడి చేసేందుకు పక్కా ప్రణాళిక రచించిన ఢిల్లీ ఫలితం రాబట్టింది. అయితే కెప్టెన్ రియాన్ పరాగ్, జురెల్ జోడీ మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ చక్కదిద్దింది. చివర్లో ఫెరీరా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో రాజస్థాన్ స్కోరు 220 పరుగులు దాటింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఆస్ట్రేలియా స్టార్ పేసర్ స్టార్క్‌కు సిక్సర్‌తో జైస్వాల్ స్వాగతం పలికాడు. కానీ తదుపరి బంతిని తెలివిగా ఫుల్ టాస్‌గా సంధించిన స్టార్క్.. జైస్వాల్ భారీ షాట్ కొట్టేలా ఊరించాడు. బంతి గాల్లోకి లేవగా స్టార్కే పరిగెత్తుకు వెళ్లి క్యాచ్ అందుకున్నాడు. ఇక..తన బౌలింగ్‌లో బౌండరీతో ఖాతా తెరిచిన వైభవ్‌ను వెంటనే ఓ యార్కర్‌తో జెమిసన్ క్లీన్‌బౌల్డ్ చేసి రాజస్థాన్‌కు షాకిచ్చాడు. తర్వాత జురెల్, పరాగ్ జాగ్రత్తగా ఆడుతూ వచ్చారు. కానీ ఆరో ఓవర్లో బ్యాటు ఝుళిపించిన పరాగ్.. జేమిసన్ బౌలింగ్‌లో 6,4,6తో 20 పరుగులు రాబట్టాడు. దాంతో పవర్ ప్లే ముగిసేసరికి రాజస్థాన్ 56/2తో నిలిచింది. మూడో వికెట్‌కు వందకు పైగా పరుగులు జోడించి ప్రమాదకరంగా మారుతున్న దశలో.. జురెల్‌ను క్యాచవుట్ చేసిన అక్షర్ ఢిల్లీకి ఊరటనిచ్చాడు. జెమిసన్ వేసిన 16వ ఓవర్లో పరాగ్ 4,4,4తో చెలరేగాడు. తర్వాతి ఓవర్లో జడేజా, పరాగ్‌ను మూడు బంతుల వ్యవధిలో స్టార్క్ పెవిలియన్ చేర్చి ప్రత్యర్థికి మరోసారి ఝలకిచ్చాడు. ఫెరీరా 18వ ఓవర్లో 20 పరుగులు, ఆపై స్టార్క్ బౌలింగ్‌లో 14 పరుగులు పిండుకోవడంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. చివరి ఓవర్లో శుభమ్ దూబే (6)ను నటరాజన్ వెనక్కి పంపినా.. మరోవైపు ఫెరీరా 18 పరుగులు కొల్లగొట్టాడు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి అండ్ బి) స్టార్క్ 6, వైభవ్ (బి) జేమిసన్ 4, జురెల్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 42, రియాన్ పరాగ్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 90, జడేజా (సి) అశుతోష్ (బి) స్టార్క్ 20, ఫెరీరా (నాటౌట్) 47, శుభమ్ దూబే (సి) అశుతోష్ (బి) నటరాజన్ 6, ఆర్చర్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 225/6; వికెట్ల పతనం: 1-6, 2-12, 3-114, 4-167, 5-168, 6-208; బౌలింగ్: స్టార్క్ 4-0-40-3, జేమిసన్ 4-0-48-1, అక్షర్ 4-0-39-1, కుల్దీప్ 4-0-41-0, నటరాజన్ 4-0-54-1.

ఢిల్లీ: నిస్సాంక (ఎల్బీ) జడేజా 62, రాహుల్ (సి) ఫెరీరా (బి) ఆర్చర్ 75, నితీశ్ రాణా (సి) జురెల్ (బి) దేశ్‌పాండే 33, స్టబ్స్ (నాటౌట్) 18, అశుతోష్ (నాటౌట్) 25, ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19.1 ఓవర్లలో 226/3; వికెట్ల పతనం: 1-110, 2-171, 3-177; బౌలింగ్: ఆర్చర్ 4-0-46-1, బర్గర్ 3-0-41-0, తుషార్ దేశ్‌పాండే 4-0-38-1, బ్రిజేశ్ 3.1-0-35-0, రవి బిష్ణోయ్ 2-0-28-0, జడేజా 3-0-33-1.

మావి స్థానంలో అంబరీష్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గాయంతో ఐపీఎల్‌కు దూరమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ మీడియం పేసర్ శివం మావి స్థానంలో ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఎడమ చేతివాటం బ్యాటర్, కుడి చేతివాటం మీడియం పేసర్ అయిన 18 ఏళ్ల అంబరీష్ తమిళనాడు తరఫున రంజీల్లో, అలాగే భారత అండర్-19 వరల్డ్‌కప్ (2026) జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించిన అనుభవం ఉంది. అంబరీష్‌ను రూ.30 లక్షల కనీస ధరకు ఎస్ఆర్‌హెచ్ తీసుకుంది.



పతకం ఖాయం

థామస్ కప్ సెమీస్‌కు భారత్
క్వార్టర్స్‌లో తైపీ చిత్తు

హర్సెన్స్ (డెన్మార్క్): ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మాజీ విజేత భారత పురుషుల జట్టు అదరగొట్టింది. పటిష్ఠ చైనీస్ తైపీని చిత్తుచేసిన మన బృందం సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాన్ని ఖరారు చేసుకొంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ సారథ్యంలోని భారత బృందం 3-0తో తైపీపై విజయం సాధించింది. తొలుత హోరాహోరీగా సాగిన సింగిల్స్‌లో లక్ష్యసేన్ 18-21, 22-20, 21-17తో ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ తిన్ చెన్‌ను ఓడించాడు. గంటా 28 నిమిషాల పోరులో తొలి గేమ్ ఓడిన లక్ష్య.. రెండుసార్లు మ్యాచ్ పాయింట్‌ను కాచుకొని పైచేయి సాధించాడు. అనంతరం జరిగిన డబుల్స్‌లో ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 23-21, 19-21, 21-12తో చియు సియాంగ్ చి/వాంగ్ చి లిన్ ద్వయంపై నెగ్గి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. తర్వాత రెండో సింగిల్స్‌లో యువ సంచలనం ఆయుష్ శెట్టి 21-16, 21-17తో ప్రపంచ 8వ ర్యాంకర్, ఆలింగ్లండ్ ఓపెన్ చాంపియన్ లిన్ చున్ యిని అలవోకగా చిత్తు చేయడంతో భారత్ 3-0తో తైపీపై స్పష్టమైన ఆధిక్యం అందుకుంది. సెమీఫైనల్లో ఫ్రాన్స్ లేదా జపాన్‌తో భారత్ తలపడనుంది. సెమీస్‌లో ఓడినా కనీసం కాంస్య పతకం భారత్ సొంతమవుతుంది. ఈ టోర్నీలో తొలిసారిగా 2022లో స్వర్ణం నెగ్గిన భారత్.. అంతకుముందు 1952, 1955, 1979లో కాంస్య పతకాలు దక్కించుకుంది.

మూడో స్థానంలోనే భారత మహిళలు

వన్డే ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో ప్రపంచ చాంపియన్ భారత జట్టు మూడో స్థానంలోనే కొనసాగుతోంది. శుక్రవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 124 పాయింట్లతో ఉంది. ఆస్ట్రేలియా (163) టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. అయితే భారత్ కంటే 4 పాయింట్లు అదనంగా ఉన్న ఇంగ్లండ్ (128) రెండో స్థానంలో నిలిచింది. నిరుడు వన్డే వరల్డ్ చాంపియన్‌గా ఆవిర్భవించిన భారత్..నాటినుంచి 3 వన్డేలే ఆడింది. ఆస్ట్రేలియాతో జరిగిన ఆ మూడు మ్యాచ్‌లలోనూ హర్మన్ సేన ఓడిపోయింది. దక్షిణాఫ్రికా (100), న్యూజిలాండ్ (93), శ్రీలంక (89) వరుసగా 4, 5, 6 స్థానాల్లో నిలిచాయి.

మహిళల టీ20 ప్రపంచకప్‌నకు భారత జట్టు ఎంపిక నేడే

ముంబై: వచ్చేనెలలో జరిగే ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టును శనివారం ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం అమితా శర్మ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ సమావేశం కానుంది. టీ20 వరల్డ్‌కప్ వచ్చేనెల 12 నుంచి జూలై 5 వరకు ఇంగ్లండ్, వేల్స్ వేదికలుగా జరగనుంది. గత నవంబరులో వన్డే ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు.. అనంతరం పొట్టి ఫార్మాట్‌లో నిలకడలేమి ఆటతీరుతో నిరాశపరుస్తోంది. ఈ నేపథ్యంలో మెగా టోర్నీకి ఎవరిని ఎంపిక చేస్తారు? ఎవరికి ఉద్వాసన పలుకుతారన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే, త్వరలో స్వదేశంలో భారత్ వేదికగా ఇంగ్లండ్ మహిళలతో జరిగే మూడు టీ20ల సిరీస్, ఏకైక టెస్టుతో పాటు ఇంగ్లండ్-ఎతో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం కూడా జట్టును శనివారమే ప్రకటించనున్నారు.

ఫిఫా కప్ హక్కుల్ని భారత్‌లో కొనేవాళ్లేరి?

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచ కప్ జూన్ 11న ప్రారంభం కానుంది. అయితే ఈ మెగా ఈవెంట్‌ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించే భాగ్యం భారత ఫుట్‌బాల్ ప్రేమికులకు లేనట్టేనా..? ఇందుకు కారణంగా..భారత్‌లో వరల్డ్ కప్ ప్రసార హక్కులకోసం ఏ ఒక్క సంస్థా ముందుకు రాకపోవడమే. జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరిగే ప్రపంచ కప్‌నకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న విషయం విదితమే. 48 జట్లు పాల్గొంటున్న టోర్నీలో మొత్తం 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక..భారత్‌లో ప్రత్యక్ష ప్రసారం లేకపోవడానికి కారణాలు ఏమిటంటే..

1. భారీ మొత్తం వల్లే..: భారత్‌లో ప్రపంచ కప్ మ్యాచ్‌ల ప్రసార హక్కుల ధరను ఫిఫా తొలుత రూ. 948 కోట్లుగా ఖరారు చేసింది. అయితే ఏ సంస్థా ముందుకు రాలేదు. దీంతో ఫిఫా ఆ మొత్తాన్ని రూ. 332 కోట్లకు తగ్గించింది. అయినా ఎవరూ ఆసక్తి చూపలేదు.

2. మ్యాచ్‌ల సమయమూ..: ప్రసార హక్కులకోసం ఏ సంస్థా ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మ్యాచ్‌ల సమయమే. మెగా టోర్నీలో మొత్తం 104 మ్యాచ్‌లు జరుగుతుండగా..అందులో 14 మాత్రమే భారత కాలమానం ప్రకారం రాత్రి 12 గంటల కంటే ముందు జరుగుతున్నాయి. ఫైనల్ సహా మిగతా మ్యాచ్‌లన్నీ రాత్రి 12 తర్వాతే మొదలవవుతాయి. దాంతో..అర్ధరాత్రి తర్వాత జరిగే మ్యాచ్‌లను భారత్‌లో ఎవరూ చూడరని బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు భావిస్తున్నాయి. చైనా, శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ్ దేశాలలో కూడా ఇదే పరిస్థితి.

3. పోటీ తగ్గడం..: 2022 ఫిఫా ప్రపంచ కప్ ప్రసార హక్కుల కోసం వయాకామ్ రూ. 450 నుంచి రూ. 550 కోట్లు చెల్లించింది. కానీ 2014, 2018 వరల్డ్ కప్‌ల ప్రసార హక్కులను సోనీ నెట్‌వర్క్ రూ. 600 కోట్ల మొత్తానికే దక్కించుకుంది. ప్రస్తుతం వయాకామ్, హాట్‌స్టార్ సంస్థలు విలీనమయ్యాయి. దాంతో హక్కుల కోసం పోటీ తగ్గింది.

4. ఐపీఎల్ సైతం: ఐపీఎల్ పూర్తయిన రెండు వారాలకే ఫిఫా ప్రపంచ కప్ మొదలవనుండడం కూడా బ్రాడ్‌కాస్ట్ సంస్థలు ఆసక్తి చూపకపోవడానికి ఇంకో కారణం. భారత్‌లోని కంపెనీలన్నీ తమ మార్కెటింగ్ బడ్జెట్ మొత్తాన్ని ఐపీఎల్‌కే కేటాయిస్తాయి. ఒక అంచనా ప్రకారం భారత్ క్రీడా మార్కెట్‌లో 89 శాతం డబ్బును క్రికెట్‌పైనే వెచ్చిస్తున్నాయి. మిగిలిన అన్ని క్రీడలపై కలిపి 11 శాతమే ఖర్చు చేస్తుండడం గమనార్హం.



ఎవరూ ముందుకు రాకపోతే..

ప్రసార హక్కుల మొత్తాన్ని ఫిఫా మరింత తగ్గించే వరకు వేచిచూడాలని జియో స్టార్ భావిస్తోందట. ఒకవేళ ఫిఫా అందుకు సిద్ధంగా లేకపోతే..ఫిఫా యాప్‌లోనే వరల్డ్ కప్‌ను స్ట్రీమింగ్ చేయాల్సి ఉంటుంది.



తిరుమల కిటకిట

రెండు నడక మార్గాల్లోనూ భక్తుల రద్దీ 9

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 2-5-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

వాణిజ్యమంట గ్యాస్



వాణిజ్య సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంపు.. బెజవాడలో 3,251కి చేరిన ధర

- 5 కిలోల సిలిండర్ మీద రూ.549 పెంపు
- ఒకేసారి ఈ స్థాయి పెరుగుదల ఇదే తొలిసారి
- లీటరు బల్క్ డీజిల్ ధర రూ.137 నుంచి రూ.149కి
- అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగానే నిర్ణయం
- ప్రభుత్వ చమురు సంస్థ ఐఓసీ ప్రకటన
- గృహవినియోగ సిలిండర్‌పై రూ.40-50, పెట్రోల్, డీజిల్‌పై రూ.4-5 పెరిగే చాన్స్: ప్రభుత్వ వర్గాలు



ఎన్నికలు కాగానే పెంచుతారని

చెప్పా.. అదే జరిగింది

త్వరలోనే పెట్రో బాదుడు: రాహుల్

న్యూఢిల్లీ, మే 1: వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెరిగింది. ఏకంగా రూ.993 పెంచుతూ ప్రభుత్వ చమురు సంస్థలు శుక్రవారం నిర్ణయం తీసుకున్నాయి. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు మొదలైన వాటిల్లో వినియోగించే 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.3,071కి చేరుకుంది. విజయవాడలో రూ.2250 ఉన్న వాణిజ్య సిలిండర్ ధర ఇప్పుడు రూ.3251కి చేరింది. ఆయా రాష్ట్రాల్లో ఉండే పన్నుల మేరకు ఇది వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు, 5 కిలోల సిలిండర్ ధరను చమురు కంపెనీలు రూ.549 మేర పెంచాయి. దీంతో ఆ సిలిండర్ ధర రూ.993కి చేరింది. వాణిజ్య సిలిండర్, 5 కిలోల సిలిండర్ ధరను ఒకేసారి ఇంత భారీగా పెంచటం ఇదే తొలిసారి. కాగా, ఎల్‌పీజీ గృహ వినియోగదారుల మీద మాత్రం చమురు సంస్థలు భారం మోపలేదు. దీంతో ఇళ్లలో వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ ధరలో మార్పు లేదు. అదే విధంగా రిటైల్ పెట్రోల్, డీజిల్, దేశీయ విమాన సర్వీసులు వినియోగించే ఇంధన ధరలను కూడా పెంచలేదు. టెలికాం సిగ్నల్ టవర్ల వంటి వాటిల్లో ఉపయోగించటానికి వాడే బల్క్ డీజిల్ ధరను ఇప్పుడున్న రూ.137 నుంచి రూ.149కి (లీటరుకి) పెంచారు. ఈ మేరకు 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' (ఐఓసీ) ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో వినియోగించే ఇంధనాల్లో దాదాపు 80 శాతం వాటా ఉన్న రిటైల్ పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్, కిరోసిన్ ధరలను పెంచలేదని.. అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరల ప్రభావం ఈ వినియోగదారుల మీద పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వాణిజ్య

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రంలో స్టార్ హోటళ్ల మెనూ ధరలు 10% పెంపు



కృష్ణా జిల్లా పమిడిముక్కల అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో సీఎం చంద్రబాబు

దద్దోజనం తిని కూర్చోవడం కాదు!

పార్టీ క్యాడర్‌నూ పట్టించుకోండి

- ఎన్నికల్లో కష్టపడేది వారే.. వారిని విస్మరిస్తే ఎలా?
- పామర్రు భేటీలో ఎమ్మెల్యేలపై సీఎం అసంతృప్తి

స్కిల్ సెంటర్లుగా

లేబర్ అడ్డాలు!

తొలుత 15 నగరాల్లో ఈ అడ్డాల ఏర్పాటు: సీఎం

- ఫోన్‌చేస్తే చాలు.. కార్మికులను పంపుతారు
- ఇవి సత్ఫలితాలిస్తే రాష్ట్రమంతటా పెడతాం
- కార్మికుల పిల్లలు కంపెనీ పెట్టే స్థాయికి ఎదగాలి
- కార్మికుల సంక్షేమానికి ఏటా రూ.615 కోట్లు
- అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం
- కార్మికుల్లో నైపుణ్యం పెంచితే అదనపు ఆదాయం
- ఇందులో భాగంగా 25 వేల మందికి శిక్షణ
- వైకుంఠపాళి వద్దు-ఎన్‌డీఏనే ముద్దు
- కూటమి రాకతో ప్రజలకు స్వాతంత్ర్యం
- కృష్ణా జిల్లాలో 'పేదల సేవలో' చంద్రబాబు
- పింఛన్ల పంపిణీ.. పామర్రు కార్యకర్తలతో భేటీ
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం

- ప్రస్తుతం కార్మికులు పనుల కోసం వచ్చి ఎండకు మాడుతూ, వర్షానికి తడుస్తూ నిలబడుతున్నారు. లేబర్ అడ్డాలు ఏర్పాటుచేస్తే వాటి ద్వారా పని ఉంటే వెళ్తారు. లేకపోతే అక్కడే నైపుణ్య శిక్షణ తీసుకుంటారు.
- పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, వ్యవసాయ రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనివల్ల కష్టజీవులకు చేతినిండా పని, జీవనోపాధి దొరుకుతోంది.

- సీఎం చంద్రబాబు



లేబర్ అడ్డా నమూనా కేంద్రం

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మికులంతా గౌరవంగా జీవించేందుకు లేబర్ అడ్డాలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 15 నగరాల్లో ఈ అడ్డాలు నిర్మిస్తామన్నారు. అవసరమైన వారు ఫోన్‌చేస్తే ఇవి కార్మికులను సమకూరుస్తాయని చెప్పారు. రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారుస్తామన్నారు. మేడే సందర్భంగా కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం

మిగతా 11వ పేజీలో...

జగన్‌కు మానసిక సమస్య.. అది గొడ్డలి పార్టీ: సీఎం



విశాఖ జిల్లా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల విజయోత్సవ ర్యాలీ

ట్రెండింగ్‌లో సర్కారు బడి

- టెన్త్ ఫలితాల్లో సత్తా.. ప్రశంసిస్తూ పత్రికల్లో ప్రభుత్వం ప్రకటన.. కొత్త ఒరవడి సూపర్ హిట్
- కార్పొరేట్ తరహాలో.. మా టాపర్లంటూ ఫొటోలు
- అధికారిక ప్రకటనపై సర్వత్రా సానుకూల స్పందన
- ప్రభుత్వ స్కూళ్లకు ఊతమిచ్చేలా చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'టెన్త్ ఫలితాల్లో బెస్ట్...పనితీరులో ఫస్ట్... వీరే మా టాపర్లు!... ఇది కార్పొరేట్ విద్యా సంస్థల ప్రకటన అనుకుంటున్నారా? కానే కాదు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల మార్కులు, వారి ఫొటోలతో ప్రభుత్వం అధికారికంగా పత్రికలకు ఇచ్చిన ప్రకటన ఇది. శుక్రవారం ఉదయం లేచి దినపత్రికలు చూసినవారిలో చాలా మంది ఈ యాడ్ చూసి ఆశ్చర్యపోయారు. దశాబ్దాలుగా పదోతరగతి ఫలితాల మరుసటి రోజున కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు వారి విద్యార్థుల ఫలితాలతో ఊదరగొట్టడమే చూసినవారికి, ఇది కొత్త ట్రెండ్‌లా అనిపించింది. శుక్రవారం సోషల్ మీడియాలో ఇది ఒక ప్రధాన చర్చగా సాగింది. కార్పొరేట్ తరహాలో, ప్రభుత్వం 'వీరే మా టాపర్లు' అని ప్రకటించుకోవడం గతంలో జరగలేదు. కూటమి ప్రభుత్వం తొలిసారి అధికారికంగా ప్రకటనలు ఇచ్చింది. 596 మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులు, 595 మార్కులు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులతో 'సగర్వంగా నిలబడి' పేరుతో ఇచ్చిన ప్రకటన సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం

మిగతా 9వ పేజీలో...

సర్వభ్రష్టం

సకల వ్యవస్థల వైఫల్యంతోనే కల్తీ నెయ్యికి దారి

జగన్ హయాంలో నాణ్యతకు టీటీడీ పాతర

- కల్తీని పట్టే వ్యవస్థలు కరువు.. చెలరేగిన 'కల్తీ' దారులు
- వారు కోరినట్టు టెండరు రూల్స్‌ను మార్చిన వైనం
- తెలిసీ.. సడలింపునకు సింఘాల్ ఆమోదం
- 'సడలింపు'తో రాచమార్గంలో కల్తీ నెయ్యి దందా
- సింఘాల్ సహా నాటి అధికారులంతా దోషులే
- ఘోరంగా కొనుగోలు విభాగం.. ప్రక్షాళన చేయాలి
- తక్కిన వ్యవస్థలనూ భారీగా సంస్కరించాలి
- లోయెస్ట్ ప్రైస్ బిడ్.. విధానానికి స్వస్తి పలకాలి
- రిటైర్డు సీఎస్ దినేశ్‌కుమార్ కమిషన్ సిఫారసులు





(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విధ్వంసం సృష్టించిన గత వైసీపీ ప్రభుత్వం...టీటీడీ పాలననూ సర్వభ్రష్టం పట్టించిందని రిటైర్డు సీఎస్ దినేశ్‌కుమార్ ఏకసభ్య కమిషన్ నివేదిక తేల్చింది. పవిత్ర లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి సరఫరా నిబంధనల సడలింపు విషయంలో తెలిసీ.. అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ నిర్లక్ష్యం వహించారని ఆ నివేదికలో కమిషన్ ఆక్షేపించినట్టు సమాచారం. 'అప్పటికి ఐదు నెలల క్రితం నెయ్యి సరఫరాలను పటిష్ఠం చేసేందుకు నాటి ప్రభుత్వం (టీడీపీ సర్కారు) చర్యలు తీసుకున్నప్పుడు ఈవోగా సింఘాలే ఉన్నారు. అలాంటిది 'సడలింపు'ను తానే ఆ తర్వాత సాగనీయడం బాధ్యతారహితమే' అని కమిషన్ తప్పు బట్టినట్లు తెలిసింది. నెయ్యి సడలింపు నిబంధనలతోపాటు

మిగతా 11వ పేజీలో...



చందు

అమెరికాలో కర్నూలు యువకుడి

ఆత్మహత్య

చికాగోలో మాస్టర్స్ చేసిన చందు

ట్రంప్ తీరుతో ఉద్యోగం రాదనే మనస్తాపంతోనే

12

గ్రీన్‌కార్డ్ లాటరీకి చెల్లు!

తల్లిదండ్రులు, తోబుట్టువులకు ఫ్యామిలీ స్పాన్సర్‌షిప్ కట్

కేవలం జీవిత భాగస్వాములు, మైనర్ పిల్లలకే పరిమితం?

2

పన్ను ఆదాయం 12% వృద్ధి

ఏప్రిల్‌లో రాబడి రూ. 5,542 కోట్లు

జీఎస్టీ అమల్లోకి వచ్చాక నెలవారీ వసూళ్లలో ఇదే అత్యధికం

12

నీట్ పరీక్ష రేపే

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటూ సీఎం చంద్రబాబు పనులు పరుగులు పెట్టిస్తున్నారు. కానీ.. శాఖల ఉన్నతాధికారులు మాత్రం నత్తకు నడకలు నేర్పేలా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు సంబంధించిన పనుల విషయం ఎలా ఉన్నా.. శాఖల్లోని ఉద్యోగులకు సంబంధించిన కీలక పదోన్నతుల వ్యవహారంలోనూ వారు నిమ్మకు నీరెత్తినట్టు మౌనంగా ఉంటున్నారు. ఫలితంగా ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారం.. ఎటూ తేలడం లేదు. తాజాగా రాష్ట్రపతి ఉత్తర్వుల రూపంలో మరో అడ్డంకి ఎదురైంది.

పదోన్నతులపై నిర్లక్ష్యం

సీఎస్, జీఏడీ వెంటపడినా బేఖాతర్



- ఆర్థిక, అసెంబ్లీ హెచ్‌వోడీల్లో పెండింగ్
- మిగతా అన్ని శాఖల్లోనూ ఇదే దుస్థితి
- ఉన్నతాధికారుల ధోరణిపై అసంతృప్తి
- ప్రమోషన్ల విధివిధానాలు బుట్టదాఖలు
- తాజాగా రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోకి
- ఫలితంగా ఐదారు మాసాలు ఆగాల్సిందే
- ప్రభుత్వంపై ఉద్యోగుల రుసరుస

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు మానసిక స్థైర్యం కలిగిస్తాయి. చేస్తున్న ఉద్యోగంలో వారికి పదోన్నతి కలిగితే ఆ ఆనందమే వేరు. ఈ విషయంలో వారికి ఎలాంటి అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ-డీపీసీ విధానం అమల్లోకి తెచ్చింది. పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు మరింత

మిగతా 10వ పేజీలో...

నిధులకు ఇబ్బంది లేదు!

పోలవరంపై కేంద్రం స్పష్టీకరణ.. మరో 3,300 కోట్లు ఇచ్చేందుకు ఓకే

పనుల్లో వేగం పెంచండి.. రాష్ట్ర అధికారులకు నిర్దేశం

- కేంద్ర సంస్థలతో ఢిల్లీలో కాంతారావు సమీక్ష
- సీఎస్ సాయిప్రసాద్ బృందం హాజరు
- నెలకు 500 కోట్లయినా ఖర్చు పెట్టరేం?
- తొలి దశ 2027 జూన్‌కి పూర్తికావాలి
- పొరుగు రాష్ట్రాల అభ్యంతరాల సంగతి మేం చూసుకుంటాం.. వేగం పెంచండి
- భూసేకరణ, పునరావాసం స్పీడూ పెరగాలి

నాణ్యతపై సీడబ్ల్యూఎంఆర్ఎస్

దృష్టి పెట్టాలి

- నెలలో 2 సార్లయినా ప్రాజెక్టు వద్దకు వెళ్లాలి
- రోజువారీ పనులపై వాప్కోస్ సమీక్షించి పీపీఏకు సమాచారమివ్వాలి: కాంతారావు



అమరావతి/న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు 2027 జూన్ నాటికి పూర్తి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరేందుకు తగు సహకారం అందించాలని కేంద్ర సంస్థలను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తికి నిధుల కొరత ఉండదని.. ఇప్పటికే

మిగతా 12వ పేజీలో...

కాగ్నిజెంట్ పనులకు శ్రీకారం

విశాఖలో మూడు దశల్లో క్యాంపస్ నిర్మాణం

cognizant

- పర్యావరణ అనుమతులు మంజూరు
- ఓ ఫేజ్‌లో 13 అంతస్తుల టవర్, 4 పోడియంలు
- కార్ పార్కింగ్ కోసం 5 ఫ్లోర్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రముఖ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ విశాఖపట్నంలో క్యాంపస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మూడు దశల్లో భవనాల నిర్మాణం పూర్తవుతుంది. ఈ క్యాంపస్‌లో 13 అంతస్తుల ఐటీ టవర్‌తో పాటు ఇతర నిర్మాణాలు కూడా ఉంటాయి. వీటికి అవసరమైన పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. కాగ్నిజెంట్‌కు

మిగతా 10వ పేజీలో...



నేను ఎమ్మెల్సీని.. తెలుసా?

- నాకు ప్రత్యేక సదుపాయాలు కల్పించండి
- రాజమండ్రి జైల్లో అనంతబాబు హల్‌చల్
- పాత పరిచయాలతో సిబ్బందిపై రుబాబు
- కోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చుకోవాలని అధికారులు చెప్పినా అదే ప్రవర్తన

కాకినాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ హత్య కేసులో సాక్షులను బెదిరించిన కేసులో ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తీరు ఏమాత్రం మారడం లేదు. తాను

మిగతా 12వ పేజీలో...



నాలుగేళ్ల బాబును పొదివిపట్టుకున్న తల్లి

భయపడకు బిడ్డా.. కాపాడుకుంటా!

- మధ్యప్రదేశ్ పడవ ప్రమాదంలో తల్లి, నాలుగేళ్ల కొడుకు మృతి
- బిడ్డను కాపాడుకునేందుకు తన ప్రాణాలనూ లెక్క చేయని తల్లి
- ప్రమాదంలో మొత్తం 9మంది మృతి.. ఆరుగురు గల్లంతు

జబల్‌పూర్, మే 1: భయపడకు నాన్నా.. నేనున్నా.. నీకేం కాదు.. నేను నిన్ను కాపాడుకుంటా.. అని ఆ తల్లి ధైర్యం చెప్పడానికి ప్రయత్నించిందేమో.. ఏదైనా అద్భుతం జరుగుతుందేమో, ఎవరైనా వచ్చి కాపాడుతారేమో అని చివరిశ్వాస వరకు ఎదురు చూసిందేమో.. తన ప్రాణాలను లెక్కచేయకుండా కొడుకును అదిమి పట్టుకొని, ప్రాణాలను వదిలేసింది ఆ తల్లి. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా బర్గి డ్యామ్‌లో పడవ మునిగిన ఘటనలో చనిపోయిన ఈ తల్లీకొడుకుల చిత్రం అందరినీ కలచివేస్తోంది. బర్గి డ్యామ్ నర్మదా నదిపై ఉంది. ఈ డ్యామ్‌లో గురువారం సాయంత్రం ఓ పర్యాటక పడవ తుఫాను లాంటి బలమైన గాలుల కారణంగా తిరగబడింది. దీంతో, 9 మంది నీట మునిగి చనిపోయారు. ఆరుగురు గల్లంతయ్యారు. నలుగురి మృతదేహాలను గురువారమే వెలికితీయగా, శుక్రవారం మరో ఐదు మృతదేహాలను బయటకు తీశారు. శుక్రవారం వెలికితీసిన ఐదు మృతదేహాల్లో ఈ తల్లి, ఆమె నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నారు. వీరిద్దరు ఒకరినొకరు గట్టిగా పట్టుకొని ఉన్న ఆ దృశ్యం అక్కడ ఉన్నవారికి కంటతడి తెప్పించింది.

ఆ టోల్ ప్లాజా వద్ద ఆగే పని లేదు!

న్యూఢిల్లీ, మే 1: దేశంలోనే తొలిసారిగా అవరోధం లేని టోల్ వ్యవస్థ(బారియర్ లెస్ టోల్ సిస్టమ్)ను గుజరాత్‌లో సూరత్-భరుచ్ హైవేలోని చౌరాసి టోల్‌ప్లాజా వద్ద ప్రారంభించినట్లు కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరి శుక్రవారం ప్రకటించారు. జాతీయ రహదారి 48పై గల టోల్‌ప్లాజా వద్ద ఈ బహుళ వరుసల అవరోధం లేని టోల్ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. ఆటోమెటిక్ నెంబరు ప్లేట్ గుర్తింపు, ఫాస్టాగ్‌లతో కూడిన ఈ అత్యాధునిక వ్యవస్థ ద్వారా టోల్ ప్లాజా వద్ద వాహనాలు ఆగే పనిలేకుండానే టోల్ వసూలు పూర్తవుతుందని గడ్కరి తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇది భారత టోల్ వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

51వేల కోట్లతో కొత్తగా 62 రవాణా నౌకలు

న్యూఢిల్లీ, మే 1: భారీ పెట్టుబడులతో నౌకారంగాన్ని శక్తివంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. దాదాపు రూ.51,383 కోట్లతో కొత్తగా 62 రవాణా నౌకలను సమకూర్చుకోనుంది. కేంద్ర ఓడరేవుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మంత్రిత్వ శాఖల సబ్‌కమిటీ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. హోర్ముజ్ జల సంధి వద్ద పరిస్థితిని, దానివల్ల సముద్ర వాణిజ్య రవాణా మార్గాల్లో తలెత్తుతున్న ప్రతిబంధకాలను సమావేశంలో చర్చించారు. ఈ క్రమంలో దీర్ఘకాలిక అవసరాల రీత్యా రవాణానౌకల సంఖ్యను పెంచుకోవాలని నిర్ణయించారు. తద్వారా ఈ రంగం (షిప్పింగ్ ఫ్లీట్) సామర్థ్యాన్ని 2.85 మిలియన్ గ్రాస్ టన్నేజ్‌కు (జీటీ) పెంచవచ్చునని అంచనా వేశారు.

బెంగాల్‌లోని 15 బూత్‌ల్లో నేడు రీపోలింగ్

కోల్‌కతా, మే 1: పశ్చిమ బెంగాల్‌లోని 15 పోలింగ్ బూత్‌ల్లో శనివారం రీపోలింగ్ జరపాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. బుధవారం జరిగిన ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్టు రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు సమర్పించిన నివేదికలు ఆధారంగా శుక్రవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. మగ్రహాట్ పశ్చిమ నియోజవర్గంలోని 11 బూత్‌లు, డైమండ్ హార్బర్‌లోని నాలుగు బూత్‌ల్లో రీపోలింగ్ జరగనుంది. కాగా, బెంగాల్‌లోని ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా కేవలం కేంద్రప్రభుత్వ ఉద్యోగులనే నియమించాలన్న ఈసీ ఆదేశాలను సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తుండడంతో శనివారమే అత్యవసరంగా విచారణ జరపాలని కోరనుంది.

భారత పౌరసత్వ నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ, మే 1: పౌరసత్వ నిబంధనలు 2009కి పలు మార్పులను జోడిస్తూ పౌరసత్వ(సవరణ) నిబంధనలు 2026ను కేంద్ర హోంశాఖ నోటిఫై చేసింది. ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డుదారులు, పౌరసత్వ దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియల్లో డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్ 7ఏ కింద ఓసీఐ కార్డు నమోదు, ఓసీఐ హోదాను వదులుకోవడానికి సబంధించిన అన్ని దరఖాస్తులను ఇకనుంచి ప్రభుత్వం నిర్దేశించిన అధికారిక పోర్టల్ ద్వారానే దాఖలు చేయాలని స్పష్టం చేసింది. రెండు ప్రతులుగా దరఖాస్తులు సమర్పించాలంటూ గతంలో ఉన్న నిబంధనను తొలగించింది. గురువారం ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. భారత పాస్‌పోర్టును కలిగి ఉన్న ఒక మైనర్.. ఏ సమయంలోనూ మరో దేశ పౌరసత్వాన్ని కలిగి ఉండకూడదు.

గ్రీన్‌కార్డ్ లాటరీకి చెల్లు..మెరిట్ వ్యవస్థ అమలు

- 'అమెరికన్స్ ఫస్ట్ ఇమిగ్రేషన్ యాక్ట్' బిల్లులో ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికా వలస విధానంలో సమూల మార్పులు తీసుకొస్తూ అలబామా రిపబ్లికన్ ప్రతినిధి బారీ మూర్ కొత్త బిల్లును ప్రతిపాదించారు. వీసా లాటరీ విధానాన్ని రద్దుచేసి, ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డుల స్థానంలో పాయింట్ల ఆధారిత మెరిట్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అందులో సూచించారు. కుటుంబ స్పాన్సర్‌షిప్‌ను జీవిత భాగస్వాములు, వారి మైనర్ పిల్లలకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఈ నిబంధనతో వీసాదారుల తల్లిదండ్రులు, తోబుట్టువులు, వయోజనులైన పిల్లలకు అవకాశం లేకుండా పోతుందని 'ఫ్యాక్స్ న్యూస్' నివేదించింది. ట్రంప్ ప్రతిపాదించిన 'అమెరికన్స్ ఫస్ట్' వలస విధానానికి ఈ బిల్లు దగ్గరగా ఉందని పేర్కొంది. పాయింట్ల ఆధారిత మెరిట్ వ్యవస్థలో భాగంగా వయసు, విద్యార్హతలు, సైన్యంలో చేసిన సేవ, ఆంగ్ల భాషలో ప్రావీణ్యం, జీతం తదితర అంశాల ఆధారంగా పాయింట్లు కేటాస్తారు.

హెచ్-1బీ అవకతవకలపై దర్యాప్తు

(డాలస్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగంపై అమెరికా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ అంశంపై దర్యాప్తులో భాగంగా ఉత్తర టెక్సాస్‌కు చెందిన పలు ఐటీ కంపెనీలకు టెక్సాస్ అటార్నీ జనరల్ కెన్ ప్యాక్స్టన్ 'సివిల్ ఇన్వెస్టిగేటివ్ డిమాండ్స్ (సీఐడీస్)' జారీ చేశారు. వీసా మోసాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. 30కంపెనీలకు సీఐడీలు జారీచేయగా.. వీటిలో ప్రవాసాంధ్రులకు చెందిన సంస్థలు కూడా ఉన్నాయి. టెక్‌ప్రో ఐటీ, ఫేమ్ పీబీఎక్స్, ఫస్ట్ ర్యాంకింగ్ టెక్నాలజీస్, క్యూబిట్జ్ టెక్ సిస్టమ్స్, బ్లూమింగ్ క్లౌడ్స్, విరాట్ సొల్యూషన్స్, ఓక్ టెక్నాలజీస్, టెక్‌పాత్, టెక్ క్వెన్సీ వంటి సంస్థలు అనుమానిత జాబితాలో ఉన్నాయని అటార్నీ జనరల్ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

రీల్స్ పిచ్చితో నిప్పంటించుకున్నాడు..

- శ్రీసత్యసాయి జిల్లాలో ఇంటర్ విద్యార్థికి తీవ్ర గాయాలు

కొత్తచెరువు, మే1(ఆంధ్రజ్యోతి): రీల్స్ పిచ్చితో ఇంటర్ విద్యార్థి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం పోతుకుంటలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన అంజనేయులు కుమారుడు శివకుమార్ ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. గ్రామంలోని పాత సచివాలయం వద్ద స్నేహితులతో కలిసి శుక్రవారం రీల్స్ చేశాడు. ఈ క్రమంలో శివకుమార్ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు ఎక్కువ కావడంతో అతని స్నేహితులు చొక్కాను లాగేశారు. అప్పటికే శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

వాణిజ్యమంట గ్యాస్

(మొదటి పేజీ తరువాయి)

సిలిండర్ల మీద భారీ పెంపును సమర్థించుకుంటూ.. దేశంలోని మొత్తం ఎల్‌పీజీ వినియోగంలో వాణిజ్య సిలిండర్ల వాటా 1 శాతం లోపే ఉంటుందని పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, దేశీయ వినియోగదారులను కాపాడుకుంటూనే ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో యుద్ధం అనంతరం ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. కాగా, వాణిజ్య సిలిండర్ మీద ఈ ఏడాది మార్చి 1న రూ.28, మార్చి 7న రూ.114, ఏప్రిల్‌లో రూ.196 మేర చమురు కంపెనీలు పెంచాయి.



త్వరలో పెట్రోల్, డీజిల్ మీద రూ.4-5 భారం!

రిటైల్ పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరల పెంపు అవకాశాలు లేకపోలేదని శుక్రవారం కేంద్రప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. పెట్రోల్, డీజిల్ మీద లీటరుకు రూ.4-5, సిలిండర్‌పై రూ.40-50 వరకు పెంచే అవకాశాలున్నాయని, దీనిపై వచ్చే వారం రోజుల్లో నిర్ణయం వెలువడవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, ఇటీవల నాలుగు రాష్ట్రాల ఎన్నికల సమయంలో.. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగనున్నాయన్న ఊహాగానాలను కేంద్రప్రభుత్వం పలుమార్లు ఖండిస్తూ ప్రకటనలు జారీ చేసింది. ఆ రాష్ట్రాల్లో పోలింగ్ ముగియగానే.. చమురు ధరలు పెరిగే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించటం గమనార్హం. మరోవైపు, వాణిజ్య సిలిండర్ ధరను భారీగా పెంచటాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 6వ తేదీన కేరళలో హోటళ్లు, రెస్టారెంట్ల బంద్ జరపనున్నట్లుగా ఆ రాష్ట్ర హోటళ్లు, రెస్టారెంట్ల సంఘం ప్రకటించింది. కేరళలో గత ఐదు నెలల్లో వాణిజ్య సిలిండర్ ధర రూ.1498 మేర పెరిగిందని, ఇది అన్యాయమని, దీనిపై దశల వారీగా పోరాటం నిర్వహిస్తామని తెలిపింది. కేరళకు చెందిన కేంద్ర మంత్రి సురేష్‌గోపి.. వాణిజ్య సిలిండర్ ధర పెంపును సమర్థించారు. అంతర్జాతీయంగా పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు.

గ్యాస్ బండకు నిబంధనలు కఠినతరం

దక్షిణాసియా యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలో ఏర్పడ్డ ఒత్తిళ్లను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ కంపెనీలు ఎల్‌పీజీ పంపిణీ వ్యవస్థపై దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పంపిణీకి కొన్ని నిబంధనలను మే 1 నుంచి అమలులోకి తెచ్చింది. గ్యాస్ సరఫరాలో పారదర్శకత పెంపు, దుర్వినియోగ నివారణ, సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠపరచడమే లక్ష్యంగా ఈ నిబంధనలను అమలు చేస్తున్నట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో పట్టణప్రాంత వినియోగదారులకు తదుపరి బుకింగ్‌కు వ్యవధి 21 రోజులు ఉండగా దానిని 25 రోజులకు పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యవధి 45 రోజులుగా ఉంది. గ్యాస్ బుక్ చేసిన వెంటనే వినియోగదారుని రిజిస్టర్ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. బండ డెలివరీ అయిన రోజు ఆ ఓటీపీ(డీఏసీ) ఏజెంట్‌కు ఇవ్వడం తప్పనిసరి. అలాగే ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఆధార్ ఆధారిత కేవైసీ తప్పనిసరి. ఎల్‌పీజీ, పైప్డ్ నాచురల్ గ్యాస్(పీఎన్‌జీ)... రెండూ వాడుతున్న వినియోగదారులకు ఇక నుంచి ఒకటి మాత్రమే అందుబాటులో ఉంటుంది. వాళ్లు తక్షణమే ఎల్‌పీజీ కనెక్షన్‌ను సరెండర్ చేయాలి.

ఇప్పటికి గ్యాస్ మంటలు.. తర్వాత పెట్రో బాదుడు

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శ

న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతానికి గ్యాస్ మంటలని, దీని తర్వాత పెట్రో బాదుడు ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఎన్నికలు ముగియగానే సామాన్యుడిపై ప్రభుత్వం ధరల భారం మోపనుందని తాను ఇటీవలే హెచ్చరించిన సంగతిని శుక్రవారం ఎక్స్‌లో ఒక పోస్ట్ ద్వారా గుర్తు చేశారు. 'ఈ రోజు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.993 పెరిగింది. ఒకే రోజులో ఇంత భారీగా పెరగడం ఇదే మొదటిసారి. ఎన్నికల తాలూకు అసలు బిల్లు ఇదే. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు చూస్తే.. ధర ఏకంగా రూ.1,380 పెరిగింది. కేవలం మూడు నెలల్లో 81 శాతం భారీ పెరుగుదల ఇది. టీ కొట్టు, దాబా, హోటల్, బేకరీ, స్వీట్ షాపు.. ఇలా ప్రతి ఒక్కరి కిచెన్ మీద భారం పెరిగింది. దీని ప్రభావం అందరి మీదా ఉంటుంది. మొదటి దెబ్బ గ్యాస్‌పై పడింది. తదుపరి దెబ్బ పెట్రోల్-డీజిల్‌పై పడబోతోంది' అని రాహుల్ గాంధీ హెచ్చరించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువ ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం ఆ లాభాల్ని మూటగట్టుకుందని, ఇప్పుడు ద్రవ్యోల్బణం, చమురు ధరలు పెరగ్గానే ఆ భారాన్ని జనం మీద రుద్దుతోందని విమర్శించారు.

లోకం తీరు



349 కిలోల కొకైన్ ముంబైలో పట్టివేత

- దాని విలువ రూ.1,745 కోట్లు

ముంబై, మే 1: దేశ ఆర్థిక రాజధాని ముంబై, చుట్టుపక్కల ప్రాంతాల్లోని లాజిస్టిక్ కారిడార్స్‌లో భారీగా మాదకద్రవ్యాల దందాకు పాల్పడుతున్న అంతర్జాతీయ కొకైన్ సిండికేట్ గుట్టును నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ) అధికారులు రట్టు చేశారు. వారి నుంచి రూ.1,745 కోట్ల విలువ చేసే 349 కిలోల అత్యున్నత శ్రేణి కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'వైట్ స్ట్రైక్' అనే సంకేత నామంతో నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా.. ఎన్సీబీ అధికారులు మాదకద్రవ్యాల అక్రమరవాణా దందాపై 6నెలల పాటు నిఘా పెట్టి, కీలక సమాచారాన్ని సేకరించి.. పక్కా ప్రణాళికతో, సమన్వయంతో నవీముంబై-థానే జిల్లాల్లోని కలంబొలి-భీవండీ కారిడార్‌లో దాడులు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ఆధారంగా ఎన్సీబీ అధికారులు.. కలంబొలి ప్రాంతంలో ఒక మారుతీ సుజుకీ కారును అడ్డగించి, అందులో తనిఖీలు చేయగా 136 కిలోల కొకైన్ దొరికింది. ఒక్కొక్కటీ కిలో చొప్పున మొత్తం 136 ప్యాకెట్లలో కొకైన్ నింపి దాన్ని క్రికెట్ ప్యాడ్లు, గ్లవ్స్ మధ్య దాచి, ఆ కారులో తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కారులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించి, అతడిచ్చిన సమాచారం ఆధారంగా.. భీవండీలోని ఒక గిడ్డంగిలో దాచిన 213 కిలోల కొకైన్‌ను (కిలో ప్యాకెట్లు 213) స్వాధీనం చేసుకున్నారు. "దిగుమతి చేసుకున్న యంత్రాల ఖాళీ భాగాల్లో ఈ కొకైన్‌ను విదేశాల నుంచి అక్రమంగా తరలించినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఒక్కో ప్యాకెట్‌నూ తొమ్మిది పొరల పాలిథిన్ కవర్‌లో చుట్టి, నల్లటి జిడ్డు కోటింగ్ వేశారు." అని ఎన్సీబీ అధికారి ఒకరు తెలిపారు. ఎన్సీబీ అధికారులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. చిన్న క్లూ ఆధారంగా ఇంత పెద్ద నెట్‌వర్క్‌ను ఛేదించడం అభినందనీయమన్నారు.

రాష్ట్రంలో స్టార్ హోటళ్ల మెనూ ధరలు 10% పెంపు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు భారీగా పెరిగినందున స్టార్ హోటళ్లలో మెనూ ధరలు 10% పెంచాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు ఏపీ స్టార్ హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సిలిండర్ ధర ఒకేసారి రూ.993 పెంచడంతో హోటళ్ల రంగం కుదేలవుతుందన్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చుల వల్ల తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో వేలాది మంది కార్మికుల ఉపాధిని కాపాడేందుకు, హోటల్ రంగాన్ని నిలబెట్టుకునేందుకు గత్యంతరం లేని పరిస్థితుల్లో ధరల పెంపు నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఫోన్లలో హెచ్చరిక సందేశాలు.. కంగారొద్దు

సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ సిస్టమ్‌ను పరీక్షిస్తున్న ఎన్‌డీఎంఏ

న్యూఢిల్లీ, మే 1: ఈ వారంలో ఎప్పుడైనా మీ ఫోన్ ఉన్నట్టుండి పెద్దగా శబ్దం చేసినా, తెర అంతా కనిపించేలా ఏదైనా సందేశం వచ్చినా.. కంగారు పడకండి. అది.. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ), టెలికమ్యూనికేషన్స్ విభాగంతో కలిసి చేస్తున్న 'సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ సిస్టమ్'కు సంబంధించిన ట్రయల్‌లో భాగంగా వచ్చిన సందేశం అయి ఉంటుంది. భూకంపాలు, పిడుగులు, సునామీలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఒక ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఒకేసారి సందేశం అందజేయడానికి ఈ అత్యవసర హెచ్చరికల వ్యవస్థను వినియోగిస్తారు. దీనివల్ల నెట్‌వర్క్ ఎంత రద్దీగా ఉన్నా ప్రజలకు సమాచారం వేగంగా అందుతుంది. పూర్తిగా దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకురానున్నారు.

ఖేరాకు ముందస్తు బెయిల్

- అస్సాం సీఎం హిమంత భార్య మీద ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు మంజూరు
- ఎన్నికల వేళ విమర్శల ఆధారంగా వ్యక్తిగత స్వేచ్ఛను హరించొద్దని వ్యాఖ్య



న్యూఢిల్లీ, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంతబిస్వశర్మ భార్య రినికి భూయాన్‌పై నిరాధార ఆరోపణలు చేశారనే కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రినికి భూయాన్‌కు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో అక్రమ ఆస్తులు ఉన్నాయని.. ఆ ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో హిమంత వెల్లడించలేదని పవన్ ఖేరా ఆరోపించారు. ఇవి తప్పుడు ఆరోపణలని రినికి ఫిర్యాదు చేయటంతో ఖేరాపై అస్సాంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 7న ఢిల్లీలోని ఖేరా నివాసానికి పోలీసులు వెళ్లినప్పటికీ ఆయన అక్కడ అందుబాటులో లేరు. ఈ క్రమంలో ఖేరా తొలుత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఏప్రిల్ 10న వారం రోజుల పాటు ట్రాన్సిట్ ముందస్తు బెయిల్ లభించింది. దీనిపై అస్సాం ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఆ బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. అనంతరం సుప్రీంకోర్టు సూచన మేరకు ఖేరా గౌహతి హైకోర్టును ఆశ్రయించగా నిరాశ ఎదురైంది. గౌహతి హైకోర్టు తీర్పును ఖేరా సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పవన్ ఖేరా తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ.. రాజకీయ ప్రచారంలో భాగంగా చేసిన కొన్ని వ్యాఖ్యల ఆధారంగా అరెస్టులు చేయడం సమంజసం కాదని కోర్టుకు విన్నవించారు. అస్సాం ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ వాదనలను తోసిపుచ్చారు. పత్రికా సమావేశంలో ఖేరా ప్రదర్శించిన పత్రాలు నకిలీవని తేలిందని చెప్పారు. ఆ పత్రాలను ఎవరు, ఎక్కడ తయారు చేశారు? అనే అంశాలను వెలికి తీయాలంటే కస్టడీ విచారణ తప్పనిసరని వాదించారు.

వ్యక్తిగత స్వేచ్ఛ అత్యంత విలువైనది

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం సరికాదని అభిప్రాయపడింది. ఎన్నికల సమయంలో రాజకీయ నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని గుర్తు చేసింది. అస్సాం సీఎం హిమంత సైతం పవన్ ఖేరాపై బహిరంగ ప్రకటనలు చేశారని, దీన్ని బట్టి ఈ వివాదానికి రాజకీయ రంగు ఉందని స్పష్టమవుతోందని తెలిపింది. వ్యక్తిగత స్వేచ్ఛను అత్యంత విలువైన ప్రాథమిక హక్కుగా ధర్మాసనం అభివర్ణించింది. పవన్ ఖేరాకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. న్యాయస్థానం అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతు విధించింది. తాము చేసిన వ్యాఖ్యలు ముందస్తు బెయిల్ మంజూరుకు మాత్రమే పరిమితమని తెలిపింది.

పంజాబ్ అసెంబ్లీలో రసాభాస!

- విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ఆప్ ప్రభుత్వం
- సీఎం మాన్ మద్యం తాగి సభకు వచ్చారంటూ కాంగ్రెస్ ఆరోపణ
- బ్రీత్ అనలైజర్ పరీక్షకు డిమాండ్
- తిరస్కరించిన స్పీకర్.. ప్రతిపక్ష సభ్యుల వాకౌట్



అసెంబ్లీలో మాట్లాడుతున్న పంజాబ్ సీఎం భగవంత్ మాన్

న్యూఢిల్లీ, మే 1 : పంజాబ్ శాసనసభలో శుక్రవారం తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తమ ప్రభుత్వంపై శాసనసభలో విశ్వాస తీర్మానం పెట్టారు. అంతకుముందు సీఎం మాన్ మద్యం తాగి సభకి వచ్చారంటూ కాంగ్రెస్ ఆరోపించడంతో రసాభస జరిగింది. సీఎం మాన్ సహా ఎమ్మెల్యేలందరికీ బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలన్న తమ డిమాండ్‌ను స్పీకర్ తిరస్కరించడంతో ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆపై, సీఎం మాన్ ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం నెగ్గింది. కార్మిక దినోత్సవం సందర్భంగా పంజాబ్ శాసనసభ శుక్రవారం ఒక్క రోజు ప్రత్యేకంగా సమావేశమైంది. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు గత నెల 24న బీజేపీలో చేరారు. దీంతో పంజాబ్‌లోని ఆప్ సర్కారు కూలిపోనుందని, ఆప్ ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నాటి సభలో సీఎం భగవంత్ మాన్ విశ్వాస తీర్మానాన్ని స్వయంగా ప్రవేశపెట్టారు. తమ పార్టీలో అంతా ఐకమత్యంగానే ఉన్నారని, తమ పార్టీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న తప్పుడు ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకే విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నానని సీఎం మాన్ ఈ సందర్భంగా చెప్పారు. విశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని సభ్యులను కోరారు. శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక శాసనసభ సమావేశానికి అందరూ కచ్చితంగా హాజరుకావాలంటూ ఆప్ తమ పార్టీ ఎమ్మెల్యేలందరికీ ముందుగానే విప్ కూడా జారీ చేసింది. పంజాబ్ అసెంబ్లీలో 117 స్థానాలు ఉండగా.. ఆప్‌నకు 94 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 16, శిరోమణి అకాలీదళ్‌కు ముగ్గురు, బీజేపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారితో పాటు సభలో ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కూడా ఉన్నారు. అయితే, సీఎం మాన్ విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సమయానికి స్వతంత్ర ఎమ్మెల్యే రాణా ఇంద్రప్రతాప్ సింగ్ మినహా ప్రతిపక్ష సభ్యులు ఎవ్వరూ సభలో లేరు. బీజేపీ సభను బాయ్‌కాట్ చేయగా..సీఎం భగవంత్ మాన్ మద్యం తాగి శాసనసభకు వచ్చారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సభ్యులు ముందుగానే సభ నుంచి వాకౌట్ చేశారు. శుక్రవారం నాటి సభలో సీఎం మాన్ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా సభలో మొబైల్ ఫోన్ వినియోగిస్తుండడాన్ని తప్పుబట్టారు. ఇందుకు స్పందించిన ఖైరా.. గత సమావేశాల్లో సీఎం సతీమణి విజటర్స్ గ్యాలరీలో కూర్చొని మొబైల్ ఫోన్ వినియోగించారని అన్నారు. దీంతో ఖైరా తీరుపై మాన్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. సీఎం మద్యం మత్తులో సభకు వచ్చారంటూ ఖైరా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అయితే, ఖైరా వ్యాఖ్యలకు మద్దతు పలికిన ప్రతిపక్ష నేత ప్రతాప్ సింగ్ బజ్వా... సీఎంతోపాటు ఎమ్మెల్యేలందరికీ బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయించాలని స్పీకర్‌కు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు స్పీకర్ తిరస్కరించగా కాంగ్రెస్ సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. మాన్‌పై కాంగ్రెస్ ఆరోపణలకు అకాలీదళ్ కూడా మద్దతు పలికింది.

మేం చేస్తున్నది యుద్ధమే కాదు!

కాంగ్రెస్ ఆమోదం లేకపోవడంతో ట్రంప్ యంత్రాంగం నాలుక మడత

- ఇరాన్‌పై యుద్ధం మొదలై 60 రోజులు

వాషింగ్టన్/టెహ్రాన్/దుబాయ్, మే 1: ఇరాన్‌పై తాము చేస్తున్నది యుద్ధమే కాదంటూ ట్రంప్ యంత్రాంగం నాలుక మడతేస్తోంది. తాము కేవలం చిన్న సైనిక చర్య చేపట్టామని చెబుతోంది. అధ్యక్షుడు ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, కీలక అధికారులు అంతా ఇదే పాట పాడుతున్నారు. అధ్యక్షుడు ఏ దేశంపై యుద్ధం మొదలుపెట్టినా.. 60 రోజుల్లోగా అమెరికా చట్టసభ కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలి, లేకుంటే యుద్ధం ఆపేయాలన్న నిబంధనే దీనికి కారణం. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ట్రంప్ యుద్ధం ప్రారంభించినా.. చట్టసభ కాంగ్రెస్‌కు మార్చి 2న అధికారికంగా సమాచారమిచ్చారు. దీనితో శుక్రవారం నాటికి 60 రోజులు పూర్తవుతోంది. ఇంకా కాంగ్రెస్ ఆమోదం రాలేదు. దీనిపై అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ జాన్సన్ మాట్లాడుతూ.. ట్రంప్ ప్రభుత్వం యుద్ధమేదీ చేయడం లేదని, పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌తో కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో 60రోజుల్లోగా చట్టసభ ఆమోదం పొందాలన్న నిబంధన ప్రస్తుతానికి వర్తించదని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు.



అయితే దీనిని ప్రతిపక్ష డెమోక్రాట్ సెనేటర్లు తిరస్కరిస్తున్నారు. శుక్రవారం నాటికి గడువు ముగిసినట్టేనని, ఇరాన్‌పై యుద్ధం ఆపి బలగాలను వెనక్కి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌పై యుద్ధం కొనసాగించాల్సి వస్తే.. భీకర స్థాయిలో విరుచుకుపడేందుకు అమెరికా సెంట్రల్ కమాండ్ సన్నద్ధమవుతోంది. ఇందుకోసం 'డార్క్ ఈగిల్' హైపర్ సోనిక్ క్షిపణులను వినియోగించేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించింది.

చర్చలకు ముందుకొచ్చిన ఇరాన్

- ఆ ప్రతిపాదనలు నచ్చలేదన్న ట్రంప్

ఇస్లామాబాద్, మే 1: యుద్ధం ముగించే దిశగా ఇరాన్ కూడా ప్రయత్నాలు ప్రారంభించింది. హోర్ముజ్ జలసంధి దిగ్బంధంతో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అమెరికాతో చర్చలకు సిద్ధమైంది. దీనిపై మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా అమెరికాకు తాజాగా ప్రతిపాదనలు పంపింది. ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ శుక్రవారం ఈ వివరాలు వెల్లడించింది. అయితే ఎలాంటి ప్రతిపాదనలు పంపారు, ఏమేం షరతులు పెట్టారు, చర్చలు ఎక్కడ జరపనున్నారనే వివరాలేవీ వెల్లడించలేదు. అయితే తాజాగా ఇరాన్ చేసిన ప్రతిపాదనలు తనకు నచ్చలేదని, తాను అంగీకరించే అవకాశం లేని ప్రతిపాదనలు చేశారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ ప్రతినిధులతో ఫోన్‌లో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇరాన్‌లో కీలక నాయకత్వం అంతా తుడిచిపెట్టుకుపోయిందని, ప్రభుత్వాధినేత ఎవరో వారికే తెలియని గందరగోళం నెలకొందని వ్యాఖ్యానించారు.

ఇరాన్ ప్రభుత్వ నేతల్లో విభేదాలు?

దుబాయ్, మే 1: ఇరాన్ ప్రభుత్వ నేతల్లో విభేదాలు నెలకొన్నాయనే వార్తలు వస్తున్నాయి. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీని తొలగించేందుకు అధ్యక్షుడు పెజెష్కియాన్, పార్లమెంటు స్పీకర్ ఘలీబఫ్ ప్రయత్నిస్తున్నారని.. అరాగ్చీ ఐఆర్‌జీసీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటమే దీనికి కారణమని ఇరాన్ ఇంటర్నేషనల్ పత్రిక కథనం ప్రచురించింది. ఐఆర్‌జీసీ కమాండర్ అహ్మద్ వహీదీతో అరాగ్చీ సన్నిహితంగా మెలుగుతున్నారని పేర్కొంది. ఇటీవల అమెరికాతో జరిగిన చర్చల్లో ప్రభుత్వాన్ని పక్కనపెట్టి మరీ ఐఆర్‌జీసీ వాదనలకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించింది. అధ్యక్షుడికి సమాచారం ఇవ్వకుండా నేరుగా వహీదీతో అరాగ్చీ సంప్రదింపులు జరుపుతున్నారని.. దీనితో అరాగ్చీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వ నేతలా కాకుండా వహీదీ అనుచరుడిలా వ్యవహరిస్తున్నారని అధ్యక్షుడు పెజెష్కియాన్ ఆగ్రహంతో ఉన్నారని తెలిపింది. అరాగ్చీ తీరుతో పార్లమెంటు స్పీకర్ ఘలీబఫ్, ఇతర నేతలు కూడా అసంతృప్తితో ఉన్నారని.. ఆయనను తొలగించాలని భావిస్తున్నారని పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సౌదీకి సవాల్..!

పెట్రోలియం ఎగుమతి దేశాల కూటమి (ఒపెక్) నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తప్పుకోవడం అమెరికా అధ్యక్షుడికి నచ్చింది. ఇది ఎంతో మంచి నిర్ణయమని, ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ తెలివైనవారు కనుక, ఇలా స్వతంత్రంగా నడవాలని నిర్ణయించుకున్నారని, దీనితో చమురు, గ్యాస్ ధరలు దిగొస్తాయని ట్రంప్ అన్నారు. ఎమిరేట్స్ నిర్ణయం అమెరికాకు లాభిస్తుందన్న వాదనలను అటుంచితే, ఒపెక్ తన ఉత్పత్తిని నియంత్రిస్తూ చమురు ధరలు పెరిగేట్టు చేసి ప్రపంచ ఆర్థికవ్యవస్థను శాసిస్తున్నదంటూ గతంలో ఆయన విమర్శలు చేసిన విషయం తెలిసిందే. కోవిడ్ కాలంలో ధరలు పడిపోయి అమెరికన్ కంపెనీలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్న సందర్భంలో ఆయనే ఈ కూటమికి ఉత్పత్తి తగ్గించమంటూ విజ్ఞప్తులు, హెచ్చరికలు చేశారు. బంధనాలు తెంపేసుకున్న ఎమిరేట్స్ ఇక సర్వస్వతంత్రంగా నచ్చినంత చమురు ఉత్పత్తి చేయగలదు కనుక ప్రపంచ ఆయిల్ మార్కెట్ మీద దీని ప్రభావం ఏ విధంగా ఉండబోతోందన్న అంశంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి.

కూటమిలో ఉండగా కూడా ఎమిరేట్స్ తన వాటాలూ కోటాలను తరచూ ఉల్లంఘిస్తూనే ఉందని, అందు వల్ల, ఇప్పుడు దాని నిష్క్రమణ పెద్ద ప్రభావం చూపకపోవచ్చునని కొందరు విశ్లేషకుల అభిప్రాయం. ఒపెక్‌లో మూడవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదేశమైన ఎమిరేట్స్ ఆరు దశాబ్దాల తరువాత తీసుకున్న ఈ నిర్ణయం వెనుక సౌదీతో దానికి ఉన్న భౌగోళిక వైరుధ్యాలు, ఆధిపత్య పోరు అసలు కారణం. ఉత్పత్తిని రోజుకు ఐదు మిలియన్ బారెల్స్‌కు పెంచాలని దాని లక్ష్యం. ఒపెక్‌కు బాస్‌గా వ్యవహరిస్తున్న సౌదీ అరేబియా ఆది నుంచీ ఎమిరేట్స్‌కు ఉత్పత్తి విషయంలో అడ్డుపడుతూనే ఉంది. ఇక సూడాన్, సోమాలియా, యెమెన్ వంటి దేశాల్లో వైరివర్గాలను ఇవి రెండూ ఇతోధికంగా ఎగదోస్తున్న చరిత్ర తెలిసిందే. అమెరికా ఇజ్రాయెల్‌తో ఇటీవలి కాలంలో ఎమిరేట్స్ మరింత సాన్నిహిత్యం పెంచుకోవడం కూడా ఈ గల్ఫ్ కూటమిలో విభేదాలకు కారణమైంది. ఇరాన్ దాడులకు ఎమిరేట్స్ అత్యధికంగా దెబ్బతిన్నది కూడా ఇందుకే. మిసైళ్లు, డ్రోన్లతో ఎమిరేట్స్ చమురు ఉత్పత్తి కేంద్రాలు, ఇంధన నిల్వలు, నౌకలు, అక్కడి అమెరికా సైనిక స్థావరాలు, ఆయుధాగారాలను ఇరాన్ పెద్ద ఎత్తున దెబ్బతీసింది. ఐదువందల బాలిస్టిక్ మిసైళ్లు, పాతిక క్రూయిజ్ మిసైళ్లు, వేలాది డ్రోన్లను ఎమిరేట్స్ మీద ఇరాన్ ప్రయోగించింది. అమెరికా–ఇరాన్ యుద్ధం చమురు సరఫరా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన నేపథ్యంలో, ఇరాన్ మీద కక్ష సాధింపు లక్ష్యంతో ఎమిరేట్స్ ఈ నిర్ణయం తీసుకుందని అంటారు. సౌదీతో వైరం ప్రత్యక్షంగా మారిన తరువాత ముసుగులో గుద్దులాట ఎందుకని కూడా ఎమిరేట్స్ అనుకున్నట్టు ఉంది. ఒపెక్‌లో ఉండటం అంటే రియాద్ పెత్తనాన్ని ఆమోదించడమే. బయటకు వచ్చి తన స్వతంత్రతను నిలబెట్టుకోవడంతో పాటు, ఒపెక్‌ను బలహీనపరచాలన్న ట్రంప్ కోరికను కూడా తీర్చినట్టు అవుతుందని సౌదీ ఆలోచన. ఈ నిష్క్రమణతో చమురు మార్కెట్‌మీద ఒపెక్ పట్టు బలహీనపడుతుంది. రేపోమాపో మరిన్ని దేశాలు కూడా క్యూ కట్టవచ్చు. ఎమిరేట్స్‌కు ఇక కోటాలకు కట్టుబడాల్సిన బాధ ఉండదు కనుక అది తనకు నచ్చినంత, అమెరికా మెచ్చినంత చమురు తోడి పోయవచ్చు, ఇష్టమైన రేటుకు అమ్ముకోవచ్చు. దీనికితోడు, యుద్ధంలో ఇరాన్ చేకూర్చిన నష్టాన్ని కూడా త్వరితంగా పూడ్చుకోవచ్చు. ఎమిరేట్స్‌తో కలిసి ప్రపంచ చమురు మార్కెట్‌ను దశాబ్దాలుగా శాసించగలిగిన సౌదీ అరేబియా ఇకపై ఆ పెత్తనాన్ని చెలాయించలేదు. అమెరికా షేల్ ఆయిల్ కంపెనీల ఉత్పత్తినీ, వాటిలో పెట్టుబడులనూ దెబ్బతీయడం కోసం ప్రపంచ ఆయిల్ మార్కెట్‌ను అధిక ఉత్పత్తితో, తక్కువ ధరలతో ముంచెత్తిన ఒపెక్ ఇకపై అటువంటి విన్యాసాలకు కూడా పాల్పడలేదు. సామర్థ్యం ఉండి కూడా మూడోవంతు ఉత్పత్తిని బలవంతంగా నియంత్రించుకోవాల్సిన అవసరం ఇక ఎమిరేట్స్‌కు ఉండదు కనుక, హార్ముజ్ నిర్బంధంతో ప్రపంచానికి ఏర్పడిన చమురు లోటును పూడ్చి, ఈ సంక్షోభ సమయాన్ని సొమ్ముచేసుకోవచ్చు. ఎమిరేట్స్ నిర్ణయం భారతదేశానికి మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. ఆ దేశంతో ఉన్న సత్సంబంధాల రీత్యా మనకు సరఫరాలు మరింత పెంచగలిగే అవకాశం ఇప్పుడు దానికి ఉంది. ప్రస్తుతానికి పది శాతం లోపు ఉన్న దాని వాటా బాగా హెచ్చవచ్చు. డాలర్ బదులు రూపాయితో చమురు కొనుగోలు చేయగలిగితే మరీ మంచిది.

ప్రజాప్రయోజన వ్యయాలు పెరగాలి!

ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేస్తోన్న యుద్ధం సుదూర యుద్ధం కానేకాదు. భారత ఉపఖండానికి పొరుగున ఉన్న పశ్చిమాసియాలో సాగుతోన్న సమరమది. ఆ ప్రాంతంలో లక్షలాది భారతీయులు నివసిస్తున్నారు, జీవనోపాధి పొందుతున్నారు. మన దేశంలోని కోట్లాది షియా ముస్లింలకు ఇరాన్ ప్రజలతో ఆత్మీయ అనుబంధాలు ఉన్నాయి. ఇరాన్‌తో భారత్‌కు సుదీర్ఘ, చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఇరాన్‌తో వాణిజ్య, ఆర్థిక సంబంధాలు సైతం బలోపేతమయ్యాయని భారత్ చెబుతోంది. ఇందుకు ఉదాహరణగా చాబహార్ ఓడరేవు అభివృద్ధిని ప్రముఖంగా పేర్కొనడం కద్దు. అయితే బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈ సంబంధాల ప్రగాఢత తగ్గిపోయింది. కారణాలు అనేకమున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉన్న సన్నిహిత స్నేహబంధం ఆ కారణాలలో ఒకటి.




■ పి. చిదంబరం

'పళని' పలుకు

మొన్నగాక అటు మొన్నటి వరకు ప్రపంచంలో ఎక్కడ ఘర్షణలు ప్రజ్వరిల్లినా శాంతి సాధనకు భారత్ సహాయం అర్థించడం, తీసుకోవడం పరిపాటిగా ఉండేది. ఫిబ్రవరి 28, 2026న ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయెల్‌లు మొదటి నుంచీ భారత్‌ను దూరంగా పెడుతున్నాయి. ఇరాన్ మాత్రమే యుద్ధ పరిణామాలను, తమ వైఖరిని న్యూఢిల్లీకి వివరించేందుకు కాస్తో కూస్తో శ్రద్ధ చూపుతోంది. ఇజ్రాయెల్ పక్షపాతిగా భారత్ వ్యవహరిస్తోంది. ఆ యూదు దేశాన్ని విమర్శించిన బ్రిక్స్ దేశాల ముసాయిదా తీర్మానాన్ని భారత్ వీటో చేయడమే అందుకొక తాజా నిదర్శనం. అయినప్పటికీ అమెరికా–ఇజ్రాయెల్‌లు భారత్‌తో సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇరాన్‌తో మధ్యవర్తిత్వం నెరిపేందుకు పాకిస్థాన్ సహాయాన్నే అవి అపేక్షిస్తున్నాయి, తీసుకుంటున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం మన ఆర్థిక జీవనాన్ని పెద్దగా ప్రభావితం చేయడం లేదనే భారత్ ఇంకెంతమాత్రం చెప్పలేదు. అలా చెప్పడం ఆత్మవంచనే అవుతుంది. ఎందుకంటే ఆ యుద్ధం వల్ల ఇప్పటికే చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలకు భారీ నష్టం వాటిల్లింది. భారత్ సైతం అందుకు మినహాయింపు కాదు.

సరే, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హూంకరింపులు, బెదిరింపులకు ప్రపంచ దేశాలు అలవాటు పడిపోయాయి. ఇరాన్ నావికా, వైమానిక దళాలను పూర్తిగా తుడిచి పెట్టేశామని ఆ మహాశయుడు ప్రకటించినప్పుడు ఎవరూ ఆయన మాటను విశ్వసించలేదు. ఇరానియన్ సైనిక ఆస్తులు అన్నిటినీ భస్మీపటలం చేశామని కూడా ఆయన ప్రకటించారు; అంతేనా? ఇరాన్ 'పాలన' మారిందని కూడా ఆయన ఘోషించారు. శాంతి సాధనకు అమెరికా ముసాయిదా ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ గట్టిగా చెప్పారు; వివిధ సందర్భాలలో కాల్పుల విరమణ గురించి కూడా ఆయన గొప్పగా ప్రకటించారు. డోనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని ఆపివేశారు, మళ్లీ ప్రారంభించారు, పిదప కాల్పుల విరమణను ప్రకటించారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ నిరవధికంగా ఇరాన్, లెబనాన్‌లపై దాడులు నిర్వహిస్తూనే ఉన్నది, ఇరాన్ ముమ్మరంగా ప్రతిదాడులూ చేస్తోంది. ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం అసలు ఆగిపోనేలేదనే వాస్తవం ప్రపంచానికి బాగా తెలుసు.



ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ యుద్ధం ఆగీఆగని సమరం. దానివల్ల మన దేశ ప్రజలకూ సంభవిస్తోన్న కష్ట నష్టాలు తక్కువేమీ కాదు. రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు, ఉపాధి కల్పనకు దోహదం చేసే చిన్న, మధ్యతరహా పరిశ్రమల పునరుద్ధరణకు ఆర్థిక సహాయం అందించడం మొదలైన ప్రజాప్రయోజన వ్యయాలే యుద్ధంతో వాటిల్లుతున్న ఉపద్రవాలకు సరైన ప్రభావదాయక ప్రతిచర్యలు అవుతాయి.

సమర జ్వాలలు మనలను తాకడం లేదా? లేదు, అంతా 'సాధారణంగా' ఉందని ప్రభుత్వం చెబుతోంది. యుద్ధ నష్టాలు, పర్యవసానాల గురించి ఆర్బీఐకు సరైన అవగాహన ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ సరఫరాల గొలుసులపై ఒత్తిడి, ఇంధనం, ఆహార ధరల ఎదుగుదలతో 'ముమ్మరమైన ద్రవ్యోల్బణం', 'దిగుమతుల తగ్గుదల', 'విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహం తగ్గిపోవడం' మొదలైన సమస్యల గురించి ఆర్బీఐ బులెటిన్ (ఏప్రిల్, 2026) స్పష్టంగా పేర్కొంది. యుద్ధం కొనసాగి, సరఫరా గొలుసుల పునరుద్ధరణలో జాప్యం జరిగితే మన ఆర్థిక వ్యవస్థకు విషమ సమస్యలు వాటిల్లుతాయని' ఆర్బీఐ హెచ్చరించింది. ఈ సమస్యల నివారణకు దేశ పాలకులు ఏమైనా చేస్తున్నారా? పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా చర్యలు చేపట్టారు. నిజమే. అయితే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న కారణంగానే ఆ ధరలను అదుపు చేశారు. అంతకు మించి వారు చేసిందేమీ లేదనడం సత్యదూరం కాదు.

ప్రధానమంత్రి నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో తమ పార్టీ విజయావకాశాలను మెరుగుపరచడంపై దృష్టి కేంద్రీకరించారు. సెప్టెంబర్ 2023లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ అంశాన్ని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి కొత్త రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మే 5న ఆయన మళ్లీ దేశ పాలనా వ్యవహారాలపై తన దృష్టిని కేంద్రీకరిస్తారు.

ఇరాన్ యుద్ధంతో ఆర్థిక ఉపద్రవాలకు లోనవుతున్న దేశ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ఇంకా ఎంతో చేయవలసి ఉన్నది. ఆదాయాలను పెంపొందించినప్పుడే ప్రజలకు జీవన సౌలభ్యం సమకూరుతుందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసినవారికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. ఆ పథకాన్ని రద్దు చేసి, సరికొత్త పథకాన్ని ప్రారంభించిన నాటినుంచీ అనిశ్చితిలో ఉన్న ఉపాధి పనుల కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలి; గ్రామీణ రోడ్ల నిర్మాణ కార్యక్రమం అమలును వేగవంతం చేయాలి. 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఆ కార్యక్రమానికి కేటాయించిన రూ.19,000 కోట్లను ఆరు నుంచి ఎనిమిది నెలల్లోగా వ్యయపరచాలి. మరిన్ని నిధులను గ్రామీణ రోడ్ల నిర్మాణానికి కేటాయించాలి; 2025–26 ఆర్థిక సంవత్సరంలో తాగునీటి పథకం జల్ జీవన్ మిషన్‌కు బడ్జెట్ అంచనా రూ.67,000 కోట్లు మాత్రమే కాగా, సవరించిన అంచనా కేవలం రూ.17,000 కోట్లు మాత్రమే! 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఆ పథకానికి రూ.67,670 కోట్లు కేటాయించారు. తాగునీటి సదుపాయాల కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పెరుగుదల సూచిస్తుంది. కేటాయించిన నిధులను వెన్వెంటనే రాష్ట్రాలకు విడుదల చేసి, ఆ పథకం సత్వర అమలుకు కేంద్రం శ్రద్ధ చూపాలి; కోవిడ్ విలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి ప్రభుత్వం వాగ్దానమిచ్చినప్పటికీ దానిని నెరవేర్చనేలేదు. ఉపాధి అవకాశాలను ఇతోధికంగా కల్పించగల ఆ పరిశ్రమ రంగానికి ఇప్పుడు రుణాలు తక్షణమే మంజూరు చేయాలని బ్యాంకులను ఆదేశించాలి. అవి పురోగమన బాట పట్టాలంటే ఇది తప్పనిసరి. ప్రజా శ్రేయస్సుకు దోహదం చేసే రోడ్ల నిర్మాణం మొదలైన పనులకు, విద్య, ఆరోగ్య భద్రత మొదలైన అత్యవసర సేవలకు చేసే వ్యయాలను భారీగా పెంచాలి. ట్రంప్– నెతన్యాహు ద్వయం ప్రారంభించిన యుద్ధం నష్టాలు, బాధాకర పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజాప్రయోజన వ్యయాలే సరైన ప్రభావదాయక ప్రతిచర్యలు అవుతాయన్న వాస్తవాన్ని పాలకులు విస్మరించకూడదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఢిల్లీ పాలనలో ఆప్ చెరగని ముద్ర!

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీలోకి ఫిరాయించడం మూడు రకాల ప్రతిస్పందనలను పురిగొల్పింది. మొదటిది– ఫిరాయింపుదారులపై ఏహ్యత. వారు సిగ్గూ శరమూ లేని అవకాశవాదులు అనే ఈసడింపు బాగా వ్యక్తమయింది. రెండోది– ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను తప్పు పట్టడం. పార్టీలో సర్వాధినేతగా వెలిగిపోయేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే వ్యక్తిపూజను ప్రోత్సహిస్తున్నారని, తత్కారణంగా సమర్థులైన పలువురు నాయకులు ఆప్ నుంచి వెళ్లిపోవలసి వచ్చిందనే విమర్శలు వెల్లువెత్తాయి. మూడోది– వివేచనాపరులైన హిందూత్వ వ్యతిరేకులు ఎవరూ అసలు ఆప్‌కు ఓటు వేయరనే అనే వాదనను ముందుకు తీసుకువచ్చింది. ఆప్ ఆవిర్భావానికి దారితీసిన అవినీతి నిర్మూలనా ఉద్యమం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతుతోనే జరిగినందున ఆప్‌ను సమర్థించడమేమిటని ఆ వాదన చేస్తున్నవారు ప్రశ్నిస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ పదే పదే తానూ హిందూ మతస్థుడినేనని బహిరంగంగా చాటుకోవడాన్ని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. మత వివక్షకు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో రోజుల తరబడి శాంతియుతంగా నిరసన తెలిపిన మహిళలకు.. కేజ్రీవాల్ సంఘీభావం తెలుపక పోవడాన్ని కూడా పలువురు ఆక్షేపించారు.



■ రామచంద్ర గుహ


గతానుగతం

ఈ విమర్శలు అన్నిటిలోనూ సమంజసత్వమున్నది, సందేహం లేదు. నైతిక విశ్వాసాలు, భావజాల నిబద్ధతతో కాకుండా ఆర్థిక ప్రలోభాలు, అవినీతి ఆరోపణలపై సంభావ్య దర్యాప్తులకు భయపడే ఈ ఫిరాయింపులు జరిగాయనేది స్పష్టం. ఆప్ విపత్కర పరిస్థితి ఈ వ్యాస రచయితకు ఒక విధమైన విచారాన్ని కలిగిస్తోంది. ఆలోచనాత్మకమైన విచారమది. ఆప్ తన పదమూడు సంవత్సరాలకు పైగా అస్తిత్వంలో భారత ప్రజాస్వామ్యాన్ని ప్రగాఢం చేసే మేలు పనులు కొన్ని చేసింది. ఇది విస్మరించకూడని వాస్తవం.

ఆప్‌ను ప్రశంసించేందుకు మరొక ప్రముఖ కారణం కూడా ఉన్నది. ఢిల్లీలో అధికారంలో ఉండగా పాలనా వ్యవహారాలలో ఆ పార్టీ ప్రభుత్వం అమలుపరచిన సంస్కరణలు. పాఠశాల విద్యలో ఆ ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులను నేను ప్రత్యేకంగా ప్రస్తావించదలిచాను. 2015లో ఆప్ అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాల విద్యారంగానికి నిధుల కేటాయింపును ఇతోధికంగా పెంచింది. ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలను మెరుగుపరిచేందుకు పూనుకుంది. కొత్త పాఠశాలల నేర్పాటు చేసింది. ఉన్న పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించింది. తరగతి గదుల్లో బోధనా సదుపాయాలను నవీకరణ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సహేతుకంగా మరిన్ని అధికారాలు కల్పించింది. వారు తమ విచక్షణ ప్రకారం వినియోగించేందుకు నిధులు సమకూర్చింది. విద్యాశాఖ అధికారులపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే వెసులుబాటును ప్రధానోపాధ్యాయులకు కల్పించింది.

ప్రభుత్వ పాఠశాలలకు మరింత స్వతంత్ర ప్రతిపత్తిని సమకూర్చడంతో పాటు అభ్యసన ఫలితాలు బాగా మెరుగుపడేలా ఉపాధ్యాయులకు ప్రేరణ కలిగించడమే ఆప్ ప్రభుత్వ విద్యా సంస్కరణల లక్ష్యం. 'బాల బాలికలందరికీ పఠనం, లేఖనం, అంకగణితంలో గట్టి పునాదులు నిర్మించడమే లక్ష్యంగా బోధనా కార్యక్రమాలను రూపొందించారని' యామినీ అయ్యర్ తన పరిశోధనా గ్రంథం 'Lessons in State Capacity from Delhi's Schools' లో రాశారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు బాలల అభ్యసన స్థాయిని బట్టి తరగతులను మూడు విధాలుగా పునర్వ్యవస్థీకరించారు. కొత్తగా రూపొందించిన బోధనా కార్యక్రమాలను అమలుపరిచేందుకు మెంటార్ టీచర్లు అనే కొత్త ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఎంపిక చేసి నియమించారు. వేసవి సెలవుల్లో బాలలకు పుస్తక పఠన మేళాలు నిర్వహించారు. కొత్త పాఠ్య పుస్తకాలను రూపొందించారు. జీవిత సత్యాలను బోధించే కథల ఆధారిత 'హ్యాపీనెస్ కరిక్యులమ్'ను రూపొందించి అమలుపరిచారు. ఈ పాఠాలపై విద్యార్థుల సామూహిక చర్చలను ప్రోత్సహించారు.

ఆప్ అధికారంలోకి వచ్చిననాటికి ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాల విద్యారంగం పూర్తిగా భ్రష్టు పట్టిపోయి ఉందని, అయినా దానిని కొత్త దిశలో మెరుగ్గా ముందుకు నడిపించడంలో ఆప్ సర్కార్ సఫలమైందని యామిని ప్రశంసించారు. ఈ సంస్కరణల సాఫల్యానికి ప్రధాన కారకుడు విద్యామంత్రి మనీష్ సిసోడియా. విద్యారంగంపై సిసోడియా దృక్పథంలో నాలుగు విశిష్ట గుణాలు ఉన్నాయని ఆయనతో కలిసి పనిచేసిన విద్యావేత్త ఒకరు నాకు చెప్పారు. వాటిలో మొదటిది– ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావం; బోధనా వృత్తి ప్రాముఖ్యత, పవిత్రత పట్ల సంపూర్ణ అవగాహన. రెండోది– పాఠశాలలు, తల్లిదండ్రుల మధ్య ప్రగాఢ సంబంధాలను పెంపొందించేందుకు సిసోడియా ఇచ్చిన అగ్ర ప్రాధాన్యం. మూడోది– బాలల అభ్యసనంపై దృష్టిని కేంద్రీకరించాలని పాఠశాలలను ప్రేరేపించడం. చదువులో వెనుకబడిన వారికి అవకాశాలు కల్పించి వారి ఎదుగుదలకు తోడ్పడాలని ఉపాధ్యాయులకు పదే పదే చెప్పేవారు. నాల్గవది– పాఠ్య ప్రణాళికలను, సమస్త విద్యా బోధన ప్రక్రియను మానవతా దృక్కోణంలో రూపొందించేందుకు సిసోడియా నిరంతర కృషి. విద్య పట్ల ఆయన దృక్పథం ప్రజా కేంద్రితమైనది. పాఠశాల వ్యవస్థతో ప్రమేయమున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బాలల శ్రేయస్సుకు అగ్ర ప్రాధాన్యమిచ్చేది.



> **మరొకరి ధార్మిక విశ్వాసాలను తక్కువ చేస్తూ సొంత మతాన్ని కీర్తించుకోవడం కంటే బాలల భావి జీవితానికి దృఢమైన పునాదులు వేసే ప్రశస్త పాఠశాలలు, ఆరోగ్యానికి భద్రత కల్పించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే చాలా చాలా ముఖ్యం. మంచి విద్య, మెరుగైన వైద్యం మాత్రమే ప్రజలకు దీర్ఘకాలిక సుఖ సంతోషాలను ఖాయం చేస్తాయి.**

సిసోడియాలోని మరొక విలక్షణతను కూడా నేను ప్రస్తావించదలుచుకున్నాను. అది: వినయశీల ఉత్సుకత. విద్వజ్జులు, విద్యారంగంలో కృషి చేస్తున్న ఎన్జీఓలు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పరిస్థితులను మెరుగుపరిచేందుకు వారి సలహాలు తీసుకుని పాటించడమనేది మన రాజకీయవేత్తలలో చాలా అరుదు. ఇటువంటి విశిష్ట గుణం సిసోడియాలో ఉన్నది. ఆయన అందరికీ అందుబాటులో ఉంటారు. ఎటువంటి భేషజాలకు పోకుండా ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వింటారు. తగిన రీతిలో నిర్ణయాలు తీసుకుంటారు. సిసోడియా క్రమబద్ధంగా పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించేవారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే విద్యా వ్యాసంగాలపై అభిరుచి ఉండి, విద్యారంగ పరిస్థితులను మెరుగుపరచడంపై నిబద్ధత ఉన్న అధికారుల బృందం నొకదాన్ని ఆయన సమీకరించారు. దురదృష్టవశాత్తు 2020 తరువాత ఈ విద్యా సంస్కరణల పురోగతి కుంటుపడింది. కోవిడ్ ఉపద్రవం ఇందుకొక పాక్షిక కారణం కాగా, ఆ ఏడాది ఆప్ ప్రభుత్వానికి ఢిల్లీ ప్రజలు మళ్లీ అధికారం అప్పగించడంతో ఆ సర్కార్‌పై కేంద్రం వ్యతిరేకత మరింత తీవ్రమయింది. పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో విద్యామంత్రితో కలిసి ప్రశస్త కృషిచేసిన పీడబ్ల్యూడీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను 2022లో అరెస్ట్ చేశారు. 2023లో సిసోడియా సైతం జైలుకు వెళ్లారు; 2024లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌నే అరెస్ట్ చేసి జైలులో నిర్బంధించారు. ఆప్ పట్ల కేంద్ర ప్రభుత్వ రాజకీయ శత్రుత్వం, కక్షసాధింపు వైఖరి కారణంగానే ఈ పరిణామాలు సంభవించాయి. ఫలితంగా, భ్రష్టుపట్టిన ప్రభుత్వ విద్యా వ్యవస్థను మౌలికంగా మెరుగుపరిచేందుకు ఆప్ సర్కార్ చేపట్టిన దార్శనిక విద్యా సంస్కరణలు మందగించాయి.

అధికారంలో ఉన్నప్పుడు ప్రజారోగ్య సదుపాయాలను గణనీయంగా మెరుగుపరిచేందుకు ఆప్ ప్రశస్త కృషి చేసింది. 2019లో ఢిల్లీ ఐఐటీ పరిశోధకుల బృందం నివేదిక ఒకటి ఇలా పేర్కొంది: 'ఆప్ సర్కార్ నెలకొల్పిన మొహల్లా క్లినిక్‌లు మంచి ఫలితాలనిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉండడంతో పాటు వ్యయాలు.. కాయకష్టంపై బతికే సామాన్య పౌరులు భరించదగిన స్థాయిలో ఉంటున్నాయి. పట్టణ పౌర సదుపాయాలు అధ్వానంగా ఉన్న ప్రాంతాలలో ఈ క్లినిక్‌లను నెలకొల్పడం వల్ల ఆరోగ్యసేవలను చాలా సమీపంలో సత్వరమే పొందడం పేదలకు సాధ్యమవుతోంది.'

కేంద్ర ప్రభుత్వ నిర్విరామ వ్యతిరేకత నడుమ ఆప్ సర్కార్ ఆరోగ్య భద్రత, విద్యా రంగాలలో సంస్కరణలను అమలుపరిచింది. పంజాబ్‌లో ఆప్ అధికారానికి వచ్చిన పిమ్మట ఈ వ్యతిరేకత మరింత తీవ్రమయింది. ఆప్ ఎదుగుదలను అదుపు చేయకపోతే ఉత్తరాది రాష్ట్రాలలో తమ ప్రాబల్యానికి ఆ పార్టీ అవరోధమవుతుందని బీజేపీ భయపడింది. ఆ కారణంగానే ఆప్ అగ్ర నాయకులను అరెస్ట్ చేసి, వారిని అప్రతిష్ఠ పాలు చేసేందుకు పూనుకున్నది.

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఏ రాష్ట్రంలోనూ ఆప్ పోటీదారుగా లేదు. ప్రధాన పోటీదారుల్లో ఒకటైన బీజేపీ హిందూ స్వాభిమానం, అధికారంలోకి వస్తే తాము అమలుపరిచే నగదు సహాయక పథకాల గురించి మాట్లాడింది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకెలు బెంగాలీల, తమిళుల ఆత్మగౌరవం, నగదు పంపిణీ రూపేణా సమకూర్చే సంక్షేమ పథకాల గురించి మాట్లాడాయి. ఎన్నికల ప్రచారంలో ఈ పార్టీలు ఎక్కడా పాఠశాల విద్యా వసతుల మెరుగుదల, ఆరోగ్య భద్రతా సదుపాయాల గురించి మాట్లాడనే లేదు. ప్రజలకు దీర్ఘకాలిక సుఖసంతోషాలను ఖాయం చేసేవి ఏమిటి? తక్షణ ఖర్చులకు ఒక వేయి రూపాయలు ఉదారంగా అందుబాటులో ఉంచడం లేదా మరొకరి ధార్మిక విశ్వాసాలను తక్కువ చేస్తూ సొంత మతాన్ని కీర్తించుకోవడమా?! వాటి కంటే బాలల భావి జీవితానికి దృఢమైన పునాదులు వేసే ప్రశస్త పాఠశాలలు, ఆరోగ్యానికి భద్రత కల్పించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే చాలా చాలా ముఖ్యం కాదా?

(వ్యాసకర్త చరిత్రకారుడు)

మావోయిస్టులు ఏం సాధించారు?

దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాలు ఏమీ లేవని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష అనంతరం ప్రకటించింది. దీనితో మార్చి 31లోపు ఆపరేషన్ కగార్ ద్వారా వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలిస్తామన్న కేంద్రం ఆ పనిని విజయవంతంగా పూర్తి చేసినట్టయింది. ఆ విధంగా భారతదేశంలో ఐదున్నర దశాబ్దాల పాటు కొనసాగిన వామపక్ష తీవ్రవాదం తుడిచి పెట్టుకుపోయింది. 1967లో నక్సల్బరీలో ప్రారంభమై అబూజ్‌మడ్ అడవుల్లో అంతం అయ్యే వరకు, తమ లక్ష్యాలపై స్పష్టత లేక, ఆచరణ సాధ్యం కాని పిడివాద సిద్ధాంతంతో రాజీపడి వందలాది మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి, ప్రాణాలు చేతబట్టుకుని రాజ్యానికి లొంగిపోయారు.



కమ్యూనిస్టులు తమను తాము సామాజిక అవసరంగా భావించడం అతిపెద్ద తప్పు. ఈ భావనతోనే కాలంతో పనిలేకుండా తిరుగుబాట్లు చేసుకుంటూ పోయారు. ఆ తిరుగుబాట్లు అణగారిన వర్గాల కోసమేనంటూ కొన్నాళ్ల పాటు మొత్తం సమాజాన్ని నమ్మించారు. తమ సమస్యలు పరిష్కారమైనా కాకపోయినా, విముక్తి కోసం హింసను మార్గంగా అటవీ ప్రాంతవాసులు ఇప్పుడు అంగీకరించడం లేదు. అభివృద్ధి అనేది రాజ్యం వేసుకున్న ముసుగు మాత్రమే అన్న మావోయిస్టుల వితండవాదాన్ని పటాపంచలు చేస్తూ వెనుకబడిన జిల్లాల్లో ప్రత్యేక రహదారుల పథకం ద్వారా 17,589 కి.మీ రోడ్లు; 10,644 మొబైల్ టవర్లు నిర్మాణం అయ్యాయి. దశాబ్దాలుగా ప్రభుత్వం అంటే తెలియని ప్రాంతంలో టెలికాం, బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇవన్నీ ప్రతి రాజకీయ ప్రశ్నకూ సమాధానం ఇవ్వకపోవచ్చు. కానీ రాజకీయ వాదనల ప్రాతిపదికను మార్చాయి. ఇక తరం మార్పు కూడా మావోయిస్టుల ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. మావోయిస్టుల ప్రభావిత జిల్లాల్లో 48 పారిశ్రామిక శిక్షణా కేంద్రాలు, 61 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, 258 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించబడ్డాయి. ప్రభుత్వ వ్యవస్థల నిర్మాణం ద్వారా ఈ ప్రాంతాల్లో గణనీయ మార్పులు వచ్చాయి. అలాగే, బలమైన ప్రజాస్వామ్య భావన ప్రజల్లో క్రమంగా వేళ్లూనుకోవటం కూడా మావోయిస్టుల భావజాల క్షీణతకు దీర్ఘకాలిక కారణంగా కనిపిస్తుంది. ఎన్నో లోపాలు ఉన్నప్పటికీ భారత ప్రజాస్వామ్యం స్వాతంత్ర్యం తర్వాత మావోయిస్టులు ఊహించినదానికంటే వేగంగా ప్రజామోదాన్ని పొందింది.

ఒక గెరిల్లా ఉద్యమం ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా నిలబడగలదు. అయితే దాని వద్ద ప్రజలను నమ్మించగల సైద్ధాంతికత ఉండాలి. తిరుగుబాటు సాహిత్యం అంతా కూడా గిరిజన యువతను కేవలం పాతతరం నాటి త్యాగం చేసే వర్గాలుగానే గుర్తిస్తూ, వారిని ఆ బాటలోనే బంధించి ఉంచాలని కోరుకుంది. కానీ యువత ముందుకు మరిన్ని అవకాశాలు రావటంతో యువతలో మావోయిజం పట్ల తిరుగుబాటు ప్రారంభమైంది. చివరకు మావోయిస్టులకు రక్షణ ఇచ్చిన గిరిజన వర్గాలే వారిని మట్టుబెట్టేందుకు ప్రభుత్వ సాయుధ దళాలను ఆహ్వానించాయి.

లొంగిపోయిన మాజీ నక్సలైట్లు కూడా కాలానుగుణంగా మారకపోవటమే తమ పతనానికి కారణం అని బహిరంగంగానే ప్రకటించి తప్పును అంగీకరించారు. కానీ ఇప్పటికీ తమ మూల సిద్ధాంతంలోనే తప్పు ఉన్నదన్న వాస్తవాన్ని వారు అంగీకరించలేకపోతున్నారు. ఆచరణ సాధ్యంకాని కార్ల్ మార్క్స్ సిద్ధాంతంలోని శాస్త్రీయతను ప్రశ్నిస్తే వితండవాదం తప్ప అర్థవంతంగా చర్చించలేని పరిస్థితి ఉంది. అడవుల్లో ఉన్న మావోయిస్టులు ఇక తమ ప్రాణాలకు ముప్పు తప్పదన్న వాస్తవాన్ని గ్రహించి లొంగిపోతామంటే కూడా మైదాన ప్రాంతాల్లోని అర్బన్ నక్సలైట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికీ చాలామంది అర్బన్ నక్సలైట్లు.. లొంగిపోయిన నక్సలైట్ల కంటే చాలా యాక్టివ్‌గా లొంగుబాటును వ్యతిరేకిస్తూ హింసను ప్రేరేపిస్తున్నారు. దీన్ని కేంద్ర నిఘా సంస్థలు గుర్తించాయి. ఇప్పుడు అర్బన్ నక్సలైట్ల అణచివేతపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. తుపాకీ యుద్ధాల్లో ఓడిన మావోయిస్టు పార్టీ భవిష్యత్తు వాదనల్లో నిలబడి గెలవాలంటే పార్లమెంటరీ పద్ధతిలో ముందుకు సాగాలి.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

వయసా, సమర్థతా?

ప్రజాస్వామ్యంలో నాయకత్వానికి అర్హత ఏమిటి? వయస్సా లేక సామర్థ్యమా? ఈ ప్రశ్న మళ్లీ మళ్లీ ముందుకు వస్తోంది. ముఖ్యంగా 70 ఏళ్లు దాటిన వారు ఎన్నికల్లో పోటీ చేయకూడదనే అభిప్రాయం కొంతమంది వ్యక్తపరుస్తున్నారు. కానీ ఇండియా మొదలుకొని అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాల వరకు ఎక్కడా ఎన్నికల్లో పోటీ చేయడానికి గరిష్ఠ వయో పరిమితి లేదు. ప్రజాస్వామ్య సూత్రం ప్రకారం 'ఎవరు పోటీ చేయాలి?' అన్నది చట్టం నిర్ణయించదు; ప్రజలే నిర్ణయిస్తారు. కనిష్ఠ వయస్సు మాత్రం ఉంటుంది, ఎందుకంటే అది బాధ్యతను అర్థం చేసుకునే వయస్సు.

అయితే, వృద్ధ నాయకుల సామర్థ్యంపై చర్చకు కారణాలు ఉన్నాయి. అనుభవం అనే అస్త్రం వారికుంది. ఎన్నో దశాబ్దాల రాజకీయ పరిజ్ఞానం, నిర్ణయాల్లో స్థిరత్వం, సంక్షోభాల్లో సమతుల్యత... ఇవన్నీ వయస్సుతో వస్తాయి. జో బైడెన్ 80 ఏళ్లు దాటినా అమెరికాను నడిపించగలిగారు. నరేంద్ర మోదీ 70 దాటినా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మలేసియాలో ఎక్కువ కాలం సేవలందించిన ప్రధాని మహాతిర్ బిన్ మొహమ్మద్. 90 దాటిన వయస్సులో కూడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ప్రపంచానికి ఆశ్చర్యం కలిగించిన సంఘటన. వయస్సు పెరిగినా నాయకత్వ సామర్థ్యం ఉండొచ్చు కానీ, అదే సమయంలో ఆరోగ్యం, సమకాలీన ఆలోచనలపై అవగాహన కూడా అవసరం అని మహాతిర్ నిరూపించారు.

ఇంకోవైపు, వయస్సుతో వచ్చే పరిమితులు కూడా ఉన్నాయి. ఆరోగ్య సమస్యలు, వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంతో అనుసంధానం కష్టతరం కావడం, యువత సమస్యలపై దూరం పెరగడం వంటి అంశాలు పాలనపై ప్రభావం చూపవచ్చు. ఈ నేపథ్యంలో 'వయస్సు పరిమితి అవసరమా?' అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కానీ వయస్సుకు గీతలు వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఎందుకంటే, ఓటు హక్కు ఉన్న ప్రజలే తమ నాయకుడిని ఎంచుకోవాలి. ఒకవేళ వృద్ధ నాయకుడు పనికిరాడని ప్రజలు భావిస్తే, ఎన్నికలే అతనికి సమాధానం చెబుతాయి. చట్టం ముందుగానే తలుపులు మూయాల్సిన అవసరం ఏముంది?

అందుకే ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టడం మంచిది. ఆరోగ్య స్థితి వెల్లడించడం తప్పనిసరి చేయడం, పార్టీల్లో యువతకు అవకాశాలు పెంచడం, పదవీకాల పరిమితులు అమలు చేయడం వంటి మార్గాలు ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. ఇవి వయస్సు ఆధారంగా వివక్షను తగ్గించడమే కాకుండా, సమర్థ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తాయి. మొత్తానికి, '70 దాటిన వారు రాజకీయాలకు అనర్హులు' అనడం ఎంత తప్పో, 'వయస్సు అసలు అంశమే కాదు' అనడం కూడా అంతే అసంపూర్ణం.

– శ్యాంమోహన్









ఫైడే..

నిప్పులు కక్కిన భానుడు

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మే నెల మొదటి రోజే ఎండల తీవ్రత ఈ స్థాయిలో ఉంటే.. నెలంతా పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలకు ప్రజలు గురవు తున్నారు. భానుడి ప్రతాపంతో.. మధ్యాహ్నం ఎండలకు రోడ్లు ఆవిర్లు కక్కు తున్నాయి. జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చే సాహసం చేయడం లేదు. అత్య వసర పనులకు మాత్రమే కాలు బయట పెడుతున్నారు. ఉదయం 9 నుంచి వేడి తీవ్రత కనిపిస్తోంది. రానున్న వారం రోజులు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 45.23 డిగ్రీల ఉష్ణోగ్రత శుక్రవారం నమోదైంది. ఈ జిల్లాలోని పలు ప్రాంతాల్లో 42 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోద య్యాయి.

- గురజాలలో అత్యధికంగా 45.23 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఉక్కిరి బిక్కిరవుతున్న జనం అడుగు బయట పెడితే భస్మం
- వడదెబ్బ బాధితులకు ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో మ రింత అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వచ్చే సమయంలో కనీస జాగ్రత్త లు తీసుకోవాలని చెబు తున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, రక్షణగా గొడుగు వాడితే మంచి దని సూ చిస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తు న్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ముక్కు, చెవులకు వస్త్రం చుట్టు కోవడం మంచి దంటున్నారు. చిన్నారులు, వృద్ధులు అత్యవసరమైతే.. తప్ప బయటకు రావద్దని, క్షేత్ర స్థాయిలో పనిచేసే వారు తగిన జాగ్రత్త పాటించాలని చెబుతున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, మజ్జిగ, కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచిస్తు న్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించడం అంత మంచిది కాదని హెచ్చరిస్తు న్నారు. వీధి వ్యాపారులు, కార్మికులు, వ్యవసాయ కూలీ లు ఎండ తీవ్రతకు పని ప్రాంతంలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ కార్మికులు పని చేసే చోట వస తులు లేకపోవడంతో విలవిల్లాడుతున్నారు. సెగ గాలి తీవ్రతకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారు తున్నాయి.

వడదెబ్బ బాధితులకు రెండు పడకలు

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఆదేశాలు

గుంటూరు మెడికల్: రాబోయే ఐదు రోజుల్లో 41 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున వడ దెబ్బ బారిన పడి వచ్చే వారి చికిత్స కోసం ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేకంగా రెండు పడకలను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండే దృష్ట్యా ప్రజలు సాధ్యమైనంత వరకు ఆ సమయంలో బయట సంచ రించకుండా ఉండాలన్నారు. సచివాలయాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు ఆర్ఎల్‌డీ, ఎన్ఎస్ 5 శాతం డెక్స్‌ట్రోజ్ ద్రావణాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి



ఐదు రోజులు.. భగభగలు

హీట్ ఇండెక్స్‌పై కలెక్టర్ హెచ్చరిక

రానున్న ఐదు రోజుల పాటు జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉండనున్నదని కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న ఐదు రోజుల్లో వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వ హణ సంస్థ సూచించిందన్నారు. 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు వేడిమి ఉండవచ్చన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, మేడికొండూరు, కొల్లిపర, మంగళగిరి, పొన్నూరు ఫిరంగిపురం, చేబ్రోలు, పెదనందిపాడు, తాడేపల్లి, తాడికొండ, పెదకాకాని, కాకుమాను, తెనాలి, వట్టిచెరుకూరు, తుళ్ళూరు, దుగ్గిరాల, ప్రత్తిపాడు మండలాలు ఈ ప్రభావానికి లోనయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.



టీడీపీలో లోకేశ్ జోష్

- సమన్వయ శంఖారావంతో ఊపు
- స్థానిక ఎన్నికలపై వర్కింగ్ ప్రెసిడెంట్ దిశానిర్దేశం
- గుంటూరు లోక్‌సభ ప్రజాప్రతినిధులతో విందు భేటీ
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని నివాసంలో సమావేశం

8

కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడం.. నేతల మధ్య సమన్వయం పెంచడం.. ఎన్నికల యంత్రాంగాన్ని సిద్ధం చేయడమే లక్ష్యంగా అధిష్ఠానం సూచనల మేరకు ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ రంగంలోకి దిగారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై 'సమన్వయ శంఖారావం' పేరుతో శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో గుంటూరు లోక్‌సభ పరిధిలోని ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశాన్ని లోకేశ్ నిర్వహించారు.



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రక్షాళనలో పీవీ మార్కు

- ఎన్జీరంగా వర్సిటీలో సంస్కరణ పర్వం
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి స్థానచలనం
- పాలనా వ్యవస్థ పటిష్ఠం.. పరిశోధనలకు ప్రాధాన్యం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర వ్యవసాయ రంగానికి దిక్సూచి అయిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రక్షాళన మొదలైంది. ఇటీవల వీసీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పీవీ సత్యనారాయణ సంస్కరణల దిశగా చర్యలు ప్రారంభించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్సిటీ ఉన్నతస్థాయి అధికారులకు స్థానచలనం కల్పించారు. వారి స్థానంలో సామర్థ్యం, వృత్తిపై నిబద్ధత కలిగిన అధికారులకు అవకాశం కల్పించారు. ఏ వీసీ వచ్చినా అవకాశాలు రాక అట్టడుగున ఉండిపోతున్న వర్గాలకు డాక్టర్ పీవీ సత్యనారాయణ పెద్ద పీట వేశారన్న ప్రచారం జరుగుతుంది. వర్సిటీలో పరిపాలనా వ్యవస్థను పటిష్ఠం చేయడం, పరిశోధనల నాణ్యతను పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం, క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడే పరిశోధనలను ప్రోత్సహించడం ఈ ప్రక్షాళనలో ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని విభాగాల్లో పనితీరు సమీక్షలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ రంగంలో మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆధునిక సాంకేతికతను (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు రూపురేఖలు మారాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదంగా.. సుందరంగా.. ఆకర్షణీయమైన పరిసరాలతో గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ ప్రగతిపై శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పెమ్మసాని మాట్లాడుతూ సురక్షితమైన తాగునీరు, చక్కని పారిశుధ్యం, ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు, రహదారులతో నగర రూపురేఖలు మారాలన్నారు. ప్రజా వినియోగం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. బొంగరాలబీడు వద్ద పార్కు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. శంకర్‌విలాస్ పనులు 2027కి పూర్తి చేయాలని ఆదేశించారు. గోరంట్ల నీటి పథకం జూన్ మొదటి వారానికి ప్రారంభం కావాలన్నారు. ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి మాట్లాడుతూ కుక్కల బెడద నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఉన్న ఆటంకాలను పరిష్కరించాలన్నారు. కలెక్టర్ సాయికాంత్‌వర్మ, జీఎంసీ కమిషనర్ కె.మయూర్‌అశోక్ మాట్లాడుతూ మానస సరోవరం అభివృద్ధిని పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు డీపీఆర్ తయారీ బాధ్యత ఎపిటెకో సంస్థకు కేటాయించామన్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, పర్యవేక్షక ఇంజనీర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీనివాసమూర్తి, రమేష్, శ్రీనివాసరావు, వెంకటరత్నం, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, చీఫ్ మెడికల్ అధికారి డా.శాంతిలత, చీఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారిరాంబాబు పాల్గొన్నారు.

నేడు మొబైల్స్‌కు ఎమర్జన్సీ అలర్ట్

- భయాందోళనలు వద్దని ప్రజలకు సూచన

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) అత్యవసర హెచ్చరికల వ్యవస్థ(సెల్ బ్రాడ్ కాస్ట్ అలర్ట్ సిస్టమ్)ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల మధ్య రాజధాని, పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లకు పరీక్ష సందేశాలు వస్తాయని కలెక్టర్ సాయి కాంత్‌వర్మ తెలిపారు. ఈ కారణంగా మొబైల్ ఫోన్లకు వైబ్రేషన్‌తో కూడిన నోటిఫికేషన్ బీప్ శబ్ధంతో రావొచ్చన్నారు. ఈ అలర్ట్ వచ్చిన వారు స్పందించాల్సిన అవసరం లేదని, ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దని తెలిపారు. ఇది కేవలం సాంకేతిక పరీక్ష సందేశం మాత్రమేనని చెప్పారు. ఈ సిస్టమ్ వల్ల ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో లక్షలాది మందిని తక్కువ సమయంలో అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందన్నారు.

2028కి క్యాన్సర్ ఆస్పత్రి అందుబాటులోకి

- అమరావతిలో నిర్మాణ పనులకు బాలకృష్ణ భూమిపూజ
- 21 ఎకరాలు.. ఏడు అంతస్తుల్లో బసవతారకం ఆస్పత్రి నిర్మాణం



ఆస్పత్రికి భూమి పూజ చేస్తున్న బాలకృష్ణ

తుళ్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ హాస్పటల్‌ను 2028కి మొదటి దశను పూర్తి చేసి రోగుల కు అందుబాటులోకి తెస్తామని హిందూపురం ఎమ్మెల్యే, ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ సీఈవో నందమూరి బాలకృష్ణ తెలిపారు. తుళ్లూరు రెవెన్యూలో బసవతారకం ఆస్పత్రి నిర్మాణ పనులను శుక్రవారం బాల కృష్ణ ప్రారంభించారు. తొలుత పూ జలు నిర్వహించి అనంతరం ఆయ న స్వయంగా పలుగు పట్టి పారతో మట్టి తీసి పనులకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది ఆగస్టు 13న శంకుస్థాపన జరిగినా హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను మార్చాల్సి రావడం, మరి కొన్ని అనుమతులు పెండింగ్‌తో పనులు ముందుకు సాగలేదు. కాగా అనుమతులు అన్నీ రావడంతో తాజాగా రాజధాని రైతులు, మహిళలు సమక్షంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాల కృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ ధనికులు, పేదలన్న తేడా లేకుండా, లాభనష్టాలతో నిమిత్తం లేకుండా తల్లి బసవతారకం ఆశయం కోసం ఇప్పటికే హైదారాబాద్‌లో క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నట్లు (మిగతా 8వ పేజీలో)

గోవిందా.. గోవింద

కన్నుల పండువగా భావదేవుని రథోత్సవం

పూజలు అందుకున్న సాక్షి భావనారాయణస్వామి



రథోత్సవానికి హాజరైన అశేష జనవాహిని

పొన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో ప్రసిద్ధి చెందిన శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి దివ్య రథోత్సవం శుక్రవారం భక్తుల గోవింద నామస్మరణల మధ్య కన్నుల పండువగా జరిగింది. సాక్షి భావనారాయణ స్వామి మహోత్సవాలలో భాగంగా వేకువజామున స్వామి వారి కల్యాణ మహోత్సవం పౌర్ణమి వెలుగుల్లో జరిగింది. ఉదయం స్వామి వారి గరుడోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆచారం ప్రకారం పాములపాటి వంశీయులు రథానికి తొలి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, వివిధ పార్టీల నేతలు స్వామివారికి పూజలు నిర్వహించి రథంపై సాక్షి భావన్నారాయణ స్వామి, సుందరవల్లి రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. అశేష జనవాహిని జయజయధ్వానాల మధ్య రథోత్సవం సాగింది. పాత పొన్నూరు వరకు సాగిన రథయాత్ర తిరిగి ఆలయానికి చేరుకోవడంతో ముగిసింది. పొన్నూరు తిరునాళ్లగా పేరుగాంచిన భావదేవుని రథోత్సవాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తజనం భారీగా తరలివచ్చింది. తహసీల్దారు జియావుల్‌హక్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి కమిషనర్ పోతురాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, డీఎస్పీ జనార్ధన్‌రావు, సీఐలు వీరానాయక్, కృష్ణయ్య రథోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రథంపై కొలువైన సాక్షి భావనారాయణ స్వామి



2-5-26	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	42	27
తెనాలి	41	28
నరసరావుపేట	44	29
రెంటచింతల	44	29
బాపట్ల	38	28
చీరాల	38	28

రైలు దోపిడీ యూపీ ముఠా పనేనా!

● అప్పికట్ల రైలు చోరీలో పది మంది విచారణ ● చోరీకి సంబంధం లేదని వెల్లడి ● ఓ ముఠాపై అనుమానంతో యూపీ బాట పట్టిన రైల్వే పోలీసులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇటీవల అప్పికట్ల సమీపంలో జరిగిన రైలు చోరీ ఘటనలో ముమ్మర దర్యాప్తు చేస్తున్నప్పటికీ ఎలాంటి క్లూ దొరక్కపోవడంతో రైల్వే పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఘటన జరిగిన రోజు రాత్రి బాపట్ల రైల్వే స్టేషన్‌లో ఓ పదిమంది గ్రూపు ఎక్కినట్లు సీసీ కెమెరాల కదలికల్లో గుర్తించారు. వారు ఫోన్ పే ద్వారా రైలు టిక్కెట్ కొన్నట్టు విచారణలో తేలడంతో.. దాని ఆధారంగా వారిని పిలిపించి బాపట్ల జీఆర్‌పీ స్టేషన్‌లో విచారణ చేశారు. వారంతా విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శనం కోసం వెళుతున్నట్లు వెల్లడి కావడంతో విడిచిపెట్టారు. బెంగళూరు నుంచి విజయవాడ వరకు దాదాపు ప్రతి రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలను జల్లెడ పట్టినా ఎలాంటి క్లూ లభించలేదు. దీంతో ఈ తరహా దోపిడీల్లో ఆరితేరిన ముఠాల మోడల్ ఆపరేషన్‌ను విచారణ చేయగా ఉత్తరప్రదేశ్‌లో ఉన్న ఓ ముఠా సరిగ్గా ఇదే విధంగా రైళ్లలో దోపిడీలకు పాల్పడుతుండటంతో సస్పెక్ట్ చేశారు. దీంతో ఓ బృందం దర్యాప్తు కోసం యూపీ బాట పట్టింది. ఇంకో వైపు ఇక్కడ మరో రెండు బృందాలు ముమ్మరంగా విచారణ చేస్తున్నాయి. జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ విభాగాలు సంయుక్తంగా రైలు చోరీ కేసులో దర్యాప్తు చేపడుతున్నాయి.

సీనియార్టీ, రోస్టర్ ఆధారం గానే ప్రమోషన్లు

గుంటూరు సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని డీపీ ఓ బీవీ నాగసాయి కుమార్ శుక్రవారం తెలిపారు. ఉద్యోగసంఘాల్లో ఆరోపణలపై ఆయన స్పందించారు. 2024 డిసెంబరులోనే సీనియారిటీ జాబితా రూపొందించి అభ్యంతరాలను స్వీకరించామని వెల్లడించారు. రోస్టర్ విధానంలో కూడా ఎక్కడా పొరపాటు జరగకుండా ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఒక వేళ ఎవరికైనా అభ్యంతరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, మే 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, సాయిల్ సైన్స్ అగ్రికల్చర్ కెమిస్ట్రీ, ఎంఏ జర్నలిజం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం పీజీ పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. అలాగే బీటెక్ మొదటి సంవత్సరం రెగ్యులర్ ఫలితాలను కూడా సీఈ విడుదల చేశారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందు పరిచమని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే

సత్తెనపల్లి, బెల్లంకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మండలంలోని అబ్బూరు గ్రామంలో 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ, టీహెచ్ఆర్ మెటీరియల్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి గ్రాడ్యుయేషన్ సంపూర్తిగా, 1వ తరగతిలో ప్రవేశానికి వెళ్తున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్ కృతికా శుక్లా విద్యార్థులను సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కేంద్రం కార్యకర్త మల్లేశ్వరి పూర్తి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కేంద్రం పని తీరు పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని పట్టు గూడుల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వారి వెంట రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనాదేవి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ చిన్నారులతో కలెక్టర్ కృతికా, ఎమ్మెల్యే కన్నా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. బెల్లంకొండలో ప్రకృతి వ్యవసాయంలో సాగుచేస్తున్న బత్తాయి తోటలను ఆమె సందర్శించారు. సేంద్రియ ఎరువులు, పురుగు మందులను స్థానికంగా తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచే బయో రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. సేంద్రియ ఎరువులు రైతులకు అందుబాటులో ఉంటాలన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. బయోరిసోర్స్ సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో ముందస్తు పన్నుకు 5శాతం రాయితీ

ఈ నెల 31లోపు అవకాశం

గుంటూరు సిటీ,మే 1(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను ముందుగానే చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ అందిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను మే 31లోపు చెల్లిస్తే ఈ 'ఎర్లీ బర్డ్ ఆఫర్' వర్తిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐనవోలు శాఖమూరు, వెలగపూడి గ్రామ పంచాయతీల పరిధిలోని వి.ఐ.టి విశ్వవిద్యాలయం రూ.1,26,25,845 చెల్లించి రూ.5,89,993 రాయితీ పొందింది. తక్కెళ్ళపాడు సైబర్ డెంటల్ కాలేజీ రూ.3,14,489 చెల్లించి రూ.11,074 రాయితీ పొందగా, తెనాలి ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ జంపాల సుశీల రూ.2,84,872 చెల్లించి రూ.9,689 రాయితీ పొందారు. ఈ మొత్తాలను డిమాండ్ డ్రాఫ్టులు, చెక్కుల రూపంలో పంచాయతీరాజ్ సంచాలకులు కృష్ణతేజకు అందజేసినట్లు ఆయన వివరించారు. ప్రజలందరూ ఈ నె 31లోపు పన్నులు చెల్లించి ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు పన్ను డీడీలు అందజేత

అజ్మీర్‌కు నేరుగా వీక్లీ రైలు

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే అజ్మీర్ షరీఫ్ దర్గా సందర్శనకు వెళ్లే యాత్రీకుల కోసం ఈ నెల 12వ తేదీ నుంచి గుంటూరు మీదగా వీక్లీ రైలుని నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. నంబరు. 17295 కాకినాడ టౌన్ - హిసార్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం వేకువజామున 5.40కి బయలుదేరి ఉదయం 10.35కి గుంటూరు చేరుకొని 10.40కి బయలుదేరుతుంది. ఈ రైలు సాయంత్రం 4 గంటలకు చర్లపల్లి, రాత్రి 8.05కి బాసర, గురువారం వేకువజామున 4.05కి అజ్మీర్, మధ్యాహ్నం 1.40కి హిసార్ చేరుకొంటుంది. తిరుగు ప్రయాణంలో నంబరు. 17296 హిసార్ - కాకినాడ టౌన్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 2.10కి బయలుదేరి, రాత్రి 11.20కి అజ్మీర్, ఆదివారం ఉదయం 9.30కి చర్లపల్లి, మధ్యాహ్నం 3.40కి గఉంటూరు, రాత్రి 9.35కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది.

బీజేపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో మహిళా బిల్లుపై బీజేపీ పెద్దలు కాంగ్రెస్ పై చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు యన్నం సుధీర్‌బాబు, ఎండీ ఖలీల్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య, అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జేడీ శీలం మాట్లాడుతూ మహిళా బిల్లు గతంలో ఆమోదం పొందిందని, మహిళాభ్యుదయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. మహిళా బిల్లుపై చిత్తశుద్ధి లేని బీజేపీ ఆ నెపాన్ని కాంగ్రెస్‌పై నెట్టే కుట్రలు చేస్తోందన్నారు. దళిత క్రైస్తవులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయని, ఇది మంచి పరిణామం కాదన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరోసారి పునఃసమీక్షించాలని జేడీ శీలం కోరారు. రాష్ట్రంలోనూ అటు టీడీపీ, వైసీపీలు బీజేపీకి తొత్తుగా మారిపోయాయని విమర్శించారు. అమరావతి రాజధాని పనుల్లోనూ వేగం పెంచాలని కోరారు. భూములిచ్చిన రైతుల న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాన్‌బాబు, సలీం, సాంబశివుడు, చుక్కా చంద్రపాల్, గడ్డం పాల్, అంబటి రత్తయ్య తదితరులున్నారు.

త్రికోటేశ్వర స్వామికి లక్ష మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్ , మే 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటప్పకొండలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా.. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూపంగా వెలసిన త్రికోటేశ్వర స్వామికి లక్ష మల్లెల అర్చనను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా స్వామివారికి అభిషే కాలు, అలంకారాలు నిర్వహించి మహా మంగళహారతిని సమర్పించారు. వైశాఖ పౌర్ణమి రోజు స్వామివారిని దర్శించుకోవడం ద్వారా ప్రత్యేక ఫలితాలు లభిస్తా యని భక్తులు విశ్వసిస్తారు.

కార్మికుల కోసం సంక్షేమ బోర్డు

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, మే 1(ఆంధ్రజ్యోతి): రక్తాన్ని స్వేదంగా మార్చి అవరోధాలను అభివృద్ధి మెట్లుగా మలిచే శక్తి కార్మికులకుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు ప్రాంత కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పరిశ్రమల్లో వందలాది మంది కార్మికులు పనిచేయబట్టే అభివృద్ధిలో పల్నాడు ప్రాంతం మరో మెట్టు ఎక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు ప్రకటించినప్పుడు పార్టీ జెండాలో నాగలి, చక్రం, గుడిసె చిహ్నాలను చేర్చడం జరిగిందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడంలో కార్మిక పాత్రను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని యరపతినేని గుర్తుచేశారు. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఇసుక, సిమెంట్ ధరలు పెంచి భవన నిర్మాణ రంగాన్ని, 40 లక్షల మంది ఉపాధిని ఆనాటి ప్రభుత్వం దెబ్బతీసిందని తెలిపారు. కార్మికుల వైద్య సేవల కోసం గుంటూరు, శ్రీసిటీలో 100 పడకలు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రులు నిర్మిస్తున్న విషయాన్ని యరపతినేని గుర్తుచేశారు. కార్మికుల సంక్షేమ బోర్డును టీడీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జీఓ నంబరు 1214ను రద్దుచేసి తద్వారా అమలయ్యే 12 పథకాలను రద్దుచేసి రూ.610 కోట్లు గత ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. అన్న క్యాంటీన్లను రద్దుచేసి అసంఘటిత కార్మికుల పొట్ట కొట్టారని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. కోటి మంది కార్మికులకు చంద్రన్న బీమా అందించిన ఘనత టీడీపీదేనన్నారు.

నల్లపాడు మండీలో తనిఖీ

● రూ.46 వేల ఆదాయం

● అక్రమాలపై ఏఎంసీ చైర్‌పర్సన్ హెచ్చరిక

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

నల్లపాడు గొర్రెల మండీలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొందలపాటి అమరేశ్వరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం నుంచే మండీ కార్యకలాపాలను పరిశీలించిన ఆమె, వసూళ్ల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఫీజుల వసూళ్లలో పారదర్శకత పాటించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఆమె పర్యవేక్షణలోనే మొత్తం రూ.46 వేల ఆదాయం నమోదు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలి ఆరోపణల నేపథ్యంలో మండీలో జరుగుతున్న లావాదేవీలు, రికార్డు నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన చైర్మన్, వాస్తవ వ్యాపారం, నమోదు లెక్కల మధ్య తేడాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే పూర్తి స్థాయి విచారణకు వెనుకాడబోమని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆమె గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యార్డు కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వసూళ్ల ప్రక్రియను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ అమరేశ్వరి

విద్యా కుసుమాలు

నరసరావుపేట కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరివి సన్నకారు రైతు కుటుంబాలు. చదువంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే.. ప్రభుత్వం అందించిన సౌకార్యలను, విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకున్నారు. పట్టుదలతో పది ఫలితాల్లో 590 మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. అందులో ఒకరు ముప్పాళ్ల మండలం దమ్మాలపాడుకు చెందిన కసిరెడ్డి భార్గవి, మరొకరు నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన అడుసుమల్లి మహాలక్ష్మి పదో తరగతి అత్యుత్తమ ఫలితాలు సాధించారు. భార్గవి మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. గణితంలో వంద మార్కులు సాధించింది. భార్గవి తండ్రి సాంబిరెడ్డి సన్నకారు రైతు. తన ఇద్దరు కుమార్తెలను స్థానిక ఉన్నత పాఠశాలలో చదివించారు. భార్గవి ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ కనబరచి స్కాలర్‌షిప్‌ను సాధించింది. అడుసుమల్లి మహాలక్ష్మి తండ్రి నిరుపేద రైతు. తను కూడా ఎన్ఎంఎంఎస్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. డివిజన్, జిల్లా స్థాయిల్లో వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో బహుమతులు పొందింది. ఇద్దరూ ఇంజనీరింగ్ చేయాలన్న లక్ష్యాన్ని వెల్లడించారు. ఇద్దరినీ డీఈఓ పీవీజే రామారావు, ఉప విద్యాశాఖాధికారులు వి.ఏ సుబాబు, షేక్.మహబూబ్ సుభాని అభినందించారు.





మహాలక్ష్మీ భార్గవి(ఫైల్ ఫొటోలు)

స్పా సెంటర్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధి ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఫేస్ వన్ రెడ్డిపాలెం బీఓఐ బ్యాంకు పైన ఉన్న ఐరా స్పా సెంటర్ పై టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. స్పా ముసుగులో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. స్పా సెంటర్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మహిళలు, మరో వ్యక్తి, అలాగే మేనేజర్ సూర్య తదితరులను అదుపులోకి తీసుకుని నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో నగరంలో పలు స్పా సెంటర్‌ల ముసుగులో వ్యభిచారం గుట్టుగా సాగుతున్నట్లు పోలీసుల దాడులతో స్పష్టం అవుతోంది. పోలీసులు నగరంలో స్పా సెంటర్ల ముసుగులో గుట్టుగా సాగుతున్న వ్యభిచార నిర్వాకంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరో స్పా సెంటర్‌లో..

మరో స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి.. వేరే రాష్ట్రానికి చెందిన ఓ యువతి, ముగ్గురు మహిళలు, ఏడుగురిని అరెస్ట్ చేసారు. ఇన్నర్ రింగ్ రోడ్ ఫేస్ టులో కెనరా బ్యాంకు పైన ఏ9 బ్యూటీ సెలూన్ అండ్ స్పాలో వ్యభిచారం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది.

యువకుడిని చెట్టుకు కట్టేసి కొట్టిన గ్రామస్థులు



గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెంలో శుక్రవారం అర్ధరాత్రి అలజడి రేగింది. ఇళ్లలో దొంగతనాలకు యత్నిస్తున్న యువకుడిని స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేశారు. అతనిని ఎంతగా విచారించిన నోరు మెదపలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. గడిచిన నాలుగైదు రోజులుగా రాత్రిళ్లు గ్రామంలోని ఇళ్లల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో స్థానికులు నిఘా ఉంచారు. అర్ధరాత్రి ఓ ఇంటి డాబా మీద నుంచి మరో ఇంటి మీదకి ఆ యువకుడు దూకడానికి ప్రయత్నిస్తుండగా గమనించిన స్థానికులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

నెరవేరిన లక్ష్యం

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక 53వ డివిజన్‌లోని వెంగళరావునగర్‌లో నగరపాలకసంస్థ ప్రయోగాత్మకంగా ప్రారంభించిన బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారని గుంటూరు డీవైఈఓ యేసురత్నం, ఎంఈఓ 2 జ్యోతికిరణ్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినులను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాలలో 89 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రమీల, పాఠశాల కమిటీ చైర్మన్ చందు పవన్ కుమార్‌ని అభినందించారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

గుంటూరు(తూర్పు), మే 1 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిపూలే మహిళా సాధికారత-2029 కార్యక్రమంలో భాగంగా మదర్ థెరిస్సా బహుజన సేవా సంస్థ ఆధ్వర్యంలో గోరంట్ల, పెదకూరపాడు మండలం గారపాడు గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వేమవరపు వరలక్ష్మి, గౌరవ అధ్యక్షులు లక్ష్మి సహదేవ్, పల్లపు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ సూచించారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని గుంటూరు-1 డిపో చార్ట్ వద్ద ఉద్యోగులతో గేట్ మీటింగ్ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎండ తీవ్రత నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌లు పీవీ నరసింహారావు, వి.బాలునాయక్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు మే 1(ఆంధ్రజ్యోతి): లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌స్టేడియం ప్రాంతం, అంకమ్మతల్లి గుడి ఏరియా, గడ్డివాముల బజారు, సూర్యనగరు, ప్రియాంక గార్డెన్, ముగ్దళి నగర్ ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్న 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మలబార్ బ్రైడల్ జ్యువెలరీ షో ప్రారంభం

గుంటూరు(తూర్పు), మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో బ్రైడల్ జ్యువెలరీ షోను శుక్రవారం డాక్టర్ హర్షిత, వ్యాపారవేత్త పెద్ది రమణారావు ప్రారంభించారు. బ్రైడల్ జ్యువెలరీ షోలో ప్రత్యేక వజ్రాభరణాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, మేనేజర్ వినయ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య సీవోఐపీఎల్ విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులను అభినందిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

గుంటూరు (విద్య), మే 1 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో శ్రీ చైతన్య సీవోఐపీఎల్ విద్యార్థులు అత్యున్నత ఫలితాలు సాధించారని దుర్గాప్రసాద్ తెలిపారు. 580కి పైగా 32 మంది, 570కి పైగా 56 మంది, 560కి పైగా 75 మంది, 550కి పైగా 89 మంది, 500కి పైగా మార్కులు 120 మంది సాధించారన్నారు. విద్యార్థులను డీన్ శివకుమార్, క్యాంపస్ ప్రిన్సిపల్స్ వెంకటేశ్వర్లు, కోమలి తదితరులు అభినందించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సోమేపల్లి

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంతోపాటు వచనకవిగా, రచయితగా రాష్ట్రస్థాయి ఖ్యాతిగాంచిన సోమేపల్లి వెంకటసుబ్బయ్య నేటి రచయితలకు, కవులకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ కవి రచయిత విమర్శకులు భూసరపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి సభ నిర్వహించారు. సభలో సాహిత్య విమర్శకురాలు డాక్టర్ సుశీలమ్మ, రాష్ట్ర రచయితల సంఘం ప్రధానకార్యదర్శి చలపాక ప్రకాష్‌లు సోమేపల్లి సాహితీసేవలను కొనియాడారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పానిరావు, కేజే రమేష్, సోమేపల్లి విజయలక్ష్మి, శ్రీవశిష్ట, ఎస్‌ఎం సుభాని, నానా తదితరులు పాల్గొన్నారు.



సోమేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఆర్థిక భారమైనా పింఛన్లు ఆపలేదు

• పింఛను పంపిణీలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్



పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, పిల్లి మాణిక్యకరావు, కనపర్తి



శివరాంనగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక భారం ఉన్నప్పటికీ లబ్ధిదారులకు పెన్షన్లను అందించడం కూటమి ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 14వ డివిజన్, రామ్- రహీమ్ కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌తో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. తూర్పు నియోజకవర్గంలో నూతనంగా 36 పింఛన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

కార్మికుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే నసీర్

అమరావతి నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత గుంటూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పలు చోట్ల మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

నగరంలోని ఆకులవారితోట, శివరాంనగర్‌లో శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కలెక్టర్ సాయికాంత్‌వర్మ స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,53,379 మందికి రూ.110.50 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. తొలి రోజున 91.09 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేశామన్నారు.

పేదలకు అండగా: ఎమ్మెల్యే మాధవి

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. శ్రీనివాసరావుపేటలో ఆమె పింఛన్ల పంపిణీ చేశారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, చెరుకూరి తిరుపతి రావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కొల్లి అనిల్, నారాయణ రెడ్డి, చింతకాయల వెంకట సాయి, ఆళ్ల హరి, షేక్ నాగుర్, అప్పిశెట్టి రంగా పాల్గొన్నారు.

26 డివిజన్లలో చలివేంద్రాలు

మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కల్పించేందుకు ఎమ్మెల్యే గళ్లా మాధవి పశ్చిమ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని టీడీపీ నేతలు పిల్లి మాణిక్యరావు, కనపర్తి శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గంలో 18 ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు.

మీ భవిష్యత్ మీ ఆలోచనల్లోనే

• నారీ శక్తి కార్యక్రమంలో ఐజి రాజకుమారి

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మీ భవిష్యత్ మీ ఆలోచనల్లో ఉంటుందని ఐజీ రాజకుమారి విద్యార్థినులకు వివరించారు. శుక్రవారం గార్డెన్స్‌లోని కమ్మ జన సేవా సమితి - మహిళా హాస్టల్ ప్రాంగణంలో నారీ శక్తి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థినులు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న వివిధ సంఘటనలను దృష్టిలో పెట్టుకుని మహిళలు పాటించాల్సిన భద్రతా చర్యలు, ఆపద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయాల్లో తమను తాము రక్షించుకోవడానికి ఏవిధంగా పోలీసు వారి సహాయాన్ని పొందాలనే అంశాల గురించి ఎస్పీ వకుల్ జిందాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, అళహరి శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్, సీఐలు రమేష్, నారాయణ, నిస్సార్ బాషా తదితరులు పాల్గొన్నారు.



కేజేఎస్‌ఎస్ ప్రతినిధులతో ఐజి రాజకుమారి, ఎస్పీ వకుల్‌జిందాల్

కార్మికుల హక్కులను కాపాడుతాం

• మిర్చియార్డు మేడే వేడుకల్లో చైర్మన్ కుర్రా అప్పారావు



వేడుకలో పాల్గొన్న చైర్మన్ కుర్రా అప్పారావు



టీడీపీ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను పరిరక్షిస్తామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్రా అప్పారావు తెలిపారు. శుక్రవారం మేడే సందర్భంగా మిర్చియార్డు ఎదుట అరుణ పతాకాన్ని ఆయన ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు లేనిదే మిర్చియార్డు లేదన్నారు. కార్యక్రమంలోనాయకులు వెంకయ్య, ప్రసాదు, నాగయ్య పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీలో..

మేడే సందర్భంగా టీఎన్‌టీయూసీ జిల్లా విభాగం ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా కార్యాలయంలో నాయకులు కార్మికుల జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్‌యాదవ్, సయ్యద్ అబ్దుల్లా, ఎడ్లూరి నిరీక్షణరావు, పుల్లా సుందరంబాబు, పెనుమచ్చు శ్రీనివాసరావు, కంచర్ల సాంబశివరావు, షేక్ కాలేషావలి, ఏమినేటి లక్ష్మి శైలజ, వేములకొండ శ్రీనివాస్, మూలకా సత్యవాణి, పంచుమర్తి కల్పన, లామ్ నవమి, చిట్టెం సింధు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

గుంటూరు(తూర్పు): నగరంలో వాడవాడల అరుణ పతాకం రెపరెపలాడింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాన్ని జాతీయ సమితి సభ్యుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి, సీపీఐ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ (ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు, జి. సురేష్ బాబు, రావుల అంజిబాబు కోట్ల మరియదాసు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

సీపీఎం ఆధ్వర్యంలో 41వ వార్డులోని పుచ్చలపల్లి సుందరయ్యనగర్, హిందూ కళాశాల సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, బీఆర్ స్టేడియం, హనుమయ్య కంపెనీ తదితర ప్రాంతాల్లో నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నళినికాంత్, వలీ, షహీద్, ఆశోక్, శ్రీనివాసరావు, ఆశోక్, శ్రీనివాసరెడ్డి, సలాం, నాని, ప్రసన్న, వలీ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

నగరంలో ఆటో స్టాండ్‌లు, మున్సిపల్ మస్టర్ కార్యాలయాలు, ముఠా అడ్డాలు, కోల్డ్ స్టోరేజ్, భవన నిర్మాణ కార్మిక అడ్డాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ లాం ఫామ్, ఇతర కార్మిక వాడలలో సీఐటీయూ పతాక ఆవిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో కే శ్రీనివాసరావు, అరుణ, ముత్యాలరావు, బి.సత్యనారాయణ, దొడ్డ కోటేశ్వరరావు, శ్రీనివాస్, సుభాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ..

అరండల్‌పేటలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జెండాను రాష్ట్ర నాయకుడు య. గనిరాజు ఆవిష్కరించారు. అమరావతి రోడ్డులో ఐఎఫ్టీయూ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వి.కృష్ణ ఆవిష్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం..

గుంటూరు: మేడేను పురస్కరించుకుని మానవతా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికురాలిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సతీష్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు నూరిఫాతిమా, అంబటి మురళీ, వనమా బాలవజ్రబాబు హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పఠాన్ సైదాఖాన్, మార్కెట్ బాబు, సింగ్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పదిలో నగరపాలక సంస్థ విద్యార్థుల ప్రతిభ

• సగటున 77.28 శాతం ఉత్తీర్ణత.. అత్యధికంగా 583 మార్కులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్పొరేషన్ హైస్కూళ్ల నుంచి పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. అనేక పాఠశాలల్లో 550నుంచి 583 వరకు మార్కులు సాధించారు. మొత్తం 15 పాఠశాలల నుంచి 1259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 973 మంది(77.28శాతం) ఉత్తీర్ణత సాధించారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని 580మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం పద్మజ తెలిపారు. 23మంది విద్యార్థులు 500పైగా సాధించారన్నారు.

బీసీ హాస్టల్స్ విద్యార్థులు..

జిల్లాలోని బీసీ హాస్టల్స్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని సంక్షేమశాఖాధికారి మయురి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 11 బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ ఉండగా 140 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 127 మంది(90.07శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 77 మంది ప్రథమ శ్రేణిలో 37 మంది ద్వితీయశ్రేణిలో, 13 మంది తృతీయశ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. పెనుమాక బీసీ హాస్టల్ విద్యార్థి రామ్ చరణ్ 542, గుంటూరులోని బీసీ హాస్టల్ విద్యార్థులు నందిని 538, పోతురాజు భూలక్ష్మి 531, కళ్యాణ్‌రామ్ 520, కొమ్మవరపు శ్రావ్య 516, పోలు గౌతం 511, ఆవుల దుర్గా కోమలి 509 ,మణికంఠ 504, ఎం మనోజ్ 535, వెంకట విజయకుమార్ 517 ,ఆర్ మనోజ్ కుమార్ 552, ఏ సునీత 542, పి.చక్రవర్తి 529, విజయ్ కుమార్ 521 మార్కులు సాధించారన్నారు.

17 పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత

పది ఫలితాల్లో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు నమోదయ్యాయి. ఏపీ రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల(గుంటూరు), సెయింట్ జోసెఫ్ గర్ల్స్ హై స్కూల్(గుంటూరు), మున్నంగి, కొర్రపాడు, పాలడుగు, గోగులమూడి, పెదపాలెం, వల్లభాపురం, బోడిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, అబ్బినేనిగుంట వారిపాలెం, మామిళ్ళపల్లి, అమీనాబాద్, వంగీపురం, పుసులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు గుంటూరులోని ఎస్ఎస్ఓఎన్ఓ ప్రభుత్వ హైస్కూల్ నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సలీమ్‌బాషా

జనగణనను విజయవంతం చేయాలి

• కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, మే 1(ఆంధ్రజ్యోతి): జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు నగర ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం సురక్షితంగా ఉంటుందని, జనగణనపై సందేహాలకు జీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు కాల్ సెంటర్ 0863-2345105 ఏర్పాటుచేశామన్నారు. జనగణన పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతోందని, నగరంలో 1310 హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను ఏర్పాటుచేశామన్నారు. దీనికోసం 1272 మంది ఎన్యుమరేటర్లను, 201 సూపర్వైజర్లను, ముగ్గురు చార్జ్ అధికారులను నియమించామన్నారు. ఎన్యుమరేటర్లు మే 1వ తేదీన తమకు కేటాయించిన ఇళ్ల హద్దులు సరిచూసుకుని, మే 30వ తేదీ వరకు ప్రతి ఇంటినీ సందర్శించి మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి యాప్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇళ్ల గణన మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు వారి ఐడీ కార్డులను పరిశీలించి వివరాలు తెలియజేయాలని సూచించారు.

వేసవి క్రీడా శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

గుంటూరు(క్రీడలు), మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ పోస్టర్‌ను కలెక్టర్ సాయి కాంత్‌వర్మ ఆవిష్కరించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

గుంటూరు(కార్పొరేషన్), మే 1(ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని డీసీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి వజ్జా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు స్విమ్మింగ్, షటిల్, స్కేటింగ్ వంటి క్రీడల్లో పాల్గొని శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దామా మహేశ్వరరావు, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

గుంటూరు మెడికల్, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు హర్షణీయమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 44వ డివిజన్ పరిధిలోని కొరిటెపాడు సెంటర్‌లో జనసేన డివిజన్ అధ్యక్షుడు పవన్ వెంకీ ఆధ్వర్యంలో శుక్రవారం మేడే వేడుకల్లో ఆయన ప్రసంగించారు. తొలుత కార్మికుల జెండాను ఆవిష్కరించి అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమం, మంచినీళ్ల చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అయిశెట్టి లక్ష్మీశ్రీనివాసరావు, జెట్టి బాబు, కొలసాని బాలకృష్ణ, చందు శ్రీనివాసరావు, కుర్రశ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు. పాతగుంటూరు రంగా బొమ్మ, మణిహోటల్ సెంటర్లలో దురిశాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జెండాను ఆవిష్కరించి మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యల్లావుల అశోక్, కొలగాని సుబ్బారావు, జనసేన నాయకులు మాదాసు శేఖర్, చందనపు నాగరాజు, సయ్యద్ షర్ఫుద్దీన్, రామిశెట్టి ధరణి, చిన్నంశెట్టి సాంబశివరావు, అల్లం బాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

గుంటూరు(విద్య), మే 1(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక రైలుపేట కన్నా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నుంచి 10 రోజులు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు ఎం విజయభాస్కర్, జాన్‌బాబు తెలిపారు. నాలుగు నుంచి పదో తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, ఓరుగామి సైన్స్ ప్రయోగాలు, చేతిరాత, మ్యాచ్ టెక్నిక్స్ తదితర సాంస్కృతిక విభాగాలలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు 8499932328, 9000453600లో సంప్రదించాలన్నారు.

ఆటో స్టాండ్ కోసం రగడ

• సీపీఐ నాయకులు, వ్యాపారులకు వాగ్వాదం

గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే కాకాని రోడ్డులోని వాసవీ మార్కెట్ మెయిన్ గేటు వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటు విషయమై శుక్రవారం వ్యాపారులకు, ఆటోడ్రైవర్లకు మధ్య చిన్నపాటి రగడ నెలకొన్నది. మేడే పురస్కరించుకుని ఆటోడ్రైవర్లు వాసవీ మార్కెట్ వద్దకు చేరుకుని స్టాండ్ ఏర్పాటుచేసేందుకు సిద్ధమయ్యారు. మార్కెట్ ఎదుట ఆటోస్టాండ్ వద్దంటూ వ్యాపారులు ససేమిరా అంటున్నారు. ఇదే సమయంలో శుక్రవారం ఆటో స్టాండ్ ఏర్పాటుకు డ్రైవర్లు, సీపీఐ నాయకులు కూడా రంగంలోకి దిగడంలో వాసవీమార్కెట్ వ్యాపారులు ఆందోళనకు దిగారు. అసోసియేషన్‌ల నాయకులు, సీపీఐ నాయకుల జోక్యంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే 11మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన లక్ష్మీనరసింహ సంకీర్తన

గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ లక్ష్మీనరసింహ దేవోభవ సంకీర్తన గాన కార్యక్రమం జరిగింది. చింతలపాటి రామామహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, కే నాగలక్ష్మి విశ్వపావని పలు కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

కాస్త పట్టించుకోండి బాస్..

• పోలీసుశాఖపై కొరవడిన నిఘా
• పట్టుకోల్పోతున్న జిల్లా అధికారి..
• సీఐ మల్లయ్యపై అత్యాచారం కేసు, పరారీ
• మరో రాసలీలల వీడియో వైరల్



సీఐ చినమల్లయ్య



(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలో ఇప్పటికే పోలీసు అధికారులు.. సిబ్బంది అసాంఘిక కార్యకలాపాలు అనేకం వెలుగు చూశాయి. పోలీసులే మహిళలను లైంగిక వేధింపు లకు గురిచేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అయి నా పోలీసు శాఖ ప్రక్షాళనకు పోలీసు బాస్ చర్యలు తీసుకోవడం లేదు. నేరాలకు పాల్పడుతున్న అధికారు లకు, పోలీసులకు నిఘా విభాగం కూడా కొమ్ము కాస్తున్నదన్న విమర్శలున్నాయి. సరైన నిఘా ఉంటే ఇన్ని నేరాలు జరగేవి కాదన్న అభిప్రాయం జిల్లా వాసుల నుంచి వ్యక్తమవుతోంది. తాజాగా సీఐ చిన మల్లయ్యపై వినుకొండ స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదు కావడంతో.. ఆయన పరారీలో ఉన్నాడు. ఆయన కోసం రెండు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

సీఐ చిన మల్లయ్య మహా ముదురులా మారిపోయాడు. వినుకొండ బ్రహ్మణపల్లిలో ఫాంహౌస్ ఏర్పాటు చేసుకొని రాసలీలు సాగించాడు. అతనిపై అత్యాచారం కేసులో.. సదరు మహిళ న్యాయస్థానంలో కూడా వాంగ్మూలం ఇచ్చింది. అయనను అరెస్టు చేసేం దుకు ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రెండు పోలీ సు బృందాలను ఏర్పా టు చేశారు. ఈ కేసు విచారణలో ఉండగానే మరో మహిళలతో సీఐ మల్లయ్య రాసలీలల విడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో పోలీసు పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేసి పోలీసు ఉన్నతాధికారులు మిన్నకున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఐ పరారీ కావడానికి కూడా కొందరు పోలీసులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. కారంపూడిలో తుపాకీతో టీడీపీ నేతలను బెదిరించిన ఉదంతంలో సీఐ మల్లయ్య వీఆర్‌లో ఉన్నారు. మల్లయ్యపై చర్యల కోసం ఎస్పీ కృష్ణారావు ఐజీకి నివేదిక పంపినట్టు సమాచారం.

ప్రక్షాళన దిశగా చర్యలేవీ

జిల్లా పోలీసు శాఖలో అక్రమాలు.. నేరాలు వెలుగు చూస్తున్నా.. పోలీసు బాస్ సరైన రీతిలో స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. పోలీసు శాఖపై పూర్తిగా నిఘా కొరవడటంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీరిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘటనలు కొనసాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల క్రికెట్ బెట్టింగులు, గంజాయి విక్రేతలు.. పేకాట నిర్వహణదారులతో పోలీసులు అంటకాగుతున్నారన్న ఆరోపణలుయి. కొన్ని స్టేషన్‌లలో ప్రైవేట్ పంచాయతీలు జోరుగా సాగుతున్నాయి. అయితే పోలీసు నిఘా విభాగం క్షేత్రస్థాయి ఘటనలపై నివేదికలు ఇవ్వడం లేదని సమాచారం. దిగజారిన జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు నడుం కట్టాలని ప్రజలు కోరుతున్నారు.



జనం బెంబేలు







భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం 41 డిగ్రీలు పైనే ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ ప్రభావం చూపింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు పది గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. జన సంచారం లేక కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వాళ్లు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖాలు పూర్తిగా కప్పేసుకొని వాహనాలపై వెళ్తున్న చిత్రాలివి.

- గుంటూరు

భవిష్యత్తు ప్రణాళికకు పది దిక్సూచి

అకుంఠిత దీక్షతో అత్యుత్తమ ఫలితాలు

చదివే సమస్తంగా భావించారు. అకుంఠిత దీక్షతో పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమై.. అత్యుత్తమ ఫలితాలు సాధించారు. భవిష్యత్తు ప్రణాళికకు పదో తరగతి మార్కులు దిక్సూచిగా భావిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆంధ్రజ్యోతి పలకరించింది.

- గుంటూరు (విద్య)

ప్రణాళికాబద్ధంగా చదివి..



పదో తరగతి ప్రారంభం నుంచే ప్రణాళిక బద్ధంగా చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని జి.దినేష్ (598) పేర్కొన్నాడు. తనకు ఉపాధ్యాయుల సహకారం మరవులేదని చెప్పాడు. ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని, తల్లిదండ్రులు పూర్ణ కుమారి, దుర్గారావు ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపాడు.

ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం



పరీక్షలు అంటే కంగారు పడాల్సిన అవసరం లేదు. చదివిన పాఠ్యాంశాలే వస్తాయని విద్యార్థిని శార్వి(596) తెలిపింది. సిలబస్ పూర్తికాగానే పునఃశ్చరణపై దృష్టి సారించాలని పేర్కొంది. తల్లిదండ్రులు విజయకుమార్, బిబారాణి పరీక్షల సమయంలో ఎంతో సహకారం అందించారని తెలిపింది. .

క్షుణ్ణంగా అధ్యయనం



పాఠ్యపుస్తకాలు క్షుణ్ణంగా అధ్యయనం చేశానని విద్యార్థిని బీవీ యశశ్రీ(596) తెలిపింది. ప్రతి అంశానికి నోట్స్ తయారు చేసుకుని, పాఠాలు అనుసంధానం చేసుకొని పరీక్షలకు సిద్ధమైనట్లు వెల్లడించింది. తల్లిదండ్రులు ఉషారాణి, కోటిప్రసాద్ పరీక్షల సమయంలో వెన్నంటి ఉన్నారని చెప్పింది.

ఏఐ ఇంజనీరు లక్ష్యం



ఐఐటీలో సీటు సాధించి ఏఐ ఇంజనీరుగా రాణించడమే లక్ష్యమని స్వేచ్ఛ ప్రియదర్శిని (598) తెలిపింది. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు నాగలక్ష్మి, వెంకటరావు సానుకూల దృక్పథం పెంపొందించేలా సలహాలు, సూచనలు ఇచ్చారని వెల్లడించింది.

సమయపాలన ముఖ్యం



పదో తరగతి విద్యార్థులకు సమయపాలన ఎంతో ముఖ్యమని ఇందువదన(598) పేర్కొంది. ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా సమయం కేటాయించుకుని అందుకు అనుగుణంగా పరీక్షలకు సిద్ధమైనట్లు చెప్పింది. తల్లిదండ్రులు విమలాదేవి, శివప్రసాద్ అందించిన సహకారం అత్యుత్తమ మార్కులు సాధనకు కారణమని చెప్పుకొచ్చింది.

ప్రతిభకు ప్రశంస



విద్యార్థినిని సన్మానించి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, మే1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో బాపట్ల జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం సాధించడం గర్వకారణమని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో శుక్రవారం జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ సన్మానించి, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కొల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని భావిరెడ్డి దివ్యతేజశ్రీ 596 మార్కులు సాధించడం పట్ల అభినందనలు తెలియజేశారు. గత ఏడాదితో పోలిస్తే రెండున్నర శాతం ఉత్తీర్ణత పెరిగిందన్నారు. మార్కులు గుర్తింపుకే పరిమితమని.. విజయానికి ప్రమాణం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరుత్సాహ పడకూడదన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా భావిరెడ్డి దివ్యతేజశ్రీ, పందిళ్ళపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు యడవల్లి తేజస్వి (593), గద్దే బంధవ్య (592), మెక్కనవారిపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి చదలవాడ సాయిరాం ధీరజ్ (586), చెరుకూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి షేక్. షాహుల్ అమీద్ (585), పందిళ్ళపల్లికి చెందిన గుంటూరు హర్ష (585)ను సన్మానించి, మెరిట్ సర్టిఫికెట్‌లను అందజేశారు. డీఈవో డి.శ్రీనివాస్, ఎంఇవోలు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రక్షాళనలో పీవీ మార్కు

(5వ పేజీ తరువాయి)

ప్రవేశపెట్టడం, డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేయడం కూడా ప్రక్షాళనలో భాగమని అధికారులు చెబుతున్నారు. రైతులకు సమయానుకూల సలహాలు అందించేలా ఎక్స్‌టెన్షన్ సేవలను పునర్వ్యవస్థీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

కంప్ట్రోలర్.. ఎస్టేట్ అధికారికి ఆశాభంగం

వైసీపీ అధికారంలో ఉన్న కాలం నుంచి మొన్నటి వరకు వర్సిటీ కంప్ట్రోలర్‌గా ఉన్న అధికారిపై అనేక ఆరోపణలున్నాయి. వర్సిటీ ఉద్యోగులతో పాటు, ఉద్యోగ విరమణ పొందిన వారిని వేధించినట్లు తెలుస్తుంది. నిధుల వినియోగంలోనూ మాజీ వీసీ శారదా జయలక్ష్మి మాటలకు పెద్ద పీట వేసి నిబంధనలకు విరుద్ధంగా వర్సిటీ అకౌంట్లు, డిపాజిట్లు మార్చినట్లు తెలుస్తుంది. ఆయనపై కూడా సుప్రీం కోర్టు న్యాయవాది ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఎస్టేట్ అధికారి కూడా ఇంజనీరింగ్ పనుల్లో అక్రమాలకు పాల్పడి నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారిద్దరినీ ఆయా పోస్టుల నుంచి తొలగించారు. అత్యంత కీలకమైన కంప్ట్రోలర్ పోస్టు ను బీసీ వర్గానికి చెందిన ముకుందరావుకు అప్పగించారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న నరసింగరావును ఎస్టేట్ అధికారి పోస్టులో నియమించారు.

రిజిస్ట్రార్‌గా మణి..

డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏ మణిని రిజిస్ట్రార్‌గా నియమించారు. గత వీసీ అక్రమాలకు సహకరించని పాపా నికి రిజిస్ట్రార్ పోస్టు నుంచి తప్పించిన జీ రామచంద్రరావు ను డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్‌గా నియమించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా ఉన్న ఎంవీ రమణను డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ బాధ్యతలు అప్పగించారు. మునిరత్నంను డీన్ ఆఫ్ పీజీ స్టడీస్‌కు, వీ సుమతిని డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా, జీ కరుణసాగర్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నియమించారు. మిగిలిన పోస్టుల ప్రక్షాళనపై కొత్త వీసీ దృష్టిసారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

2028కి క్యాన్సర్ ఆస్పత్రి.. అందుబాటులోకి

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. అమరావతిలో క్యాన్సర్ సేవలు అందించేందుకు ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కార్మికులకు మేడే శుభాకాంక్షలు

ఆస్పత్రి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా కార్మికులకు బాలకృష్ణ మేడే శుభాకాంక్షలు తెలిపారు. తనది కామ్రేడ్ భావజాలమన్నారు. ఎర్ర కండువాను బాలకృష్ణ మెడలో వేసిన కార్మికులు కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అని బాలకృష్ణతో కలిసి నినాదాలు చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, బాలయ్య యువసేన మండల అధ్యక్షుడు నెలకుదిటి చందు పాల్గొన్నారు.

టీడీపీలో లోకేశ్ జోష్!

విందు భేటీలతో సమన్వయ శంఖారావం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అధికార తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా మళ్లీ కట్టుదిట్టమవుతోంది. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ సమన్వయ రాజకీయాలకు కొత్త ఊపు తీసుకొచ్చారు. 'సమన్వయ శంఖారావం' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం.. పల్నాడు నుంచి మొదలై రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా కదులుతోంది. కేవలం అధికారంపై ఆధారపడకుండా కేడర్‌ను యాక్టివ్ చేయడం, నేతల మధ్య సమన్వయాన్ని పెంచడం, ఎన్నికల యంత్రాంగాన్ని ముందుగానే సిద్ధం చేయడం లోకేశ్ వ్యూహాలు.

విందు భేటీలతో.. రాజకీయాలు

సాంప్రదాయ రాజకీయ సమావేశాలకు భిన్నంగా విందు భేటీలలతో నేతలను ఒకే వేదికపైకి తీసుకురావడం లోకేశ్ ప్రత్యేకతగా నిలిచింది. సహృద్భావ వాతావరణంలో చర్చలు జరిపి.. అంతర్గత విభేదాలను తగ్గించడం ఈ మోడల్ లక్ష్యం. అందులో భాగంగా.. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం శుక్రవారం సాయంత్రం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారా లోకేశ్ పాల్గొని, నేతలతో విస్తృతంగా సమాలోచనలు జరిపారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల వారీ ప్రణాళికలు, 22 నెలల్లో సాధించిన నిధుల సమీకరణ వంటి అంశాలపై చర్చించారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కష్టపడ్డ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను నేతలు లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా, "ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటాను.. ఎప్పుడైనా నన్ను సంప్రదించవచ్చు" అంటూ ఆయన భరోసా ఇచ్చారు. నేతల ఐక్యతకు గుర్తుగా కేక్ కట్ చేశారు. పల్నాడులో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాసంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం.. గుంటూరులో మంత్రి పెమ్మసాని గృహంలో మరింత విస్తృతంగా కొనసాగింది.

కమిటీలపై వేగం.. లోకేశ్ క్లియర్ మెసేజ్

ఈ భేటీలో పార్టీ జిల్లా కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేసినట్లు సమాచారం. "మీరు నా దృష్టికి తీసుకొచ్చే ప్రతి అంశంపై వెంటనే స్పందిస్తాను" అంటూ నేతలకు హామీ ఇవ్వడంతో.. కార్యకర్తలకు నేరుగా నాయకత్వం అందుబాటులో ఉందనే నమ్మకం పెరిగింది.

కార్యకర్తలే బలం: పెమ్మసాని సందేశం

పార్టీ కష్టం కాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, పార్టీ అండగా నిలవాలని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. కేడర్ బలోపేతమే ఎన్నికల విజయానికి కీలకమని స్పష్టం చేశారు.

పల్నాడు నుంచి రాష్ట్రానికి సంకేతం

వర్గ రాజకీయాలకు పేరుగాంచిన పల్నాడు జిల్లానే ఈ సమన్వయ కార్యక్రమానికి వేదిక కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్కడి నుంచి ప్రారంభమైన ఈ శంఖారావం ఇప్పుడు జిల్లాల వారీగా విస్తరించే దిశగా సాగుతోంది. ఇది కేవలం సమావేశాల పరంపర కాదు... ఎన్నికల ముందు పార్టీని ఒకే దిశగా నడిపించే వ్యూహాత్మక కసరత్తుగా మారుతోంది.

కీలక నేతల హాజరు

ఈ భేటీలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తన తండ్రి దినకర్మల కారణంగా హాజరు కాలేకపోయారు. స్వల్ప వ్యవధిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అందుబాటులో లేకపోవడం వల్ల తాను హాజరు కాలేకపోతున్నట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.



మంత్రి పెమ్మసాని నివాసంలో సమావేశమైన మంత్రి లోకేశ్, ప్రజా ప్రతినిధులు, నేతలు



లోకేశ్‌కు ఆహ్వానం పలికి సమావేశానికి తీసుకెళ్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

చిత్రజ్యోతి

SINCE 1965

రామ్‌చరణ్ అదరగొట్టేశాడు





దర్శకుడు సుకుమార్

రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదల తేదీపై కొనసాగుతున్న ఊహాగానాలకు చెక్ పెడుతూ జూన్ 4న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో అధికారికంగా వెల్లడించారు దర్శక నిర్మాతలు. ముందు అనుకున్న ప్రకారం ఈ సినిమా మార్చిలోనే విడుదల కావాలి. కానీ ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. అయినా అప్పటికీ షూటింగ్ కొంత మిగిలి ఉండడం, రీ రికార్డింగ్ ప్రారంభం కాకపోవడంతో మళ్లీ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయంటూ వార్తలు వచ్చాయి. మళ్లీ విడుదల తేదీపై ఊహాగానాలు సాగుతుండడంతో ఒక దశలో వాటికి అడ్డుకట్టు వేయడానికి జూన్‌లో సినిమా రిలీజ్ ఉంటుందని నిర్మాణ సంస్థ ప్రకటించింది. అయితే అందులో రిలీజ్ డేట్ లేకపోవడం కొంత గందరగోళానికి కారణమైంది. ఇటువంటి నేపథ్యంలో ఓ ఫంక్షన్‌కు హాజరైన చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సాన జూన్ 26న 'పెద్ది' విడుదలవుతుందని వెల్లడించారు. అయితే ఆ తర్వాత రెండు రోజులకే అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' చిత్రం జూన్ 25న విడుదలవుతుందని ప్రకటించడంతో రామ్‌చరణ్, అఖిల్ పోటీ పడతారా అనే చర్చ మొదలైంది. అందుకే శుక్రవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి అనుమానాలన్నీ నివృత్తి చేసి జూన్ 4నే సినిమా వస్తుందని నిర్మాత ప్రకటించారు. ఈ సమావేశంలో దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ 'బుచ్చిబాబు 'పెద్ది' కోసం మంచి స్క్రిప్ట్ తయారు చేశాడు. ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ బ్యాలెన్స్ చేశాడు. 'పెద్ది'లాంటి కమర్షియల్ ఎమోషనల్ రైడ్ ఈ మధ్యకాలంలో రాలేదు. నిర్మాత సతీశ్ మంచి వ్యక్తి. ఆయన మొదటి సినిమాకే రామ్‌చరణ్‌లాంటి హీరో, బుచ్చిబాబు లాంటి దర్శకుడు దొరకడం అదృష్టం. ఈ సినిమాలో రామ్‌చరణ్ పెర్ఫార్మెన్స్ 'రంగస్థలం'ను దాటి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. అదరగొట్టేశాడు' అని తెలిపారు. 'ఇది ఒక కమర్షియల్ ఎమోషనల్ రైడ్. మీ హృదయాలకు దగ్గరగా ఉంటుంది. చరణ్ సార్‌పై నా ప్రేమను జూన్ 4న చూస్తారు' అన్నారు దర్శకుడు బుచ్చిబాబు. నిర్మాత వెంకట సతీశ్ కిలారు మాట్లాడుతూ 'ఇంత పెద్ద సినిమా చేసే అవకాశం ఇచ్చిన రామ్‌చరణ్ గారికి ధన్యవాదాలు. ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది' అన్నారు.

బాలకృష్ణతో కొరటాల శివ



నందమూరి బాలకృష్ణ దూకుడు పెంచారు. ప్రస్తుతం తను గోపిచంద్ మలినేని దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం ఇంకా నిర్మాణ దశలో ఉండగానే కొత్త చిత్రాన్ని శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఎన్‌బీకే 112 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహించనున్నారు. హై ఓల్టేజ్ యాక్షన్‌ను సామాజిక అంశాలతో మేళవించే కొరటాల శివ ఇప్పుడు బాలకృష్ణ కోసం ఓ పవర్‌ఫుల్ స్టోరీ సిద్ధం చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'అధికారానికి ఉద్దేశం తోడైతే అది ఓ ఉద్యమంగా మారుతుంది' అనే ట్యాగ్ లైన్ ఈ సినిమా ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో సూచిస్తుంది. బాలకృష్ణకు కథ వినిపించి ఓకే చేసుకున్న కొరటాల శివ ఇప్పుడు స్క్రిప్ట్ కూడా లాక్ చేశారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుంది. ఈ చిత్రానికి నిర్మాత, నటీనటుల వివరాలను త్వరలో వెల్లడిస్తారు. 'దేవర' చిత్రం తర్వాత కొరటాల శివ మళ్లీ రూపొందించే ఈ సినిమా వివరాల కోసం బాలకృష్ణ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శ్రామిక శక్తికి స్వర నీరాజనం



తిరువీర్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'భగవంతుడు'. పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఫరియా అబ్దుల్లా కథానాయిక. జి.జి విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం నుంచి 'శరణమన్న శరణం' అనే ప్రత్యేక గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రామికులకు గౌరవ సూచకంగా ఈ పాట శ్రామిక శక్తిని, సంస్కృతిని ప్రతిబింబించేలా సాగుతుంది. నాగలి పట్టే రైతు నుంచి చక్రం తిప్పే కుమ్మరివరకూ ప్రతి పనిముట్టు వెనుక ఉన్న కష్టాన్ని ఈ గీతంలో హృద్యంగా ఆవిష్కరించారు. హాయ్ కేపీ స్ఫూర్తిదాయకమైన బాణీలు అందించగా, గాయని కుమార వాగ్దేవి తన గాత్రంతో ఈ పాటకు ప్రాణం పోశారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయడంతో పాటు రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. రవి పనస నిర్మిస్తున్న ఈచిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్ తోట

'ఫస్ట్ టైమ్' ఘనవిజయం సాధించాలి



పాయల్ రాజ్‌పుత్

సౌరభ్ ధింగ్ర, అఖిల్ సార్థక్, అనిక్క విక్రమన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫస్ట్ టైమ్'. హేమంత్ ఇప్పలపల్లి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ట్రైలర్ అద్భుతంగా ఉంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. టీమ్ అందరికీ అభినందనలు' అని అన్నారు. 'మన దేశం గొప్పతనాన్ని ఈ చిత్రంలో చూపించాము. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను' అని హేమంత్ ఇప్పలపల్లి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సింగీతం

మ్యూజికల్ ఫాంటసీ

లెజండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు 94 ఏళ్ల వయసులో కూడా ఎంతో ఉత్సాహంగా పని చేస్తూ సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. సంగీతం, మ్యాజికల్ రియలిజం మేళవించి ఆయన భారతదేశపు తొలి మ్యూజికల్ ఫాంటసీని రూపొందిస్తున్నారు. ఆ చిత్రానికి 'సింగ్ గీతం' అని పేరు పెట్టారు. దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 11న విడుదల కానుంది. ఒక రహస్యమైన గ్రామం నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో ప్రతాప్ అనే యువకుడి చుట్టూ కథ తిరుగుతుంది. యూనిక్ కాన్సెప్ట్, ఫాంటసీ కథనంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో అయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ముఖ్య పాత్రలు పోషించారు. దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు.

తుంబాడ్ 2లో ప్రత్యేక పాత్ర?



ప్రేక్షకులను అమితంగా భయపెట్టిన 'తుంబాడ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న రెండో భాగం (తుంబాడ్ 2) పై భారీ అంచనాలున్నాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ 'తుంబాడ్ 2' చిత్రంలో నటించనున్నారనే ప్రచారం బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్దిఖీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ ఫోక్ హారర్ సీక్వెల్‌లో అలియా ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించనున్నారని సమాచారం. పాత్ర నిడివి తక్కువే అయినా కథాగమనంలో కీలకమైన పాత్ర కావడంతో చిత్ర బృందం అలియాను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోంది. త్వరలో అలియా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారని చెబుతున్నారు. ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వంలో సోహమ్ షా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాల కోసం చాన్సలర్ మధుమూర్తి ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 4,400 సీట్లను భర్తీ చేయనున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు నాలుగు మార్కుల వెయిటేజీతో మెరిట్ జాబితాను తయారు చేయనున్నారు. మే 30వ తేదీ వరకు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్, ఏపీ ఆన్‌లైన్ మీసేవల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పింఛన్ అందుకున్న ఐదు నిమిషాల్లోనే కిడ్నీరోగి మృతి

▸▸ శ్రీకాకుళం జిల్లాలో ఘటన

రణస్థలం, మే 1 (ఆంధ్రజ్యోతి): పింఛను అందుకున్న కొద్దిసేపటికే ఓ కిడ్నీ రోగి హఠాన్మరణం చెందాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం జేఆర్ పురం పంచాయతీ పరిధిలోని పిన్నింటిపేటలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిన్నింటి అచ్చంనాయుడు (67) కిడ్నీ రోగి. కొంతకాలంగా ఆయనకు ఎన్టీఆర్ భరోసా కింద.. ప్రతినెలా రూ.10 వేలు అందుతోంది. శుక్రవారం 1వ తేదీ కావడంతో ఉదయం 6.30 గంటల సమయంలో సచివాలయ సిబ్బంది ఆయన ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు. అచ్చంనాయుడు వేలిముద్ర కూడా వేశారు. పింఛన్ తీసుకున్న ఐదు నిమిషాల్లోనే అచ్చంనాయుడు మృతిచెందారు. కుటుంబీకులు విషాదంలో మునిగిపోయారు.

తిరుమల కిటకిట

▸▸ రెండు నడక మార్గాల్లో భక్తుల రద్దీ

▸▸ సర్వదర్శనానికి 14గంటల సమయం

తిరుమల, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండ ఒక్కసారిగా కిటకిటలాడింది. వేసవి సెలవులు, పదోతరగతి పరీక్షా ఫలితాల విడుదల నేపథ్యంలో తల్లిదండ్రులు, పిల్లలు అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో కాలినడకన తిరుమలకు చేరుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి అలిపిరి మార్గంలో 23,500 మంది, శ్రీవారిమెట్టు మార్గంలో 5,500 మంది భక్తులు తిరుమలకు చేరుకున్నారు. అలాగే దాదాపు 9 వేల వాహనాలు తిరుమలకు చేరుకున్నాయి. ఇక, శనివారానికి 13 వేల ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం), 2 వేల డీడీ(దివ్యదర్శనం) టోకెన్లను శుక్రవారం ఉదయం తిరుపతిలో కేటాయించారు. దీంతో శుక్రవారం సాయంత్రానికి తిరుమల కొండపై రద్దీ ఏర్పడింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయి...క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి గృహం సర్కిల్ మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ ఆలయం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర వ్యాపించింది. వీరికి దాదాపు 14 గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు కూడా మూడు గంటల సమయం పడుతోంది.

15 తర్వాత ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు

వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని నేరుగా తిరుమలకు వచ్చే భక్తులందరికీ త్వరితగతిన దర్శనం కల్పించేలా టీటీడీ ప్రత్యేక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తిరుపతిలో రోజూ జారీ చేసే ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని ఈ నెల 15వ తేదీ తర్వాత రద్దు చేయాలనే ఆలోచనలో ఉంది. అలాగే ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల సిఫార్సు లేఖలపై జారీ చేసే వీఐపీ బ్రేక్ దర్శనాలను శుక్రవారం నుంచి నిలిపివేసింది. మరో వారంరోజుల పాటు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను స్వీకరించి ఆ తర్వాత వారి లేఖలను కూడా తీసుకోకూడదని టీటీడీ భావిస్తోంది. దీంతో అదనంగా లభించే సమయాన్ని సామాన్య భక్తుల దర్శనానికి వినియోగించాలని యోచిస్తోంది.



అలిపిరి వద్ద నడకమార్గంలో భక్తుల రద్దీ

ట్రెండింగ్‌లో సర్కారు బడి!

(మొదటి పేజీ తరువాయి)

కనిపించకుండా ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ఫొటోలు కూడా వేయకుండా కేవలం విద్యార్థులతో మాత్రమే ప్రకటన ఇవ్వడంపై సానుకూలత వ్యక్తమౌతోంది. విద్యార్థుల్లోనూ ఈ ట్రెండ్ ఫుల్ జోష్ నింపింది. తమ పిల్లలను ప్రభుత్వం ప్రమోట్ చేయడం పట్ల తల్లిదండ్రులూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



కార్పొరేట్‌తో పోటాపోటీ

పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు... కార్పొరేట్ విద్యార్థులతో పోటాపోటీగా మార్కులు సాధించారు. స్టేట్ టాపర్‌కు 599 మార్కులు రాగా, ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు 596 మార్కులు సాధించారు. కార్పొరేట్ కంటే కేవలం మూడు మార్కులే వ్యత్యాసం. ప్రభుత్వ బడుల్లో 570, 580 మార్కులు వస్తేనే గొప్ప అనే స్థాయిని దాటి దాదాపుగా స్టేట్ టాప్ మార్కుల వరకూ చేరుకున్నారు. పేద విద్యార్థుల ప్రతిభ చూస్తుంటే భవిష్యత్తులో వీరే స్టేట్ టాపర్ అయినా ఆశ్చర్యం లేదన్న స్థాయిలో రాణిస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల్లోనూ ప్రభుత్వ స్కూళ్లు వందల సంఖ్యలో ఉండటం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా 604 ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

అంతటా సానుకూల స్పందన

అధికారికంగా ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడంపై అంతటా సానుకూల స్పందన వస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థుల ఫొటోలతో ప్రకటనలు ఇవ్వడం తొలుత ఆశ్చర్యానికి గురిచేసినా...ఇది ఒక మంచి పరిణామం అనే ప్రశంసలు వస్తున్నాయి. ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగేందుకు ఊతమిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వీరే టాపర్లు

దుల్ల చిన్నారి- 596 మార్కులు, సిరిగినీడి రిషిత లక్ష్మీ నిహారిక- 596, బవిరెడ్డి దివ్య తేజశ్రీ- 596, తనకంటి సాయిశ్రీ- 596, ఎస్. దిషిత సాయి- 595, నంద్యాల కార్తీక- 595, పత్రి హర్షిణి- 595, ఆర్‌డి వైష్ణవి- 595, కోల లక్ష్మీ వెంకటేశ్వర్- 595, గాలిదేవర హర్షిణి సత్య దుర్గ- 595, కొర్రకూటి యశ్విత- 595, వేగిరాజు కావ్య హాసిని- 595, మహమ్మద్ ఏ ఫర్హీన్- 595, పల్లా వెంకట సాయి అపర్ణ- 594, సీరపు దేవిప్రియ- 594, గొర్లె సాద్వికి- 594, ఉమ్మడిశెట్టి పవన్‌సాయి- 594, దాడి భాను క్రాంతి- 594, ఈలిశెట్టి ఉమాపార్వతి- 594, గణితాల సాయి పూజిత- 594, సైపిరెడ్డి స్వాతి- 594, చెరుకూరి కరీన- 594.

'మీ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించండి'

ప్రభుత్వ పాఠశాలలకు ఊతమిచ్చేలా తాజా ప్రకటనలో ప్రభుత్వం తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. 'మీ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాల'ని కోరింది. పాఠశాల స్థాయిల్లో పిల్లల్ని ప్రభుత్వ బడులకు పంపండి అంటూ గత కొంతకాలంగా ప్రభుత్వ టీచర్లు ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రభుత్వమే స్వయంగా అధికారికంగా ప్రకటన రూపంలో ఇలా పిలుపునివ్వడం ఇదే తొలిసారి. కాగా గత రెండేళ్లుగా పాఠశాల విద్యాశాఖ అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ఇలా ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదం చేసింది. పరీక్షల ప్రారంభానికి వంద రోజుల ముందు నుంచి ఈ ప్రణాళిక అమలుచేశారు. ప్రతిరోజూ విద్యార్థులకు స్లిప్ టెస్టులు, పరీక్షలకు ముందు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో చదివే వారిని, వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధించడం మంచి ఫలితాలను ఇస్తోంది.

ఎన్టీఆర్ స్కూల్ విద్యార్థినికి సీఎం అభినందనలు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 600కు 597 మార్కులు సాధించిన కృష్ణా జిల్లా చల్లపల్లి ఎన్టీఆర్ హైస్కూల్ విద్యార్థిని దుత్త నిత్యశ్రీకి సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఎన్టీఆర్ హైస్కూల్ పదో తరగతి ఫలితాల్లో 98% ఉత్తీర్ణత సాధించడానికి కారణమైన ఉపాధ్యాయులు, సిబ్బందికి, ఎన్టీఆర్ స్కూల్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి సీఎం అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ సంస్కరణలతో అద్భుత ఫలితాలు: పవన్

పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఉత్తీర్ణత 4 శాతానికిపైగా పెరగడం.. కూటమి ప్రభుత్వం విద్యా శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలకు నిదర్శనమని కొనియాడారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని అన్నారు. ఈ అద్భుత విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

పవన్‌కు లోకేశ్ ధన్యవాదాలు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల అభినందనలు తెలిపిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంత్రి లోకేశ్ ఎక్స్ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. 'పవన్ అన్నా... ఇది మన ఉమ్మడి విజయం. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా శాఖ, ప్రభుత్వ ఉమ్మడి కృషి ఉంది. మీ అందరి ప్రోత్సాహంతో రాష్ట్ర విద్యారంగాన్ని నేను దేశంలో రోల్ మోడల్‌గా నిలుపుతాను' అని లోకేశ్ పేర్కొన్నారు.

సత్తా చాటిన సర్కారు బడి

▸▸ విశాఖ జిల్లా నడుపూరులో విజయోత్సవ ర్యాలీ

పెదగంట్యాడ (విశాఖపట్నం), మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్రహ్మరథం పడుతున్నారు. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించడంతో గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ పాఠశాలలో ఇమంది దేవిక 592 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలవగా.. ఇంకా పి.పల్లవి 588 మార్కులు, లోకేశ్ 587 మార్కులు సాధించారు. నడుపూరు పాఠశాల నుంచి 354 మంది పరీక్షలకు హాజరుకాగా, 269 మంది (76 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 65 మంది 500కుపైగా మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గురువారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కారులో ఊరేగించారు.

చదువుల తల్లికి అండగా..

▸▸ ప్రభుత్వ పాఠశాలలో చదివి టెన్త్‌లో 594 మార్కులు సాధించిన విద్యార్థినికి విజయనగరం కలెక్టర్ భరోసా

▸▸ స్వయంగా ఇంటికి వెళ్లి అభినందనలు

▸▸ ఇంటర్, నీట్ ప్రిపరేషన్‌కు సహకరిస్తానని హామీ

విజయనగరం మే 1(ఆంధ్రజ్యోతి): చదువుల తల్లికి విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందరరెడ్డి అభయం ఇచ్చారు. భవిష్యత్‌కు భరోసా కల్పించారు. దీంతో తన లక్ష్యం నెరవేరుతుందన్న ఆశ సదరు విద్యార్థినిలో చిగురించింది. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం పెదరెడ్డి గ్రామానికి చెందిన ఎలిశెట్టి ఉమాపార్వతి తండ్రిని కోల్పోయింది. తల్లి కుమారి కూలి పనిచేస్తూ ఉమాపార్వతిని గంగుబుడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివించింది. అమ్మ ఆశయాలకు అనుగుణంగా కూతురు పదోతరగతిలో 594 మార్కులు సాధించింది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ రాంసుందరరెడ్డి శుక్రవారం విద్యార్థిని ఇంటికి వెళ్లి మాట్లాడారు. ఉమాపార్వతిని ఆశీర్వదించి.. భవిష్యత్‌లో ఏం చదవాలనుకుంటున్నావని అడిగారు. డాక్టర్ చదవాలని ఉంది సార్.. అని ఉమాపార్వతి చెప్పటంతో... కలెక్టర్ స్పందించి తాను చదివిస్తానంటూ భరోసా ఇచ్చారు. నీట్‌కు ప్రిపేర్ అయ్యేందుకు, ఇంటర్ వరకు ఏ కళాశాలలో చదివినా.. ఫ్రీ ఎడ్యుకేషన్, వసతి కోసం తాను బాధ్యత తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎక్కడ చదవాలన్నది నిర్ణయించుకుని తనను కలవాలని కలెక్టర్ చెప్పారు.



ఉమాపార్వతిని అభినందిస్తున్న కలెక్టర్ రాంసుందరరెడ్డి




ప్రసంగిస్తున్న కే రామకృష్ణ, పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు

మరో పోరాటానికి కార్మికవర్గం సమాయత్తం కావాలి

▸▸ మేడే వేడుకల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మే 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదాన్ని మరింత ముందుకు తేవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. గుంటూరు సంగడిగుంటలోని రేగుల రాఘవయ్య భవన్ వద్ద 140వ మేడే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు రావుల అంజిబాబు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ... 'ఏ పోరాటం ద్వారా హక్కులు సాధించారో ఆ హక్కులను నిలబెట్టుకోవడానికి మరో పోరాటానికి కార్మికవర్గం సమాయత్తం కావాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి వారి పొట్టకొడుతుంది. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వారి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నం చేస్తోంది. దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచి పెడుతుంది. ప్రజలను మత ప్రాతిపదికపై చీల్చి తద్వారా తమ రాజకీయ అధికారాన్ని సురక్షితం చేసుకోవాలని చూస్తుంది' అని రామకృష్ణ మండిపడ్డారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... 'కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గాన్ని యజమానులకు, కార్పొరేట్ సంస్థలకు ఆధునిక కట్టుబానిసలుగా తయారు చేస్తున్నాయి. దీనిని ప్రతిఘటించడం కోసం రానున్న రోజుల్లో మరింత పోరాడాల్సిన అవసరముంది' అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రామకృష్ణకు మాతృవియోగం



గౌరమ్మ

ఆలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ తల్లి కె.గౌరమ్మ (100) మృతిచెందారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లికి చెందిన ఆమె గురువారం అనారోగ్యానికి గురికావడంతో ఆదోనిలో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. చిన్న పేర్వలయ్య, గౌరమ్మ దంపతులకు రామకృష్ణతో పాటు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. తల్లి సలహాలతో రామకృష్ణ విద్యార్థి నాయకుడిగా, అనంతపురం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా ఎదిగారు. గౌరమ్మ మృతికి పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

మున్సిపల్ షాపుల అద్దె వ్యవస్థలో మార్పులు


▸▸ మూడేళ్లకు 33.33 శాతం బదులు.. ఏటా 7 శాతం పెంపు

▸▸ పై అంతస్థుల్లోని షాపులకు అద్దె తగ్గింపు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ షాపుల అద్దె వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. అద్దెలు ఒక్కసారిగా భారీగా పెరగడం వల్ల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ విధానాన్ని ప్రభుత్వం సవరించింది. ఇకపై మూడేళ్లకోసారి 33.33 శాతం పెంపునకు బదులుగా ప్రతి సంవత్సరం 7 శాతం చొప్పున అద్దె పెంచే విధానాన్ని అమల్లోకి తీసుకొస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2011లో అమల్లోకి తెచ్చిన విధానం ప్రకారం మూడేళ్లకోసారి భారీగా అద్దె పెరగడం వల్ల చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కోర్టు కేసులు పెరగడంతోపాటు అద్దె చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయి. రాష్ట్రంలోని 18 పట్టణ స్థానిక సంస్థల్లో 584 కేసులు నమోదయ్యాయి. సుమారు రూ.9.43 కోట్లు బకాయిలుగా నిలిచిపోయాయి. కొత్త విధానం ద్వారా వ్యాపారులకు భారం లేకుండా ఉంటుందని, అద్దె చెల్లింపులు సక్రమంగా జరుగుతాయని, మున్సిపాలిటీలకు స్థిరమైన ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. కాగా, ఖాళీగా ఉంటున్న పై అంతస్తుల షాపులను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌కు సాధారణ అద్దె, ఫస్ట్ ఫ్లోర్‌కు 20 శాతం తక్కువ, పై అంతస్తులకు 30 శాతం తక్కువతో అద్దె నిర్ణయించారు. కొత్తగా లేదా మళ్లీ లీజుకు ఇస్తే అద్దె నిర్ణయం మూడు అంశాల ప్రాతిపదిక ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ విలువలో 10 శాతం, పరిసర ప్రాంతాల్లో ఉన్న అద్దె, లేదా గత అద్దెపై 7 శాతం పెంపు.. ఈ మూడు అంశాల్లో ఎక్కువగా ఉన్న దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. లీజ్ నిబంధనల ప్రకారం.. మూడేళ్ల వరకు మున్సిపాలిటీలు, 3 నుంచి 25 ఏళ్ల లీజుకు ప్రభుత్వ అనుమతి అవసరం. ప్రస్తుతమున్న లీజ్ ఒప్పందాలు పూర్తయిన తర్వాతే కొత్త 7 శాతం పెంపు అమల్లోకి వస్తుంది.

పుంగనూరు రేంజర్ సస్పెన్షన్

▸▸ హైకోర్టులో అనుచిత ప్రవర్తనే కారణం



శ్రీరాములు

మదనపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుంగనూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్వో) జి.శ్రీరాములు సస్పెండయ్యారు. హైకోర్టులో న్యాయమూర్తి ఎదుట అనుచితంగా ప్రవర్తించినందుకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు పీవీ చలపతిరావు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 3న హైకోర్టులో విచారణ సందర్భంగా ఎఫ్ఆర్వో శ్రీరాములు ప్రవర్తన చర్చనీయాంశమైంది. సర్వీస్‌లో ఉండి కూడా న్యాయమూర్తికి సరైన పద్ధతిలో సెల్యూట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నది ఆయనపై వచ్చిన ప్రధాన ఆరోపణ. న్యాయమూర్తి ఎదుట ఎఫ్ఆర్వో ప్రవర్తించిన తీరు అటవీ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని, డీఎఫ్‌వో తన నివేదికలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, కోర్టును తప్పుదోవ పట్టించేలా ప్రవర్తించినందుకు ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్-1991 ప్రకారం ఆయనపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని అనంతపురం సర్కిల్ కన్జర్వేటర్‌కు డీఎఫ్‌వో సిఫార్సు చేశారు.

రిబేట్‌తో పెరిగిన ఆస్తి పన్ను వసూళ్లు

▸▸ పంచాయతీలకు ఒకే రోజు రూ.10 కోట్లు చెల్లించిన సంస్థలు

▸▸ సత్ఫలితాలిచ్చిన ఎర్లీ బర్డ్ ఆఫర్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించిన రిబేట్ సత్ఫలితాలనిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను మే నెలలోపు చెల్లిస్తే 5శాతం రిబేట్ ఇస్తామంటూ పంచాయతీరాజ్ శాఖ ఎర్లీ బర్డ్ ఆఫర్ ప్రకటించింది. దీంతో పన్ను చెల్లించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. మే 1న ఒక్కరోజే సుమారు రూ.10 కోట్ల మేర ఆస్తి పన్ను చెల్లించారు. తిరుపతిలో లెమన్ ట్రీ హోటల్, అమరావతిలో విట్ కళాశాల యాజమాన్యంతోపాటు పలు సంస్థలు ముందుగానే పన్నులు చెల్లించేందుకు ముందుకొస్తున్నాయి. శుక్రవారం ఒక్కరోజే ఆన్‌లైన్‌లో సుమారు రూ.3 కోట్లకుపైగా చెల్లింపులు చేయగా, మరో రూ.7 కోట్లకు సంబంధించి ఆస్తిపన్ను చెల్లింపులు డీడీ రూపంలో శాఖ కమిషనర్ కృష్ణతేజకు అందించారు. రిబేట్ తో పన్నులు ముందుగానే వసూలు అవుతుండటం శుభపరిణామమని అధికారులు పేర్కొంటున్నారు.

రేపు రామాలయ శంకుస్థాపన

▸▸ కులమతాలకు అతీతంగా అందరినీ ఆహ్వానిస్తున్నాం

▸▸ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ల/ఆకివీడు, మే 1(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేట రామాలయ పునర్నిర్మాణానికి ఈ నెల మూడో తేదీ ఉదయం 7.14 గంటలకు శంకుస్థాపన ముహూర్తం ఖరారైందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇప్పటికే ఆలయ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయి. దీనికి క్లియరెన్స్ ఇచ్చిన కలెక్టరేట్, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు. అనుమతి లేకుండా కడుతున్నారంటూ జడ శ్రవణ్‌కుమార్ పిటిషన్ వేశారు. శ్రీరాముడు లాయర్ రూపంలో శ్రవణ్‌కుమార్‌ను ఎదుర్కొని శంకుస్థాపనకు అడ్డు లేకుండా చేశారు. శంకుస్థాపనకు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాం. మాకు దళితులతో, క్రైస్తవులతో ఎటువంటి ఇబ్బందీ లేదు. అన్యమతాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంది. కాబట్టి దళితులు, క్రైస్తవులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. మతం మారిన వారికి కేసులు పెట్టే అర్హత లేదని రాష్ట్రం మొత్తం తెలిసింది. ఓటు రాజకీయాలు కరెక్టు కాదు. గరగపర్రు రోజులు పోయి.. ఆకివీడు రోజులు వచ్చాయని తెలుసుకోవాలి. మా గుడిని మీరు గౌరవించండి.. మీ చర్చిని మేం గౌరవిస్తాం' అని వివరించారు.

నిర్మాణ పనులకు ఏర్పాట్లు

ఆకివీడు పెదపేట రామాలయం నిర్మాణ పనులకు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. భీమవరం, విజయవాడ నుంచి కమిటీ నాయకులు, ఇంజనీర్లు వచ్చి నిర్మాణానికి అవసరమైన కొలతలు వేశారు. కళావాస్తు, ఆగమ శాస్త్ర ప్రకారం ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గణితం కట్టి ఎలా నిర్మిస్తే అనువుగా ఉంటుందో తెలియచేయనున్నారు. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు నేతృత్వంలో శనివారం నుంచి 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

మొక్కలతో పెళ్లి పిలుపు!

ఆహ్వాన పత్రిక స్థానంలో ప్రకృతి ప్రేమికుడి వినూత్న యత్నం



బంధువులకు మొక్కను అందించి వివాహానికి ఆహ్వానిస్తున్న ఉపేంద్రరెడ్డి

అవుకు, మే 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అవుకు మండలంలోని మెట్టుపల్లె గ్రామానికి చెందిన మేకల ఉపేంద్రరెడ్డి తన వివాహ వేడుకకు బంధువులకు వినూత్న రీతిలో ఆహ్వానం పలకాలని భావించారు. ఈ నెల 3న వివాహం జరుగనున్న నేపథ్యంలో వివాహ పత్రికకు బదులుగా నాన్-వోవెన్ బ్యాగులపై వివాహ కార్యక్రమం వివరాలను ముద్రించి అందులో 15 రకాల మొక్కలను పెట్టి ఆహ్వానం పలికారు. మిత్రులతో కలసి 450 మొక్కలను బంధువులకు అందించి వివాహానికి రావాలని ఆహ్వానించారు. పర్యావరణాన్ని పెంపొందించే ఆలోచనలో భాగంగా మొక్కలను అందించి వివాహానికి ఆహ్వానిస్తున్నట్లు ఉపేంద్రరెడ్డి తెలిపారు. మొక్కలను అందుకున్న బంధువులు వాటిని నాటి వివాహానికి రావాలని కోరినట్లు చెప్పారు.




వేసవిలో మల్బరీ పండ్లు విరివిగా లభిస్తుంటాయి. నలుపు, ఎరుపు రంగుల్లో కనిపిస్తూ కొంచెం పులుపు, కొంచెం తీపి కలగలిసిన రుచితో ఉంటాయి. ఎన్నో పోషకాలతో నిండిన మల్బరీ పండ్లతో సులువుగా తయారుచేసుకోదగ్గ విభిన్న రుచులు మీ కోసం...

వంటిల్లు

మల్బరీ పండ్లతో మజాగా...





మల్బరీ కుచెన్

కావాల్సిన పదార్థాలు

మల్బరీ పండ్లు- ఒక కప్పు, చక్కెర- ఒకటిన్నర కప్పులు, పాలు- అర కప్పు, కోడిగుడ్లు- రెండు, వెన్న- ముప్పావు కప్పు, మైదా- రెండు కప్పులు, బేకింగ్ పౌడర్- రెండు చెంచాలు, ఉప్పు- పావు చెంచా

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో ఒక కప్పు చక్కెర, పాలు, గుడ్లు, రెండు చెంచాల వెన్న, ఒకటిన్నర కప్పుల మైదా, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసి గరిటెతో ఉండలు లేకుండా మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బేకింగ్ బౌల్‌లో వేసి సమంగా పరచాలి. పైన మల్బరీ పండ్లు వేయాలి.
- మరో గిన్నెలో అర కప్పు వెన్న, అర కప్పు చక్కెర, అర కప్పు మైదా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బేకింగ్ బౌల్‌లోని మల్బరీ పండ్లపై పరచాలి.
- ఈ బేకింగ్ బౌల్‌ని ఓవెన్‌లో ఉంచి 190 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద నలభై నిమిషాలపాటు బేక్ చేయాలి. తరువాత బయటికి తీసి చల్లార్చి ముక్కలు కోసి పైన మల్బరీ పండ్లు అలంకరించి సర్వ్ చేయడమే.

మల్బరీ కుల్ఫీ



కావాల్సిన పదార్థాలు

మల్బరీ పండ్లు- రెండు కప్పులు, కండెన్స్‌డ్ మిల్క్- ఒక డబ్బా, ఫ్రెష్ క్రీమ్- రెండు కప్పులు, నిమ్మరసం- చెంచా, యాలకుల పొడి- చెంచా, పిస్తా పలుకులు- కొన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో మల్బరీ పండ్లు వేసి పది నిమిషాలపాటు మెత్తగా ఉడికించాలి. తరువాత స్టయినర్ సహాయంతో మరో గిన్నెలోకి రసాన్ని వడబోసి నిమ్మరసం కలపాలి. ఈ గిన్నెను మరల స్టవ్‌మీద ఉంచి అయిదు నిమిషాలు మిశ్రమాన్ని ఉడకనిచ్చి దించాలి.
- వెడల్పాటి గిన్నెలో క్రీమ్ వేసి బాగా బీట్ చేయాలి. తరువాత కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి బీట్ చేయాలి. తరువాత మల్బరీ మిశ్రమం, పిస్తా పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుల్ఫీ అచ్చుల్లో లేదా పెద్ద బౌల్‌లో పోసి ఎనిమిది గంటలపాటు డీప్ ఫ్రిజ్‌లో ఉంచాలి. తరువాత బయటికి తీసి గాజు బౌల్స్‌లో సర్వ్ చేయడమే.

మల్బరీ మొజిటో

కావాల్సిన పదార్థాలు

మల్బరీ పండ్లు- అర కప్పు, పుదీనా ఆకులు- ఆరు, ఐస్ క్యూబ్స్- నాలుగు, లెమన్ స్లయిసెస్- రెండు, సోడా వాటర్- ఒక గ్లాసు

తయారీ విధానం

పొడవాటి గాజు గ్లాసులో మల్బరీ పండ్లు, పుదీనా ఆకులు వేసి చెంచాతో క్రష్ చేయాలి. తరువాత ఐస్ క్యూబ్స్, లెమన్ స్లయిసెస్ వేయాలి. ఆపైన సోడా వాటర్ పోయాలి. అంతే రుచికరమైన మల్బరీ మొజిటో డ్రింక్ రెడీ.

క్రీమీ మల్బరీ డిలైట్



కావాల్సిన పదార్థాలు

మల్బరీ పండ్లు- రెండు కప్పులు, ఫ్రెష్ క్రీమ్- ఒక కప్పు, కండెన్స్‌డ్ మిల్క్- అర కప్పు, చక్కెర- రెండు చెంచాలు, నిమ్మరసం- చెంచా, బాదం పలుకులు- కొన్ని, పిస్తా పలుకులు- కొన్ని

తయారీ విధానం

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో మల్బరీ పండ్లు, చక్కెర వేసి చిన్న మంట మీద అయిదు నిమిషాలపాటు మెత్తగా ఉడికించాలి. తరువాత నిమ్మరసం కలిపి పూర్తిగా చల్లారనివ్వాలి. వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో ఫ్రెష్ క్రీమ్ వేసి నురుగులా వచ్చేవరకూ బీట్ చేయాలి. ఆపైన కండెన్స్‌డ్ మిల్క్ కలిపి మరోసారి బీట్ చేయాలి. అందులో ముందుగా సిద్ధం చేసుకున్న మల్బరీ పండ్ల మిశ్రమం వేసి కలపాలి. దీన్ని ఫ్రిజ్‌లో అరగంటసేపు ఉంచాలి. తరువాత గాజు గ్లాసుల్లోకి తీసి పైన బాదం పలుకులు, పిస్తా పలుకులు చల్లి చల్లగా సర్వ్ చేయాలి.

కళ్లు మండుతున్నాయా..?



ఎండ, పొడిగాలి, వాతావరణ కాలుష్యం, ఏసీ రూమ్‌లో ఎక్కువసేపు గడపడం లాంటి కారణాల వల్ల కళ్లలో తేమ తగ్గుతుంది. దీంతో కళ్లు పొడిబారి మండుతుంటాయి. అలాంటప్పుడు కళ్లకు ఉపశమనం కలిగించే చిట్కాలివే...

- వాడేసిన టీ బ్యాగ్‌లను కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచి ఆపైన కళ్లపై పెట్టుకుని అరగంటసేపు విశ్రాంతి తీసుకుంటే కళ్ల మంట తగ్గుతుంది. కంటి నరాల్లో ఒత్తిడి మాయమవుతుంది. ఎరుపుదనం తగ్గి కళ్లు ప్రకాశవంతంగా మారతాయి.
- బంగాళదుంప, కీరాలను చక్రాలుగా తరిగి కళ్లపై ఉంచుకుంటే కళ్లకు చల్లదనం చేకూరుతుంది.
- కలబంద గుజ్జును ఒకసారి చల్లటి నీళ్లతో కడిగి కళ్ల చుట్టూ ప్యాక్‌లా అప్లయ్ చేసుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. పావుగంటలో కళ్ల మంట, దురద తగ్గుతాయి.
- ఎండాకాలంలో రోజుకు రెండు లేదా మూడుసార్లు కళ్లను చల్లటి నీటితో కడగాలి. దీనివల్ల కళ్లకు రక్తప్రసరణ జరిగి మంట తగ్గుతుంది.

నిమ్మరసం రుచిగా



ఎండాకాలంలో తరచూ ఇంట్లో నిమ్మరసం తయారుచేసుకుని తాగుతూ ఉంటాం. కానీ హోటళ్లు, జ్యూస్ సెంటర్లలో లభించేదానిలా రుచిగా అనిపించదు. దీనికి మనం చేసే చిన్న పొరపాట్లే కారణం. అలాకాకుండా నిమ్మరసాన్ని సులువుగా రుచికరంగా సువాసనభరితంగా ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందాం...

- నిమ్మరసం చేసేటప్పుడు మనం ఒక పెద్ద గ్లాసు నిండా చల్లటి నీటిని తీసుకుని అందులో చక్కెర వేసి నిమ్మకాయ పిండేస్తూ ఉంటాం. ఇది సరైన విధానం కాదు. చల్లటి నీటిలో చక్కెర కరగడానికి చాల సమయం పడుతుంది. ఈ లోపు నీటి చల్లదనం తగ్గిపోయి, చక్కెర అణువులు నీటిలో సరిగా కలవక నిమ్మరసం రుచిని కోల్పోతుంది.
- ముందుగా చక్కెరను కొద్దిగా వేడి నీటిలో వేసి కలిపి సిరప్‌ను తయారుచేసుకోవాలి. దీన్ని బాగా చల్లారనివ్వాలి. పెద్దగ్లాసు మంచి నీటిలో నిమ్మరసం పిండి ఆపైన షుగర్ సిరప్ వేసి కలపాలి. దీనివల్ల పానీయం నోటికి స్మూత్‌గా తగులుతుంది. మరోపక్క తియ్యగా కూడా అనిపిస్తుంది.
- నిమ్మకాయ అసలైన సువాసన దాని పైన ఉండే పసుపు రంగు తొక్కలో ఉంటుంది. నిమ్మకాయను కోసేముందు గ్రేటర్ సహాయంతో తొక్కను పైపైన కొద్దిగా తురిమి పెట్టుకోవాలి. దీన్ని నిమ్మరసంలో కలపాలి. ఈ తురుం వల్లనే నిమ్మరసానికి మంచి రుచి వస్తుంది.
- నిమ్మరసంలో మామూలు ఉప్పు వేయకూడదు. నల్ల ఉప్పు, వేయించిన జీలకర్ర పొడి వేసి కలిపితే పులుపు సరిగా బ్యాలెన్స్ అయి మంచి షర్బత్ తయారవుతుంది. ఇందులోనే రెండు పుదీనా ఆకులను అరచేతిలో నలిపి వేస్తే మంచి సువాసన తోడవుతుంది.

మేలో వర్షాలు


- సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు
- ఏపీలోని ఉత్తర, మధ్య కోస్తాల్లో సాధారణం లేదా తక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు: ఐఎండీ

విశాఖపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): మే నెలలో దేశంలోని చాలా ప్రాంతాల్లో దీర్ఘకాలిక సగటు (61.4 మిల్లీమీటర్ల) కంటే ఎక్కువగా 110 శాతం వర్షపాతం నమోదు కానుందని ఐఎండీ శుక్రవారం బులెటిన్‌లో అంచనా వేసింది. తూర్పు, ఈశాన్య, మధ్య భారతంలో కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయి. అయితే ఏపీలోని రాయలసీమ, దక్షిణ కోస్తా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఉత్తర యూపీ, ఉత్తరాఖండ్, గుజరాత్, ఈశాన్య భారతంలోని పలు ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతోపాటు సగటు కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏపీలో ఉత్తర, మధ్య కోస్తాలో ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంత కంటే తక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని ఎక్కువ ప్రాంతాల్లో ఎక్కువగా నమోదవుతాయని అంచనా. మేలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణం కంటే 6-7 రోజులు ఎక్కువగా వడగాడ్పుల రోజులు ఉంటాయి. ఏలూరు, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 3-4, కాకినాడ, తూర్పుగోదావరి, రాయలసీమ జిల్లాల్లో సాధారణం కంటే 1-2 రోజులు ఎక్కువ వడగాడ్పులు వీస్తాయి. కాగా, ఎల్‌నినో పరిస్థితులు నెలకొనే దిశగా మార్పులు వస్తున్నాయని, కేరళకు రుతుపవనాలు వారం రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని ఐఐటీఎం డైరెక్టర్ ఎ.సూర్యచంద్రరావు వెల్లడించారు. విశాఖలోని ఏయూలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఉత్తరాంధ్రలో అకాల వానలు

- పిడుగురాళ్లలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



విశాఖలో శుక్రవారం కురుస్తున్న వర్షం

రాష్ట్రంలో ఓ వైపు ఎండ తీవ్రత, మరోవైపు సముద్రం నుంచి వీస్తున్న తేమగాలులతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. శుక్రవారం ఉత్తరాంధ్రలో అనేక చోట్ల, కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. శుక్రవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు విశాఖ జిల్లా ఆనందపురంలో 51.5, విజయనగరం జిల్లా కొత్తవలసలో 44.5వర్షపాతం నమోదైంది. కోస్తా, సీమల్లోని మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రవ్యాప్తంగా 252 మండలాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రత నమోదయింది. రానున్న 24 గంటల్లో కోస్తా, సీమల్లోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని, వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, మన్యం జిల్లాలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మామిడి పంట కు నష్టం వాటిల్లింది. విజయనగరం జిల్లాలో మెరుపులు, పిడుగులతో వాన పడింది. శ్రీకాకుళం జిల్లాలోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. గాలుల ధాటికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. మరోవైపు కడప జిల్లా పులివెందుల, లింగాల మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులకు 478 ఎకరాల్లో అరటి నేలమట్టమైంది. దీంతో దాదాపు రూ.11కోట్లమేర నష్టపోయిన రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

కాగ్నిజెంట్ పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 99 పైసలు చొప్పున 22.19 ఎకరాలను కేటాయించింది. మధురవాడలోని సర్వే నంబర్లు 394/1, 394/2పి, 395/1పి, 395/2పి, 396/పి, 397/పిలలో ఈ భూములు ఉన్నాయి. ఐటీ పార్కు ప్రాంతంలో వీఎంఆర్‌డీఏ గేటెడ్ కమ్యూనిటీ హరిత పక్కనే ఈ భూములు ఇచ్చారు. గత ఏడాది డిసెంబరు 12న సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, ఏడాదిలో తొలి దశ నిర్మాణం పూర్తి కావాలని, ప్రతి వారం తాను నిర్మాణ పనులు సమీక్షిస్తానని ప్రకటించారు. ఇక్కడ ఎనిమిది వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కాగ్నిజెంట్ తొలుత ఒప్పందం చేయగా, 25 వేల మందికి ఇవ్వాలని చంద్రబాబు కోరారు. దానికి కాగ్నిజెంట్ అంగీకరించింది. శంకుస్థాపన జరిగిన నాలుగు నెలల తరువాత ప్రహరీ గోడ నిర్మాణానికి తాజాగా పనులు ప్రారంభించారు. అయితే తాత్కాలికంగా రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబరు 2పై గల 'మహతి' భవంతిలో కొంత స్థలం అద్దెకు తీసుకొని అక్కడ ఇటీవలే ఆపరేషన్లు ప్రారంభించారు. కాగ్నిజెంట్‌కు కేటాయించిన భూమిలో 89,799.74 చ.మీ. లేఅవుట్ రూపొందించారు. అందులో 21,309.44 చ.మీ.ప్లింత్ ఏరియాలో భవనాలు నిర్మిస్తారు. మల్టీ లెవెల్ కారు పార్కింగ్ కోసం ఐదు ఫ్లోర్లు కేటాయించారు.



కేటాయించిన స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం

పదోన్నతులపై నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పారదర్శకం చేసింది. ఈ -డీపీసీ వల్ల ఏప్రిల్, ఆగస్టులో పదోన్నతులు రావాల్సిన వారికి ముందుగానే నవంబరు, డిసెంబరులో వచ్చాయి. కానీ, అన్ని స్థాయిలలో, అన్ని శాఖల్లో ఇది జరగడం లేదు. సచివాలయంలోని ఆర్థిక శాఖ, దాని పరిధిలోని హెచ్‌వోడీలు, అసెంబ్లీలో రెండేళ్ల నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వంలో పదోన్నతులు పెండింగ్‌లేని శాఖ ఒక్కటి కూడా లేదని ఉద్యోగులు వాపోతున్నారు.



వెంటపడుతున్న జీఏడీ

డీపీసీలు ఎలా నిర్వహించాలి, ఎప్పుడు పూర్తి చేయాలి అనే విషయంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. అయినప్పటికీ పదోన్నతుల్లో నెలకొన్న అంతులేని నిర్లక్ష్యం కొనసాగింది. ఈ వ్యవహారంపై 2025, జూలై 31న అప్పటి సీఎస్ విజయానంద్ డీపీసీల నిర్వహణ, పదోన్నతుల ఉత్తర్వులపై మార్గదర్శకాలను మరోసారి గుర్తుచేస్తూ వివరణాత్మక జీవో ఇచ్చారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, డీపీసీల నిర్వహణను సకాలంలో పూర్తి చేయడానికి ముందస్తు చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు.. పదోన్నతులకు సంబంధించిన ప్యానెల్ సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమై తదుపరి ఏడాది ఆగస్టు 31తో ముగుస్తుంది.

ఇదీ విధానం..

1) ఆగస్టు మొదటి వారంలో ఖాళీలు అంచనా వేయాలి. సీనియారిటీని సమీక్షించాలి.

2) రెండో వారంలో పదోన్నతుల కోసం పరిగణనలోకి తీసుకునే జోన్‌లో అధికారుల డేటాను సేకరించాలి.

3) చార్జ్ మెమోలు, సస్పెన్షన్ కేసులు, ఏసీబీ సహా క్రిమినల్ కేసులు, కోర్టు ఉత్తర్వులను సేకరించాలి.

4) మూడో వారంలో సమాచారం ఆధారంగా డీపీసీ నోట్ సిద్ధం చేయాలి.

5) సెప్టెంబరు 1 నుంచి అంచనాలను నిర్ధారించి తాత్కాలిక నోట్‌ను ఫైనల్ డీపీసీ నోట్‌గా మార్చి ప్రభుత్వానికి ఇవ్వాలి.

6) 2026, జనవరి 11న కూడా ఆ ప్యానెల్ ఏడాదికి సంబంధించిన డీపీసీల నిర్వహణకు కాలపరిమితిని నిర్దేశిస్తూ అప్పటి సీఎస్ విజయానంద్ మరో మెమో జారీ చేశారు.

మార్పు రాలేదు!

సెలక్షన్ విభాగంలోని ఒకటి, రెండు స్థాయి గెజిటెడ్ పోస్టులకు సంబంధించిన పదోన్నతుల ఉత్తర్వులను 2026, జనవరి 31లోగా జారీ చేయాలని ఆదేశించారు. 3.. అంతకంటే ఎక్కువస్థాయి పోస్టుల డీపీసీ ప్రతిపాదనలను 2026, జనవరి 21లోగా శాఖాధిపతులు సచివాలయ విభాగాలకు పంపాలన్నారు. జనవరి 31లోగా వీరికి పదోన్నతులు కల్పించాలని ఆదేశించారు. అలాగే, నాన్ సెలక్షన్ పోస్టుల విభాగంలో ప్రస్తుతం ఉన్న ఖాళీలకు జనవరి 31లోగా నియామక ఉత్తర్వులు జారీ చేయాలని మెమోలో అప్పటి సీఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. 2026 జనవరి 22న మరోసారి.. పదోన్నతులు జనవరి 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశిస్తూ జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ అన్ని శాఖాధిపతులకు, సెక్రటరీలకు యూవో నోట్ జారీ చేశారు. 2026, ఏప్రిల్ 10న ఒకసారి, 14న మరోసారి.. ఏప్రిల్ 15వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రతిపాదనలన్నీ ప్రభుత్వానికి పంపాలని, వాటిని సచివాలయ వర్గాలు ఏప్రిల్ 20 నాటికి పూర్తి చేసి పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత పదోన్నతులు నిలిపివేస్తామని రావత్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 28న ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ స్థానిక కేడర్ల వ్యవస్థీకరణ, ప్రత్యక్ష నియామకాల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు-2025 అమలు దృష్ట్యా ప్రభుత్వంలోని సెలక్షన్, నాన్ సెలక్షన్ పోస్టుల ప్రమోషన్లను త్వరలో నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో 3వ స్థాయి గెజిటెడ్, అంతకంటే పైస్థాయి పోస్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను మే 4వ తేదీలోపు సాధారణ పరిపాలనా శాఖకు పంపాలని అన్ని శాఖాధిపతులను ప్రభుత్వం కోరింది. మొదటి, రెండో స్థాయి గెజిటెడ్ పోస్టులకు సంబంధించి వాటి కార్యదర్శులు, శాఖాధిపతులు డీపీసీ సమావేశాలను మే 4 నాటికి నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయాలి. నాన్ సెలక్షన్ పోస్టులకు సంబంధించి మే 1 నాటికి అర్హులైన అభ్యర్థులను అందుబాటులో ఉన్న చోట మే 4 నాటికి భర్తీచేయాలని రావత్ ఆదేశించారు. జీఏడీతో సమావేశాలు జరిగిన ప్రతిసారీ మౌఖికంగా ఆదేశాలు జారీ చేస్తునే ఉన్నారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

సీఎం చంద్రబాబుకు.. బిజినెస్ సంస్కరణల్లో వచ్చిన అవార్డు ఉద్యోగుల సమష్టి కృషి వల్లే సాధ్యమైందని ఆయన చెప్పారు. అంతేకాదు, ఈ విజయం ఉద్యోగులకే అంకితమన్నారు. సీఎం పరిధిలో ఉండే సీఎస్, జీఏడీ విభాగాలు పదోన్నతులు త్వరితగతిన పూర్తి చేయాలని శాఖాధిపతులు, సెక్రటరీల వెంట పడుతున్నప్పటికీ ఉన్నతాధికారు మాత్రం ఆ ఆదేశాలు పట్టించుకోవడం లేదు. ఇప్పుడు.. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు ఈ పదోన్నతులకు అడ్డం పడుతోంది. దీంతో మరో ఐదారు నెలలు ఉద్యోగులకు పదోన్నతులు నిలిచిపోతాయని తెలిసింది. సీఎం, ఆయన పరిధిలోని శాఖలు సవ్యంగా పనిచేస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది. ఆ అసంతృప్తి ప్రభుత్వంపై కనిపిస్తోంది.

పెద్ద దస్తగిరి హత్యలో.. నిత్యానందరెడ్డిది కీలక పాత్ర!

- నిందితులకు ఆశ్రయమిచ్చారు.. పరారీకి డబ్బు ఏర్పాటు చేశారు: పీపీ
- పోలీసు దర్యాప్తునకు సహకరించాలని కడప మాజీ డిప్యూటీ మేయర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): కడప వైసీపీ నేత, రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద దస్తగిరి హత్యలో కడప మాజీ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి కీలకపాత్ర పోషించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. ఆయన పాత్రపై సాంకేతిక ఆధారాలు సేకరించామన్నారు. గూగుల్ టేకవుట్, కాల్ డేటాను పరిశీలిస్తే పెద్ద దస్తగిరిని హత్య చేసిన తర్వాత ప్రధాన నిందితులు నిత్యానందరెడ్డిని ఆశ్రయించినట్లు స్పష్టంగా ఉందని.. వారు పారిపోయేందుకు ఆయన డబ్బు ఏర్పాటు చేశారని తెలిపారు. కేసులో ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆయన్ను నిందితుడిగా చేర్చామన్నారు. నిత్యానందరెడ్డి, హతుడు పెద్ద దస్తగిరి ఇద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారని వివరించారు. వారి మధ్య వివాదాలు తలెత్తడంతోనే దస్తగిరి హత్యకు ప్రణాళిక రచించారన్నారు. నిత్యానందరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు. హత్య ఘటనకు సంబంధించి మొదట నమోదైన ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్ పేరు లేదని.. రాజకీయ కారణాలతో నిందితుడిగా చేర్చారని.. హత్యకు పాల్పడినవారికి ఆశ్రయం కల్పించారనేదే ఆయనపై ఉన్న ఆరోపణగా పేర్కొన్నారు. ఈ నేరారోపణ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నదే అయినందున బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం... పిటిషనర్‌పై హత్య కేసు నమోదైందని గుర్తుచేసింది. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని.. చార్జిషీటు దాఖలు చేయనందున కేసును క్వాష్ చేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని తెలిపింది. పిటిషనర్ చేసిన నేరం ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నదైతే సెక్షన్ 35(3)ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఏడేళ్లకు పైగా శిక్షకు వీలుంటే చట్టనిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని నిత్యానందరెడ్డికి తేల్చిచెప్పింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు 501 కోట్లు చెల్లింపు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ అనుబంధ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు చెల్లించాల్సిన బకాయిల్లో ప్రభుత్వం రూ.501 కోట్లు చెల్లించింది. పెండింగ్‌లో ఉన్న రూ.2200 కోట్లలో "ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్" విధానంలో రూ.1000 కోట్లు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్, ఆస్పత్రుల యాజమాన్యాల మధ్య కుదిరిన ఒప్పందాలను అనుసరించి గత సోమవారం నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి. మొత్తం 278 ఆస్పత్రుల యాజమాన్యాలకు రూ.501 కోట్ల వరకూ చెల్లించినట్లు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఇన్‌చార్జి సీఈవో చక్రధరబాబు తెలిపారు. బిల్ డిస్కౌంటింగ్ విధానంలో బకాయిలు పొందేందుకు 873కు గానూ 531 ఆస్పత్రుల యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. ఆస్పత్రుల యాజమాన్యాలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెల్లింపులు జరుగుతున్నాయని ట్రస్ట్ సీఈవో తెలిపారు. మిగిలిన బకాయిలు రెండో విడతలో విడుదల చేస్తామని వెల్లడించారు.


కృష్ణాజిల్లా వీరంకిలాకు గ్రామంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులతో సీఎం చంద్రబాబు

లబ్ధిదారు ఇంటికెళ్లి పెన్షన్ పంపిణీ


పమిడిముక్కల వీరంకిలాకులోని ఎన్టీఆర్ కాలనీలో.. తలసేమియా బారినపడిన 13 ఏళ్ల వయసున్న చాగంటిపాటి వివేక్ ఇంటికి సీఎం వెళ్లి రూ.10 వేల పింఛను అందజేశారు. అతడి ఆరోగ్య పరిస్థితులను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.


ప్రజావేదిక కార్యక్రమానికి వచ్చిన సీఎం చంద్రబాబుకు చిరు కానుక అందిస్తున్న వృద్ధురాలు



స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు!



(మొదటి పేజీ తరువాయి)

పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చంద్రబాబు కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఈ అడ్డాలు ఇచ్చే ఫలితాలను పరిశీలించి రాష్ట్రమంతటా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో 88 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. వారంతా చిన్న, పెద్ద పరిశ్రమలు, షాపుల్లో పనిచేస్తున్నారన్నారు. కార్మిక సంక్షేమానికి ఏటా రూ.615 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఒకప్పుడు శారీరకంగా కష్టపడేవారని, ఇప్పుడు తెలివితేటలతో పనిచేయాలని సూచించారు. కార్మికుడి కొడుకు కంపెనీ ప్రారంభించే స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచ స్థాయి ఆధునిక పనిముట్లు తీసుకొచ్చి త్వరలో అందజేస్తామన్నారు. కార్మికుల్లో నైపుణ్యం పెంచితే అదనంగా ఆదాయం వస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 25 వేల మందికి శిక్షణ ఇస్తున్నామని.. రాబోయే రోజుల్లో మరింత మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక సంక్షేమ పథకాలకు జీవం పోశామన్నారు. 'నిర్మాణ రంగంలోని కార్మికుడు పెళ్లి చేసుకున్నా.. కార్మికుడి కుమార్తెకు వివాహం చేసినా రూ.25 వేలు ఇస్తున్నాం. ఎవరైనా కార్మికుడు చనిపోతే రూ.60 వేలు, అంత్యక్రియలకు తక్షణమే రూ.20 వేలు ఇస్తున్నాం. కార్మికుల కోసం అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీలో ఈఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తాం. అమరావతిలోనూ ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మిస్తాం' అని హామీ ఇచ్చారు. వైసీపీ అధ్యక్షుడిపై ఆయన మండిపడ్డారు. 'జగన్‌కు ఒక మానసిక సమస్య ఉంది. అది అందరినీ మోసం చేయడం.. నాశనం చేయడం. వైసీపీ పార్టీ కాదు.. అది గొడ్డలి పార్టీ' అని ధ్వజమెత్తారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

నేను టీమ్ లీడర్‌ను మాత్రమే

నేను టీమ్ లీడర్‌ను మాత్రమే. టీమ్ సరిగా పని చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. కొద్దిరోజుల క్రితం నాకు బిజినెస్ రిఫార్మర్ అవార్డు వచ్చింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, పనులను దేశమంతా గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. వాస్తవానికి ఇది నాకు వచ్చిన అవార్డు కాదు.. రాష్ట్రానికి వచ్చింది. మంత్రులు, అధికార యంత్రాంగానికి ఈ గుర్తింపు వచ్చింది. చట్టాలను రూపొందించే సభలకు మహిళలతోనే శోభవస్తుంది. రాబోయే రోజుల్లో వారు చట్టసభల్లో 33శాతం ప్రాతినిధ్యం వహించేలా కేంద్రం చట్టంచేస్తుంది. కొంతమంది బిల్లును అడ్డుకున్నా, రాబోయే రోజుల్లో అడ్డుకోవడం అసాధ్యం.

ఆ పార్టీని ఏమనాలో తెలియడం లేదు

నేను అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేయడం, తర్వాత ఎన్నికల్లో ఎవరో గెలిచి విధ్వంసం చేయడం వంటి వైకుంఠపాళి ఆటలు వద్దు. వైకుంఠపాళి వద్దు-ఎన్‌డీఏనే ముద్దు. వైసీపీని ఏమనాలో తెలియడం లేదు. (జనంలో నుంచి ఒక వ్యక్తి నిలబడి కోడికత్తి పార్టీ అని పెద్దగా కేకలు వేశారు). కోడికత్తి పార్టీ, గొడ్డలి పార్టీ. నేర ప్రవృత్తి ఉండే వ్యక్తులు రాజకీయాలకు పనికి రారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ చేసిన నేరాన్ని నా నెత్తిన వేసి అధికారంలోకి వచ్చారు. 2019లో టీడీపీ ప్రభుత్వం వచ్చి ఉంటే ఇప్పటికే పోలవరం పూర్తయ్యేది. వైసీపీ రావడంతో నాశనమైంది. ఎన్ని ఇబ్బందులున్నా 2027లో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణానదికి అనుసంధానం చేస్తాం. 2028లో కృష్ణా పుష్కరాల నాటికి కృష్ణా జిల్లాకు శాశ్వతంగా నీటి ఎద్దడి లేకుండా చేస్తాం. బందరు పోర్టు కోసం 2014లో భూ సేకరణ చేస్తే, వైసీపీ వచ్చిన తర్వాత టెండర్లు రద్దుచేసి గందరగోళంలోకి నెట్టింది.

అమరావతి దశ-దిశ మారాయ్

29 వేలమంది రైతులు అమరావతికి 33 వేల ఎకరాల భూమిని ఒక్క రూపాయి తీసుకోకుండా ఇచ్చారు. వారి సహకారంతో అమరావతి దశ, దిశ మారిపోయాయి. నాపై నమ్మకంతో రెండో దశలో మరో 16 వేల ఎకరాల భూమి ఇవ్వడానికి కూడా అక్కడి రైతులు సిద్ధంగా ఉన్నారు. విశాఖపట్నంలో స్టీల్ సిటీకి అక్కడి రైతులు రెండు నెలల్లో 3 వేల ఎకరాలిచ్చారు. అక్కడ గూగుల్ రూ.1.40 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టి రాష్ట్రాన్ని టెక్నాలజీలో అంతర్జాతీయ స్థాయిలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చింది. దానిని చూసి రిలయన్స్ జియో ఏకంగా రూ.1.70 లక్షల కోట్లు పెట్టడానికి వచ్చింది.

2019లో మీరు ఓట్లు వేయలేదు

2019 ఎన్నికల్లో ప్రజలు పక్కచూపులు చూడడం వల్లే టీడీపీ అధికారం కోల్పోయింది. మీరంతా జగన్‌కు ఓట్లు వేయడంతో అధికారంలోకి వచ్చాడు. రాష్ట్రాన్ని అంధకారంలో పడేశాడు (ఓ మహిళ స్పందించి..ఆయనకు ఓట్లు వేయలేదని చెప్పింది. వేశారంటూ సీఎం కౌంటర్ ఇవ్వగా.. ఆమె మళ్లీ వేయలేదని స్పష్టం చేసింది. నువ్వు వేయకపోవచ్చు. మిగిలిన వాళ్లు వేశారు కదా అని ఆయన అన్నారు).

రూ.63,188 కోట్లు పంపిణీ

కూటమి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 62.47 లక్షల మందికి రూ.63,188 కోట్లు పింఛన్ల రూపంలో పంపిణీ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చేసరికి సాధారణ పింఛన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ రోగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైతే రూ.15 వేలు ఇస్తున్నాం. 263 అన్నక్యాంటీన్ల ద్వారా డ్రైవర్లు, కూలీలు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల కడుపు నింపుతున్నాం. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటే అన్నింటి కంటే పింఛన్ల పంపిణీ టాప్‌లో ఉంది. సర్వేలో 93% మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

ఐకేర్ సెంటర్లతో గ్రామీణులకు ఎంతో మేలు

- అత్యుత్తమ వైద్య సేవలు అందుతాయి: సీఎం
- గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం


శుక్రవారం గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి సత్యకుమార్, ఐ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ జీఎన్ రావు, దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త జాస్తి వెంకట్ తదితరులు

మచిలీపట్నం/గుడ్లవల్లేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న ఐ కేర్ సెంటర్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యాధునిక వసతులతో వీటి ఏర్పాటుతో గ్రామీణులకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతాయని తెలిపారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ జీఎన్ రావు, దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త జాస్తి వెంకట్ పాల్గొన్నారు. ఏడాదికి 50 వేల మంది అవుట్ పేషెంట్లకు వైద్యసేవలు, 5 వేల మందికి శస్త్ర చికిత్సలు చేసే సామర్థ్యంతో ఈ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు అభినందనీయమని ముఖ్యమంత్రి చెప్పారు. లాభాపేక్ష లేకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో ఎల్‌వీ ప్రసాద్ ఐకేర్ సెంటర్ల ద్వారా సేవలు అందించడం ఈ సంస్థ సేవాభావాన్ని తెలియజేస్తోందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు సహకరించిన సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ చైర్మన్ జాస్తి వెంకట్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

దద్దోజనం తిని కూర్చోవడం కాదు!

- పార్టీ క్యాడర్‌నూ పట్టించుకోండి
- ఎన్నికల్లో కష్టపడేది వారే.. వారిని విస్మరిస్తే ఎలా?
- పామర్రు సమావేశంలో ఎమ్మెల్యేలపై సీఎం అసంతృప్తి


ప్రజావేదిక కార్యక్రమంలో 35 మంది భవన నిర్మాణ కార్మికులకు పీ4 కింద రూ.5 లక్షల చెక్కును అందిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి/మచిలీపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కష్టపడి పని చేసేది పార్టీ క్యాడరే.. వారిని పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లు చేస్తానంటే ఉపేక్షించే ప్రశ్నే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం కపిలేశ్వరపురంలో ఆ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యకర్తలను, నాయకులను విస్మరిస్తే గత పాలకులకు పట్టిన గతే మనకూ పడుతుందన్నారు. ఒక దశలో.. దద్దోజనం తిని కూర్చోవడం కాదు.. పార్టీ క్యాడర్‌నూ కాస్త పట్టించుకోండంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. కేవలం ఎమ్మెల్యే కుటుంబమే బాగుంటే సరిపోదని, పార్టీ కోసం పని చేసిన వారి కుటుంబాలూ బాగుండాలని.. అప్పుడే పార్టీ బాగుంటుందన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని, పార్టీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది క్యాడరేనని, ఎన్నికల్లో ఓటర్లను బూత్‌ల దగ్గరకు తీసుకొచ్చేదీ వారేనని అలాంటి కార్యకర్తలను విస్మరించిన ఏ పార్టీ మనుగడ సాగించిన దాఖలాల్లేవని స్పష్టం చేశారు. ఇది ఒక్క పామర్రు ఎమ్మెల్యేను మాత్రమే దృష్టిలో పెట్టుకుని చెబుతున్న విషయం కాదని.. జిల్లాలోని ఎమ్మెల్యేలందరికీ వర్తిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో జరిగే పనులన్నీ వారి కుటుంబసభ్యుల పేరుతో చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఇటీవల అధిష్ఠానం దృష్టికి వెళ్లాయి. ఎమ్మెల్యేలు క్యాడర్‌ను పూర్తిగా విస్మరించారని, ఇదే పరిస్థితి కొనసాగితే స్థానిక ఎన్నికల్లో నెగ్గుకురాలేమని పలువురు పార్టీ నాయకులు టీడీపీ పెద్దలకు చెప్పారు. వాటిని దృష్టిలో పెట్టుకుని తాజాగా సీఎం ఎమ్మెల్యేల పనితీరును కార్యకర్తల సమక్షంలోనే ఎండగట్టారు. ఎమ్మెల్యే కుమార్‌రాజా పనితీరు 80 శాతం బాగుందని, మిగిలిన 20శాతం కూడా మెరుగుపరచుకోవాలని సూచించారు.

ముగ్గురికి బెస్ట్ మేనేజ్‌మెంట్, నలుగురికి శ్రమశక్తి అవార్డులు

పమిడిముక్కల సభలో ముఖ్యమంత్రి ముగ్గురికి బెస్ట్‌మేనేజ్‌మెంట్ అవార్డులు,నలుగురికి శ్రమశక్తి అవార్డులు అందజేశారు.


మేడే పురస్కారం అందిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ అనురాధ

బెస్ట్ మేనేజ్‌మెంట్: కె.సుమంత్ (కృష్ణా జిల్లా, పెదఅవుటపల్లి),వి.వెంకట్ (కురుమద్దాలి) కె.అప్పారావు(ఒంగోలు)

శ్రమశక్తి: పి.పోతురాజు (ఎన్టీఆర్ జిల్లా, జయంతిపురం) కె.రామకృష్ణ (బాపట్ల జిల్లా, చీరాల), పిల్లా జ్యోతి (కృష్ణాజిల్లా, బొమ్ములూరు), ఎం.రవికుమార్ (కర్నూలు జిల్లా, ఒంటిపర్ల)


బసవతారకం ఆస్పత్రి పనులు ప్రారంభిస్తున్న బాలకృష్ణ

'బసవతారకం' ఆస్పత్రి పనులు ప్రారంభం

తుళ్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ భవన నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఎక్స్‌కవేటర్‌ను నడిపి, మట్టిని తవ్వి టిప్పర్‌లోకి ఎత్తిపోశారు. తన మాతృమూర్తి స్వర్గీయ నందమూరి బసవతారకం పేరుతో నిర్మాణమవుతున్న ఈ ఆస్పత్రిని రెండు దశల్లో నిర్మిస్తామని తెలిపారు. తొలిదశలో భాగంగా రూ.700 కోట్ల వ్యయంతో 500 పడకలను రోగులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. మొత్తం 21 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి తొలిదశను 2028 నాటికి పూర్తిచేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆస్పత్రి ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో భారీ కార్యక్రమం నిర్వహించబోతున్నామని బాలకృష్ణ తెలిపారు.

అమరావతిపై జగన్ అబద్ధాలు: షరీఫ్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణంపై జగన్ అండ్ కో అబద్ధాలు ప్రచారం చేయడం దుర్మార్గమని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తెలంగాణలో అధునాతన సెక్రటేరియట్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.6500 ఖర్చు చేశారు. అమరావతిలో చదరపు అడుగుకు సగటున రూ.6980 ఖర్చవుతుంది. అయితే జగన్ అండ్ కో రూ.12 వేల నుంచి రూ.14 వేలు ఖర్చవుతుందంటూ నోటికొచ్చిన లెక్కలు చెబుతున్నారు. ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చుచేసి రాజభవనాలు నిర్మించుకున్న జగన్... అమరావతి నిర్మాణ వ్యయంపై అబద్ధాలు ఆడటం హాస్యాస్పదం' అని షరీఫ్ మండిపడ్డారు.

చంద్రబాబు పాలిట జగన్ విలనే..: సజ్జల

అమరావతి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలిట వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విలన్‌గానే కనిపిస్తారని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు చేస్తున్న అవినీతిని అనునిత్యం ప్రశ్నిస్తున్న జగన్ గొడ్డలిలానో.. కత్తిలానో.. సైకోలానో కనిపించడం సహజమేనన్నారు. శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. అమరావతిలో చంద్రబాబు నిర్మిస్తున్న ప్యాలెస్‌ను రాజధాని నగర నిర్మాణ కాంట్రాక్టర్లే కడుతున్నారని.. ఆ ఇంటిని బినామీలే కడుతున్నందున.. ఆ ఇంటి ఛాయలకు ఎవరినీ రానివ్వడం లేదని సజ్జల ఆరోపించారు. తిరుమల లడ్డూ అంశంపై ఏమీ లేదని రిటైర్డ్ ఐఏఎస్ దినేశ్‌కుమార్ ఇచ్చిన నివేదికతో తేలిపోయిందన్నారు. దేవదేవుడిని అడ్డం పెట్టుకుని తిరుమలలో చంద్రబాబు దోపిడీకి తెరతీశారని ఆరోపించారు. అమరావతిలో బహిరంగంగానే బరితెగించి అవినీతికి పాల్పడుతున్నారని.. సెక్రటేరియేట్ సహా ఇతర భవనాల అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చుపెడుతున్నారని చెప్పారు. జగన్ 'మావిగన్' ప్రకటనకు ప్రజల ప్రతిస్పందన చూసి చంద్రబాబు భయపడుతున్నారని.. అందుకే మూకుమ్మడిగా సామాజిక మాధ్యమాల్లోనూ, ఇతర వేదికలపైనా తిట్టారని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి నిబద్ధత కలిగిన సీనియర్ జర్నలిస్టు అని.. ఆయనపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టిందన్నారు.

లోక్‌భవన్‌లో అంతా తానై..

పరిధి దాటిన గవర్నర్ మాజీ ఏడీసీ

- సిబ్బంది పట్ల దురుసు ప్రవర్తన
- సెక్రటరీలనూ శాసించే స్థాయికి
- గవర్నర్‌తో కలవనివ్వని వైనం
- రామాంజనేయులుపై బదిలీ వేటు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు ఎక్కడెలా వ్యవహరించాలో గుర్తెరిగి ఉండాలి. మరీ ముఖ్యంగా గవర్నర్ వంటి రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారి వద్ద విధులు నిర్వహించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. కానీ గవర్నర్ వద్ద ఏడీసీ (ఎయిడ్-డి-క్యాంప్)గా విధులు నిర్వహించిన ఎన్.వి.రామాంజనేయులు తన పరిధి దాటి ప్రవర్తించారు. గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ బాధ్యతలు చేపట్టిన కొత్తలో రామాంజనేయులు కూడా గవర్నర్ ఏడీసీగా బాధ్యతలు తీసుకున్నారు. మొదటినుంచి ఆయనపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ స్థాయిలో ఉన్న ఆయన లోక్‌భవన్‌లో అంతా తానై వ్యవహరించారు. లోక్‌భవన్‌లో విధులు నిర్వహించేవారిపై గవర్నర్‌కు సర్వాధికారులు ఉంటాయి. ఆయన తర్వాత లోక్‌భవన్‌లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి అధికారాలు ఉంటాయి. కానీ లోక్‌భవన్‌లో ఏడీసీనే సర్వాధికారాలు చెలాయించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కూడా గవర్నర్‌ను కలవాలంటే ఏడీసీ అనుమతిచ్చేవారు కారు. 'గవర్నర్ రెస్ట్‌లో ఉన్నారు.. ఇప్పుడు కలవడం కుదరదు' అని చెప్పేవారు. అంతేగాక లోక్‌భవన్‌లో సిబ్బంది అంతా తన కంట్రోల్‌లో ఉండాలని అనధికారిక హుకుం జారీ చేశారు. సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారు. తన అనుమతి లేకుండా లోక్‌భవన్‌లో ఏమీ జరగకూడదని నిబంధనలు పెట్టారు. చివరికి సెక్రటరీ, జాయింట్ సెక్రటరీని కూడా శాసించే విధంగా ప్రవర్తించారు. గవర్నర్ కుటుంబ సభ్యుల పట్ల కూడా అమర్యాదగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆయనపై బదిలీ వేటు పడింది. స్వయంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏడీసీని పంపించేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఆయనను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులిచ్చింది.

నియామకమే విరుద్ధం

లోక్‌భవన్‌లో గవర్నర్ ఏడీసీగా రామాంజనేయులు నియామకమే సక్రమంగా జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయనను నియమించారు. సాధారణంగా ఏడీసీ నియామకానికి మొదట ప్రభుత్వం డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులను ఎంపిక చేసి, ముగ్గురు పేర్లను గవర్నర్‌కు పంపిస్తుంది. గవర్నర్, లోక్‌భవన్ సెక్రటరీ ముగ్గురితో ప్రత్యేకంగా మాట్లాడుతారు. సర్వీస్ మొత్తం క్షుణ్నంగా పరిశీలించిన అనంతరం గవర్నర్ ఎంపిక చేసిన ఒక అధికారి పేరును ప్రభుత్వానికి పంపిస్తారు. ఆ అధికారినే ఏడీసీగా ప్రభుత్వం నియమిస్తుంది. రామాంజనేయులు విషయంలో ఈ ప్రక్రియ జరగలేదు. అప్పటి ప్రభుత్వం జీవో ఇవ్వడం, ఆయన విధుల్లో చేరిపోవడం జరిగిపోయాయి.

సర్వభ్రష్టం!



(మొదటి పేజీ తరువాయి)

కీలక వ్యవస్థల్లోని లోపాలు కూడా జతకలిసి కల్తీ నెయ్యి దందాకు దోహదం చేశాయని నిర్ధారించింది. కొనుగోలు విధానం ఏమీ బాగాలేదని, మొత్తంగానే ఆ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సూచించింది. మిగతా వ్యవస్థల్లోనూ భారీ సంస్కరణలు చేపట్టాలని కోరింది. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని సీబీఐ సిట్ అప్పటి టీటీడీ అధికారులపై చర్యలకు సిఫారసు చేసింది. దీనిపై పరిశీలనకు కూటమి ప్రభుత్వం రిటైర్డు సీఎస్ దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. కమిషన్ గురువారం 54పేజీల తన నివేదికను ప్రభుత్వానికి అందించింది.

ఇలా ముంచేశారు..

ప్రభుత్వంలోని అత్యంత సన్నిహిత వర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. దినేశ్‌కుమార్ కమిషన్.. నాటి టీటీడీ పాలన అంతా లోపాలపుట్ట అని తేల్చింది. కల్తీ నెయ్యికి దారితీసిన పరిస్థితులకు కమిషన్ ప్రధానంగా మూడు అంశాలను గుర్తించింది. గత వైసీపీ పాలనలో ఒక పద్ధతి ప్రకారం టీటీడీలోని కీలక వ్యవస్థలను దెబ్బతీశారు. ఇక.. నెయ్యి సరఫరాల నిబంధనలను సడలించడం ద్వారా కల్తీలకు భారీఎత్తున తెర తీశారు. అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, బాధ్యత మరిచి వ్యవహరించడంతో నాటి టీటీడీ బోర్డు ఇష్టారాజ్యం వ్యవహరించడానికి అవకాశం ఇచ్చింది. అప్పటికే నిర్వీర్యంగా మారిన వ్యవస్థలు ఈ కల్తీ నెయ్యి దందాను ఏ దశలోనూ అడ్డుకోలేకపోయాయి. ఈ వ్యవహారంలో అప్పటి ఈవో సింఘాల్ దగ్గర నుంచి డెయిరీల తనిఖీ బృందాలు, ప్రొక్యూర్‌మెంట్ అధికారులు, ఇతర సిబ్బంది అంతా దోషులే. ఇంకా.. నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తలెత్తిన వ్యవస్థాగత వైఫల్యాలే లడ్డూ ప్రసాద పవిత్రతను దెబ్బతీశాయి. ఆహార భద్రతా నియమాలను కూడా పూర్తిగా నాడు ఉల్లంఘించారు. అసలు టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విధానమే బాగోలేదు. అందులోని పలు వ్యవస్థాగత లోపాలు కల్తీ విధానం బలపడటానికి దోహదం చేశాయి. టీటీడీ పాలక మండలి 2019లో (టీడీపీ ప్రభుత్వం) నెయ్యి కొనుగోలుకు సంబంధించి గట్టి నిబంధనలు రూపొందించింది. డెయిరీల అర్హత, నాణ్యమైన నెయ్యి సరఫరాకు మంచి సరఫరాల వరకు సకల వ్యవస్థలను పటిష్ఠపరిచింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం (వైసీపీ) ఐదు నెలల్లోనే వాటిని సడలించింది. దీంతో గుర్తింపు లేని డెయిరీలు, సరఫరా కంపెనీలు సైతం నెయ్యి టెండర్లలో పాల్గొనడానికి వెసులుబాటు కలిగింది. టీటీడీలో నెయ్యి కొనుగోలు టెండర్ ప్రక్రియలో అవకతవకల కారణంగా కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని కమిషన్ తేల్చింది. ఇంకా.. నెయ్యి ధరల తగ్గింపులో నిలకడలేని తనంతో అధికారులు వ్యవహరించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో డెయిరీలతో జరిపిన చర్చలు టెండర్ నిబంధనలను ఉల్లంఘించడానికి ఆస్కారం కల్పించాయి. దీంతో అర్హత లేని కంపెనీలకు టెండర్లు దక్కాయి. లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి విషయంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వలేదు. కేవలం తక్కువ ధరకు సరఫరా చేసే కంపెనీలకు పెద్దపీట వేశారు. దీనివల్ల కల్తీని నేరుగా ప్రోత్సహించినట్టయింది. నెయ్యిలో కల్తీ జరిగిన విషయాన్ని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తన నివేదికలో ధ్రువీకరించింది. ఈ నివేదిక ఆధారంగా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదని కమిషన్ తన నివేదికలో తెలిపింది.

కీలక సిఫారసులు..

- టీటీడీ బోర్డుకు ప్రత్యేక ఆహ్వానితులను నామినేట్ చేసే నిబంధనను తొలగిస్తూ చట్టసవరణ చేయాలి.
- టీటీడీ బోర్డులో వృత్తి నిపుణులు, వివిధ రంగాల్లో నిపుణులైన వారిని నియమించాలి.
- టీటీడీ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఒక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలి.
- నెయ్యి, ఇతర పదార్థాల సేకరణ విభాగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలి. అక్కడ అర్హత కలిగిన నిపుణుడిని అధికారిగా నియమించాలి.
- టీటీడీలో ఫిర్యాదుల నిజ నిర్ధారణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- టీటీడీ వెబ్‌సైట్‌లో నాణ్యతా పరీక్షల నివేదికలు, సరఫరాదారుల వివరాలను ఉంచాలి.

సింఘాల్ అశ్రద్ధతోనే కల్తీకి ఊతం..

కీలకమైన సిటోస్టోరో పరీక్షలకు సంబంధించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలను అమలు చేయడంలో టీటీడీ అధికారులు విఫలమయ్యారు. నెయ్యి సరఫరాదారులు అడిగినవిధంగా నిబంధనలు మార్చుతూ పోయారు. 2022 జూలై 1నుంచి టీటీడీలో ఇదే పంథా కొనసాగింది. నాణ్యత పరీక్షలు చేయకుండానే 70లక్షల కిలోలకు పైగా నెయ్యిని సేకరించారు. టీటీడీలో నెయ్యి నిబంధనలను మెరుగుపరిచినప్పుడూ, వాటిని సడలించినప్పుడూ.. రెండు సందర్భాల్లోనూ టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ ఉన్నట్టు కమిషన్ తెలిపింది. ఆయన ఆమోదించిన తర్వాతే ఆ ప్రతిపాదనలు టీటీడీ బోర్డు ముందుకెళ్లి ఆమోదం పొందాయి. ఆయన అశ్రద్ధ వల్లే కల్తీ నెయ్యి వ్యవహారం చోటుచేసుకుంది. సింఘాల్‌తో పాటు టీటీడీ బోర్డు, కొనుగోలు కమిటీ, అదనపు ఈవో, ప్రొక్యూర్‌మెంట్ జీఎం సహా పలువురు సీనియర్ అధికారులదీ తప్పేనని కమిషన్ తేల్చింది.


కొడవలూరు మండలం ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంతంలో మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు

మహానాడుకు స్థలాల పరిశీలన

- కిసాన్ సెజ్, నెల్లూరులో పరిశీలించిన నేతలు
- అనువైన ప్రదేశంలో ఏర్పాటుపై సమీక్ష
- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం

నెల్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మహానాడును ఈ ఏడాది నెల్లూరు జిల్లాలో నిర్వహించాలని ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనువైన ప్రాంతం కోసం నేతలు పరిశీలన జరుపుతున్నారు. ప్రధానంగా రెండు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని శుక్రవారం పరిశీలించారు. కొడవలూరు మండలం ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణం, నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు జాతీయ రహదారి సమీపంలో స్థలాలను చూశారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేశ్, కావ్య కృష్ణారెడ్డి, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్ తదితరులు స్థలాలను పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి ట్రాఫిక్, పార్కింగ్‌కు కలిగే ఇబ్బందులు, రవాణా సదుపాయాలపై చర్చించారు. ఇందుకు సంబంధించి నివేదికలను టీడీపీ కేంద్ర కమిటీకి పంపారు. పార్టీ కేంద్ర బృందం శనివారం మరోసారి ఈ స్థలాలను పరిశీలించనుంది. అనంతరం సాయంత్రంలోపు మహానాడు ఎక్కడ నిర్వహించనున్నది అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

వైభవంగా మహానాడు: మంత్రి ఆనం

స్థలాల పరిశీలన సందర్భంగా మంత్రి ఆనం మీడియాతో మాట్లాడారు. 'జిల్లా చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయేలా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. మహానాడు నిర్వహణకు అనువైన ప్రదేశాలను కేంద్ర కమిటీకి నివేదించాం. ఈ బృందం మరోసారి పరిశీలించి వేదికను ఖరారు చేస్తుంది. తొలిసారిగా నెల్లూరు జిల్లాలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించడం జిల్లా నేతలు, కార్యకర్తల అదృష్టంగా భావిస్తున్నారు. లక్షలాది మందికి సరిపడేలా భారీ బహిరంగ వేదిక, వేలాది వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, మూడు రోజులపాటు కార్యకర్తలకు రుచికరమైన భోజనం, అతిథులకు తగిన నివాస ఏర్పాట్లు వంటి అన్ని అంశాల్లో ఎక్కడా లోటు లేకుండా సమగ్ర ప్రణాళికతో మహానాడు నిర్వహిస్తాం' అని ఆనం వివరించారు.

నీట్ పరీక్ష రేపే

» సీసీ కెమెరాల నిఘాలో మెడికల్ ఎంట్రెన్స్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య విద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ-2026) ఆదివారం జరగనుంది. రాష్ట్రంలో పరీక్ష నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు తెలిపారు. పెన్ అండ్ పేపర్ (ఓఎంఆర్ షీట్) పద్ధతిలో నీట్ పరీక్ష నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా 556 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర దేశాల్లో కూడా 14 చోట్ల నీట్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరంలో 229 పనిదినాలు

» సెలవులు 87... దసరాకు 10 రోజులు

» ప్రాథమికంగా నిర్ణయించిన పాఠశాల విద్యాశాఖ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల పనిదినాలు 229 రోజులు ఉండాలని పాఠశాల విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం 316 రోజుల్లో 229 పనిదినాలు, 87 సెలవులు ఉంటాయి. అక్టోబరు నెలలో అత్యధికంగా 15 రోజులు సెలవులు రానున్నాయి. దసరాకు అక్టోబరు 12 నుంచి 21 వరకు, సంక్రాంతికి జనవరి 11 నుంచి 17 వరకు సెలవులు ఇస్తారు. పదో తరగతి పరీక్షలు మార్చిలో ఉంటాయి. ఎఫ్ఏ-1 పరీక్షలు ఆగస్టులో, ఎఫ్ఏ-2 అక్టోబరులో జరుగుతాయి. ఎస్ఏ-1 పరీక్షలు నవంబరులో, ఎస్ఏ-2 పరీక్షలు 2027 ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్‌పైనే ప్రధానంగా చర్చించారు. అలాగే వచ్చే ఏడాది నుంచి అన్ని రకాల పరీక్షల మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిపారు.

సింగపూర్ పర్యటనకు ఉత్తమ టీచర్లు

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న 37 మంది టీచర్లు విద్యా విధానాలపై అధ్యయనానికి సింగపూర్ వెళ్తున్నారు. పాఠశాల విద్యాశాఖ టీచర్లను ఈ పర్యటనకు తీసుకెళ్తోంది. మే 4 నుంచి 8 వరకు ఈ పర్యటన ఉంటుంది. పర్యటన అనంతరం అక్కడి ఉత్తమ విధానాలను వారు పనిచేస్తున్న పాఠశాలల్లో అమలుకు ప్రయత్నిస్తారు.

'రద్దు' ఇక లాంఛనమే!

» పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ వివాదంపై ముగిసిన తుది విచారణ

» సర్టిఫికెట్ రద్దుకు సిఫారసు చేస్తాం: స్క్రూట్నీ కమిటీ చైర్మన్ వెల్లడి

బాపట్ల, మే 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దుకు సంబంధించి స్క్రూట్నీ కమిటీ తుది విచారణ శుక్రవారంతో ముగిసింది. పిటిషనర్ అక్కల రామిరెడ్డితోపాటు పాస్టర్ ఆనంద్ వాదనను కూడా విన్న కమిటీ తుది నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు సోమవారంలోగా పంపించనుంది. తుది విచారణ ముగిసిన తర్వాత డీఎల్ఎస్‌సీ (డిస్ట్రిక్ట్ లెవల్ స్క్రూట్నీ కమిటీ) చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బాపట్ల జాయింట్ కలెక్టర్ భావన మీడియాతో మాట్లాడారు. "ఇరు పక్షాల వాదనలు వినడంతో పాటు, అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలను కూడా పరిగణనలోకి తీసుకుని పాస్టర్ ఆనంద్ ఎస్సీ హోదా రద్దు కోరుతూ కలెక్టర్‌కు సోమవారం లోగా రికమండ్(సిఫారసు) చేస్తాం." అని తెలిపారు. ఈ ప్రక్రియ అంతా త్వరలోనే ముగుస్తుందని కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న డీఆర్వో వివరించారు. అంతకుముందు.. మధ్యాహ్నం 12 గంటలకు బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో డీఎల్ఎస్‌సీ సమావేశమైంది. ఏప్రిల్ 18న తొలి విచారణకు హాజరుకాని పాస్టర్ ఆనంద్ శుక్రవారం విచారణకు హాజరయ్యారు.

పన్ను ఆదాయంలో భారీ వృద్ధి

» ఏప్రిల్‌లో రాబడి రూ. 5,542 కోట్లు

» జీఎస్టీ అమల్లోకి వచ్చాక నెలవారీ వసూళ్లలో ఇదే అత్యధికం

» 2025 కంటే 12.08 శాతం పెరుగుదల

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో పన్ను వసూళ్లు గణనీయంగా పెరిగాయి. పన్ను విభాగాలు రూ. 5,542.7 కోట్ల ఆదాయాన్ని సాధించాయని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నమోదైన అత్యధిక నెలవారీ వసూలు ఇదే. 2025 ఏప్రిల్‌లో వచ్చిన ఆదాయం కంటే ఇది రూ. 598.78 కోట్లు ఎక్కువ. మొత్తంగా ఏప్రిల్‌లో వాణిజ్యపన్నుల వసూళ్లలో 12.08 శాతం వృద్ధి నమోదైంది. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ఏడాదికి రూ. 8,000 కోట్ల ఆదాయం పెరగవచ్చని అంచనా వేయగా, గత ఆర్థిక సంవత్సరం చివరి 6 నెలల్లోనే రూ. 4,500 కోట్లు వచ్చాయి. ఏఐ ఆధారిత డేటా విశ్లేషణలు, ఏఐ ఆధారిత పరిశీలన, ఏఐ ఆధారిత ఐజీఎస్టీ రివర్సల్స్, యూపీఐ ఆధారిత విశ్లేషణల అమలు, డిస్కమ్ ఆధారిత రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ, ఆధార్ అనుసంధానంతో వృత్తి పన్ను వసూళ్లు చేశారు. 2025 ఏప్రిల్‌లో నికర జీఎస్టీ రూ. 3,554.27 కోట్లు రాగా, 2026 ఏప్రిల్‌లో రూ. 3,796.91 కోట్లు వచ్చింది. 6.83 శాతం వృద్ధి నమోదైంది. 2026 ఏప్రిల్‌లో సెస్ మినహా స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 4,323.07 కోట్లు వసూలయ్యాయి. ఐజీఎస్టీ సెటిల్మెంట్ 12.97 శాతం వృద్ధితో రూ. 2,194.84 కోట్లు వసూలైంది. పెట్రో వ్యాట్ 26.72 శాతం వృద్ధితో రూ. 1,613.36 కోట్లు, వృత్తి పన్ను రూ. 42.9 కోట్లు వసూలైంది. మద్యం వ్యాట్ రూ. 77 కోట్ల నుంచి రూ. 83 కోట్లకు పెరిగింది. 7.97 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం 2025 ఏప్రిల్‌లో రూ. 4,946 కోట్లు ఉండగా, ఏప్రిల్ 2026 నాటికి 12.08 శాతం వృద్ధితో రూ. 5,543 కోట్లకు చేరుకుంది. పన్ను పరిధి పెంచడానికి, లీకేజీలు అరికట్టడానికి ప్రభుత్వం ఏఐ సాంకేతికతను వినియోగిస్తోంది. డేటాతోనే నిర్మాణ రంగంలో ఎగవేతలు గుర్తించారు.

భారీగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

» కీలకమైన డివిజన్లకు ఆర్డీవోలు.. జిల్లాలకు డీఆర్వోల నియామకం

» పలు శాఖల్లో డీసీ పోస్టుల భర్తీ : ఉత్తర్వులు జారీ

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో, వివిధ హోదాల్లో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఖాళీగా ఉన్న కీలకమైన డివిజన్లకు ఆర్డీవోలను, జిల్లాలకు డీఆర్వోలను నియమించింది. పలు శాఖల్లో డీసీ పోస్టులను భర్తీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో మార్చి మొదటి, రెండో వారాల్లో భారీగా ఆర్డీవోల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. కొత్త అధికారులను వెంటనే ఆయా పోస్టులకు పంపించాలని భావించినా ప్రజాప్రతినిధుల సిఫారసులతో వ్యవహారం రచ్చకెక్కింది. దీంతో సీఎం జోక్యం చేసుకొని బదిలీల ప్రక్రియను నిలిపివేశారు. రెవెన్యూ, సాధారణ పరిపాలన శాఖలు సంయుక్తంగా ఇచ్చిన పోస్టింగ్ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. నిఘా నివేదికలు తెప్పించుకుంది. అయినా అనేక అంశాలు తెరపైకి రావడంతో ఆ ప్రక్రియ కొలిక్కిరాలేదు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా జనగణన మొదలైంది. ఇంకా ఎనిమిది జిల్లాలకు డీఆర్వోలు, 28 డివిజన్లకు ఆర్డీవోలు లేరు. ఈ ప్రభావం జనగణనపై పడుతోందని, తక్షణమే డిప్యూటీ కలెక్టర్ పోస్టింగ్‌లు ఇవ్వాలని జిల్లాల కలెక్టర్లు కోరుతున్నారు. సింగపూర్ పర్యటన ముగించుకొని వచ్చిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ గతనెల రోజులుగా పెండింగ్‌లో ఉన్న బదిలీల జాబితాను కొలిక్కి తీసుకొచ్చారు. దాన్ని సీఎం చంద్రబాబు ఆమోదించడంతో మొత్తం 25మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు (జీవో 886) జారీ చేశారు.

డీఆర్వో బదిలీలు...

పి. రోహిణి (ఏలూరు జిల్లా), పి. కొండయ్య (శ్రీసత్యసాయి జిల్లా), వి. సుబ్బారావు (కోనసీమ జిల్లా), ఎం. రాజేశ్వరి (అల్లూరి జిల్లా)

ఆర్డీవో బదిలీలు...

జి.వి.వి. సత్యనారాయణ (కొత్తపేట), ఎ. సరళావతి (రామచంద్రాపురం), వెన్నెల శ్రీను (విజయవాడ), జి. అనిల్‌కుమార్ (నందిగామ), టి. అజయ్‌కుమార్ (కనిగిరి), చిన్న ఓబులేసు (పత్తికొండ), తుమ్మటి చంద్రశేఖర్ నాయుడు (ఒంగోలు). కె. స్వాతి (రంపచోడవరం). మిగిలినవారిని ఏపీసీఆర్‌డీఏ, పురపాలక శాఖ, విద్యాశాఖలోని సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టులకు బదిలీ చేశారు.

నలుగురు ఫుడ్ సేఫ్టీ ఉద్యోగులు సస్పెన్షన్

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బాధ్యతారాహితంగా వ్యవహరించిన నలుగురు ఫుడ్ సేఫ్టీ ఉద్యోగులను ఆరోగ్యశాఖ సస్పెండ్ చేసింది. మంత్రి సత్యకుమార్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా జరిగిన విచారణలో కొందరు ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారని నిర్ధారణ అయింది. మంగళగిరిలోని ఆహార భద్రత శాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేసే సూపరింటెండెంట్ డి. శిరీష, సీనియర్ అసిస్టెంట్స్ జి.అఖిల్, సంగీతరావు, జె.సుజాతపై ఫిర్యాదులు అందగా విచారణ అనంతరం వారిని సస్పెండ్ చేస్తూ ఆరోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండియన్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు.

దర్యాప్తు అధికారి చెప్పినట్టు

నడుచుకోండి

» పూడి శ్రీహరికి హైకోర్టు ఆదేశం

» బీఎన్ఎస్ఎస్ 35(3) ప్రకారం నోటీసులు ఇవ్వాలని గుంటూరు పోలీసులకు ఉత్తర్వులు

అమరావతి/గుంటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో హేయమైన పోస్టులు పెట్టారనే ఆరోపణలతో గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో దర్యాప్తు అధికారి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని వైసీపీ సోషల్ మీడియా జనరల్ సెక్రెటరీ పూడి శ్రీహరిని హైకోర్టు ఆదేశించింది. శ్రీహరిపై నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్ల లోపు శిక్షకు వీలున్నవేనని, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా కొత్తపేట పోలీసులు నమోదు చేసిన కేసులో శ్రీహరిని ఇప్పటికే అరెస్ట్ చేసి, మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. సీఎం చంద్రబాబు ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యవహారంలో గుంటూరు జిల్లా నల్లపాడు, కొత్తపేట పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ.. పూడి శ్రీహరి హైకోర్టులో 2 క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు శుక్రవారం విచారణకు రాగా.. శ్రీహరి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. "బీఎన్ఎస్ఎస్ 35(3) మేరకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను మేజిస్ట్రేట్ ఆదేశించారు. కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే గుంటూరు జిల్లా కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఒకే ఘటనపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం" అని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. పిటిషనర్ శ్రీహరి దర్యాప్తునకు సహకరించడం లేదని, నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు వెళ్లగా తాడేపల్లి, అనకాపల్లి చిరునామాల్లో పిటిషనర్ అందుబాటులో లేరని తెలిపారు. మరోవైపు పూడి శ్రీహరికి గుంటూరు కొత్తపేట పోలీసులు మేజిస్ట్రేట్ సూచనల మేరకు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఆయన్ను గుంటూరులోని నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. కాగా, హైకోర్టు ఇచ్చిన మౌఖిక ఆదేశాలను శ్రీహరి తరఫు న్యాయవాది అఫిడవిట్ రూపంలో కోర్టుకు సమర్పించారు. దీంతో కొత్తపేట, నల్లపాడు పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఆయా కేసుల్లో 41ఏ నోటీసులు ఇవ్వాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. దీంతో పూడి శ్రీహరికి కొత్తపేట పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు.

అనంతబాబు బెయిల్ రద్దుపై తీర్పు వాయిదా

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దుపై తీర్పును తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టు వాయిదా వేసింది. దళిత డ్రైవరు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభాలకు గురి చేసిన ఆరోపణలపై కాకినాడలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో వాదనలు ముగియడంతో తీర్పును మే 1కి కోర్టు వాయిదా వేసింది. అయితే మే 6న నిర్ణయం చెబుతామని న్యాయాధికారి శుక్రవారం పేర్కొన్నారు.

నేను ఎమ్మెల్సీని.. తెలుసా?

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీనని, తనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని జైలు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. తన హోదా గురించి తెలియదా అంటూ అధికారులను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక సదుపాయాలు కావాలంటే కోర్టుకు వెళ్లాలని, న్యాయస్థానం నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తామని అధికారులు చెప్పినా... అనంతబాబు తన ప్రవర్తన మార్చుకోవడం లేదని సమాచారం. డ్రైవర్ హత్య కేసులో అనంతబాబు 2022లో కొన్నినెలలు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఆ సమయంలో వైసీపీ అధికారంలో ఉండడంతో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో జైల్లో రాచమర్యాదలు జరిగాయి. ప్రభుత్వం మారినా జైల్లో చాలా మంది అప్పట్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది ఉన్నారు. పాత పరిచయాలతో తనకు ప్రత్యేక సదుపాయాల కోసం అనంతబాబు రుబాబు చేస్తున్నారు.

కస్టడీపై 4న కోర్టు ఆదేశాలు: సాక్షులను బెదిరించిన కేసులో అనంతబాబును కస్టడీకి ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం కాకినాడ కోర్టులో వాదనలు జరిగాయి. దీనిపై సోమవారం ఆదేశాలు ఇవ్వనున్నట్లు న్యాయాధికారి పేర్కొన్నారు. సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో అనంతబాబు సహా మరో ముగ్గురిపై కేసు నమోదు కాగా.. ఏ2, ఏ3 ఇంకా పరారీలోనే ఉన్నారు. వీరిద్దరూ వైసీపీకి చెందిన ఓ మాజీ మంత్రి అనుచరులు. ఈ కేసులో తాజాగా ఏ5గా చెక్కపల్లి శ్రీనివాసకుమార్ అనే నిందితుడిని చేర్చారు.

సాక్షులు, డ్రైవర్ కుటుంబానికి రక్షణగా..

డ్రైవర్ హత్యకేసులో తనకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పవద్దని, కాదంటే చంపేస్తానని నలుగురు సాక్షులను ఏ1 అనంతబాబు ఇటీవల బెదిరించారు. అనంతబాబు, ఆయన అనుచరుల నుంచి ముప్పు పొంచి ఉండడంతో సాక్షులకు భద్రత కల్పించేందుకు వారి ఇళ్ల వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద కదలికలపై దృష్టి పెట్టారు. హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి కూడా ప్రాణాపాయం ఉండడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పెదపూడిలో ఉంటున్న సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఇంటివద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

నిధులకు ఇబ్బంది లేదు!



(మొదటి పేజీ తరువాయి)

అడ్వాన్సుగా ఇచ్చిన రూ.2,800 కోట్లలో 75 శాతం ఖర్చుపెడితే.. మరో 3,300 కోట్లు విడుదల చేస్తామన్నారు. శుక్రవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో ఆయన పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), వాప్కోస్, సెంట్రల్ వాటర్-పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్), కేంద్ర జల సంఘం, కేంద్రపర్యావరణం-అటవీశాఖ, కేంద్ర భూసేకరణ, సహాయ పునరావాస శాఖ, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జలవనరుల బాధ్యతలు కూడా చూస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కమిషనర్ ప్రశాంతి, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, పీపీఏ సీఈ రమేశ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. దాదాపు గంటన్నర జరిగిన సమావేశంలో.. ప్రాజెక్టు మొదటి దశ పనుల పురోగతి, భూసేకరణ, పునరావాసం, రెండో దశలో భూసేకరణ పరిహారం, సహాయ పునరావాస కార్యక్రమాలపై చర్చించారు. నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని జలశక్తి అధికారులు సూచించినట్లు తెలిసింది. కీలకమైన డయాఫ్రం వాల్ పూర్తయిందని, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం పనుల్లో వేగం కనిపిస్తోందంటూ కాంతారావు సంతృప్తి వ్యక్తం చేసినా.. నిధులున్నా వ్యయం చేయకపోవడంపై పెదవివిరిచారు. నెలకు రూ.500 కోట్లయినా ఖర్చు చేయలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. నిధుల కోసం ఎప్పుడు అభ్యర్థన లేఖ ఇస్తారని సీఎస్‌ను ప్రశ్నించారు. ఈ ఏడాది సెప్టెంబరునాటికి గతంలో ఇచ్చిన అడ్వాన్సులో 75 శాతం వ్యయమవుతాయని.. ఆ వెంటనే నిధుల కోసం లేఖ రాస్తామని సాయిప్రసాద్ తెలిపారు. అప్పుడు ఇంకో రూ.3300కోట్లు అడ్వాన్సు మంజూరు చేస్తామని కాంతారావు చెప్పారు. ఈ 6100 కోట్లనూ ఖర్చు చేశాక అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని నిధులు కావాలన్నా మంజూరుకు కేంద్రం సిద్ధంగా ఉందని, 2027 జూన్ నాటికి తొలిదశ పూర్తిచేయాలన్నారు.

భూసేకరణ, పునరావాసంలో వెనుకంజ..

తొలిదశలో భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల్లో వెనుకబడ్డారని కాంతారావు అన్నారు. భూసేకరణ దాదాపు పూర్తయిందని, గిరిజన ప్రాంతాల్లో పునరావాస కాలనీల నిర్మాణం, నిర్వాసితుల తరలింపు కొంత నెమ్మదిగా సాగుతున్నాయని కమిషనర్ ప్రశాంతి చెప్పారు. 2027 జూన్ నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, సహాయ పునరావాస పనుల ప్రగతిని ఇకపై పీపీఏ, వాప్కోస్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలని కాంతారావు ఆదేశించారు. సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు నెలలో రెండు సార్లయినా ప్రాజెక్టును సందర్శించాలన్నారు. ముంపు సమస్యపై ఒడిసా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అభ్యంతరాల పరిష్కారానికి కేంద్రం చొరవ తీసుకుంటుందని.. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

జిలెటిన్ స్టిక్స్, డీజిల్ కొరత!

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా జిలెటిన్ స్టిక్స్ దిగుమతి నిలిచిపోయిందని సాయిప్రసాద్ తెలిపారు. డీజిల్ కొరత సమస్య ప్రాజెక్టుపై పడిందన్నారు. రోజూ బల్క్‌లో 50,000 లీటర్ల డీజిల్ అవసరం కాగా.. రెండు వారాలుగా ఏడెనిమిది వేల లీటర్లలోపే అందుతోందని చెప్పారు. మే నెలాఖరుకు ఎగువ నుంచి వరద వస్తుందని.. ఈలోపే గ్యాప్-1, గ్యాప్-2 వద్ద పనుల వేగాన్ని పెంచి.. ఈసీఆర్ఎఫ్ డ్యాం ఎత్తు కనీసం 30మీ. వరకు పూర్తిచేయాలని అనుకున్నామని ఈఎన్‌సీ నరసింహమూర్తి చెప్పారు. డీజిల్ కొరత కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. డీజిల్, జిలెటిన్ స్టిక్స్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు తక్షణం తమదృష్టికి తీసుకురాకపోతే, అవి పరిష్కారమెలా అవుతాయని కాంతారావు ప్రశ్నించారు. బల్క్ డీజిల్‌పై ఏలూరు కలెక్టరుతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. జిలెటిన్ స్టిక్స్ దిగుమతిపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని పీపీఏని ఆదేశించారు. భద్రాచలం ముంపు గ్రామాలపై కూడా చర్చ జరిగింది.

స్థానిక రిజర్వేషన్లపై కమిషన్ కసరత్తు

» బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం

» శ్రీకాకుళంలో చైర్మన్ మిశ్రా బహిరంగ విచారణ

శ్రీకాకుళం, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల ఖరారుపై డెడికేటెడ్ కమిషన్ కసరత్తును వేగవంతం చేసింది. బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ నిర్వహించారు. అధికారులతో సుదీర్ఘంగా సమీక్షిస్తూనే, వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. గత ఎన్నికల్లో సర్పంచ్, జడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు, వాస్తవంగా గెలుపొందిన బీసీ అభ్యర్థుల సంఖ్య తదితర నివేదికలను జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవోలను అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ కమిషనర్ల నుంచి పట్టణ ప్రాంతాల్లో బీసీల గెలుపు శాతాలపై వివరాలు సేకరించారు. బీసీల ఆర్థిక, సామాజిక స్థితిగతులను కచ్చితంగా అంచనా వేసేందుకు.. గృహనిర్మాణం తదితర సంక్షేమ పథకాల ద్వారా ఎంతమంది బీసీలకు లబ్ధి చేకూరిందన్న వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. పలు కుల సంఘాల ప్రతినిధులు కమిషన్ దృష్టికి తమ డిమాండ్లను తీసుకొచ్చారు. తమను బీసీ-డీ నుంచి బీసీ-బీ గ్రూపులోకి మార్చాలని ఉత్తరాంధ్ర యాదవ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే అత్యంత వెనుకబడిన కులాల వారు.. బీసీల్లో ఇప్పటికే అభివృద్ధి చెందిన వర్గాలతో ఏమాత్రం పోటీ పడలేకపోతున్నారని రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో అందిన వినతులు, అధికారుల నివేదికలను క్షుణ్నంగా పరిశీలించి ప్రభుత్వానికి త్వరలోనే ఒక సమగ్ర నివేదికను అందజేస్తామని చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వెల్లడించారు.

దేవాలయాలకు మాస్టర్ ప్లాన్

» సిద్ధం చేసేందుకు కమిటీ నియామకం

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా విధులు నిర్వహించి రిటైర్ అయిన ఆర్.కొండలరావును సాంకేతిక సలహాదారుగా నియమించారు. దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్, చీఫ్ ఇంజనీర్, స్థపతి, విజయవాడలోని ఆర్కిటెక్ స్కూల్ డైరెక్టర్ ఎస్. రమేశ్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎస్. సుబ్బారావు, సంబంధిత ఆలయాల ఈవోలు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయడంతో పాటు దానిప్రకారం ఆలయాల రూపురేఖలు మార్చడానికి ఎంత నిధులు వెచ్చించాలి తదితర అంశాలపై ప్రభుత్వానికి, దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక అందించనుంది.

'నీట్' నిర్వహణలో సమయ పాలన పాటించాలి

» పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైతే అదనపు సమయమివ్వాలి

» శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ వి.నరేంద్రబాబు



విజయవాడ, మే 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న 'నీట్ యూజీ-2026'ను ఎటువంటి అంతరాయాలు లేకుండా, సరైన సమయానికి ప్రారంభించాలని శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ వి.నరేంద్రబాబు అధికారులను విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని గంగవరం గోసలైట్స్ బ్రాంచిలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గతంలో నీట్ సమయపాలన తప్పిదాల వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైతే ఆ కోల్పోయిన సమయాన్ని అదనంగా ఇవ్వాలని సెంటర్ సూపరింటెండెంట్లను ఆయన అభ్యర్థించారు. గతంలో పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ.. నిర్ణీత సమయానికే జవాబు పత్రాలు తీసేసుకోవడం వల్ల అనేక మంది విద్యార్థులు ఒక ఏడాది కష్టాన్ని కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి ముందే బయోమెట్రిక్, ఇతర ధృవీకరణ ప్రక్రియలను పూర్తి చేయాలని నరేంద్రబాబు కోరారు. మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి కీలకమైన నీట్ కోసం విద్యార్థులు సంవత్సరాల తరబడి కష్టపడి సిద్ధమవుతున్నారని, పరీక్ష నిర్వహణలో చిన్నపాటి ఆలస్యం కూడా విద్యార్థులపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ సేవలు భేష్!

» ఏప్రిల్‌లో 77.3 శాతం మందిలో సానుకూలత

అమరావతి, మే 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందుతున్న విద్యుత్ సంబంధిత సేవలపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. నిరంతరాయ సరఫరా, సరఫరాలో నాణ్యత, సిబ్బంది అందుబాటును ప్రధాన కొలమానాలుగా తీసుకుని ఇంధన శాఖ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోంది. ఏప్రిల్ నెల 'పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ నివేదికను అధికారులు విడుదల చేశారు. తమకు అందుతున్న విద్యుత్ సేవలు బాగున్నాయని 77.3% మంది తెలిపారు. రాష్ట్రంలోని మూడు డిస్కంలకు గాను సీపీడీసీఎల్ 78.1% సానుకూలతతో అగ్రస్థానంలో ఉండగా, ఈపీడీసీఎల్ 77.8 శాతం, ఎస్పీడీసీఎల్ 76.1 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జిల్లాల వారీగా విశాఖపట్నంలో విద్యుత్‌సేవలపై 82.4 శాతం సానుకూలత వ్యక్తమైంది. 71.6 శాతంతో అనంతపురం జిల్లా చివరన నిలిచింది. మే నెలాఖరు నాటికి సేవలను మరింత మెరుగుపరిచి..సానుకూలతను 78.1 శాతానికి తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇంధన శాఖ అధికారులు తెలిపారు

హైదరాబాద్ ఔటర్‌పై ఘోర ప్రమాదం

» ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టిన కారు

» ముగ్గురు చిన్నారులు సహా ఆరుగురి మృతి

శంషాబాద్ రూరల్, సిరిసిల్ల, అఫ్జల్‌గంజ్, మే 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది! ప్రత్యక్ష సాక్షులు, మొయినాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతమ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని సిరిసిల్లకు చెందిన శ్రీరామ బీడీ కంపెనీ యజమాని బొల్లి రాజు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు బొల్లి శివకుమార్ (37), ఆయన భార్య రాజేశ్వరి అలియాస్ లాస్య (34), వారి కుమార్తె రిషిత (5).. శివకుమార్ సోదరి కోడం శ్వేత, ఆమె భర్త శ్రీనివాస్ (40), వారి కుమారులు కృష్ణ చంద్ర (13), మాధవ్ (10) శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ సనత్‌నగర్ నుంచి శివకుమార్ సొంత కారు (వ్యాగనార్- టీఎస్ 23 ఎఫ్ 2298)లో యాదగిరిగుట్ట వెళ్లి లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం చిలుకూరు బాలాజీ ఆలయానికి బయల్దేరారు. ఘట్‌కేసర్‌లో టోల్ 9 వద్ద ఓఆర్ఆర్ ఎక్కారు. సాయంత్రం 4 గంటల సమయంలో శంషాబాద్ ఎగ్జిట్ సమీపంలోకి రాగానే వారి కారు.. రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని (ఏపీ39యూవీ 0909) వేగంగా ఢీకొట్టింది. లారీ కిందికి వెళ్లిపోయింది. కారులో ఉన్న శివకుమార్, లాస్య, రిషిత, శ్రీనివాస్, కృష్ణ చంద్ర, మాధవ్ అక్కడికక్కడే చనిపోయారు. శ్వేతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తొలుత సమీపంలోని ట్రైడెంట్ ఆస్పత్రికి.. ఆ తర్వాత మరింత మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు.

అమెరికాలో కర్నూలు యువకుడి ఆత్మహత్య

» చికాగోలోని డీపాల్ వర్సిటీలో మాస్టర్స్ చేసిన చందు

» ట్రంప్ విధానాలతో ఉద్యోగం రాదనే మనస్తాపంతో బలవన్మరణం

» మృతదేహాన్ని ఇండియాకు తెప్పించేందుకు లోకేశ్, రామ్మోహన్ నాయుడు యత్నాలు

కర్నూలు, మే 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు, గీతా నగర్ కాలనీకి చెందిన ఇరగనబోయిన చందు(26) అమెరికాలో ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నో ఆశలతో అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లిన చందు బలవన్మరణానికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. విషయం తెలియగానే మంత్రి లోకేశ్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుటుంబానికి అండగా నిలవాలని...

కర్నూలు నగరం బళ్లారి చౌరస్తాకు సమీపంలో గీతా నగర్ కాలనీలో ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ ఇరగనబోయిన కేశవ యాదవ్, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో సంతానం చందు. చదువులో ఎంతో చురుగ్గా ఉండే చందును ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు పంపించారు. షికాగోలోని డీపాల్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేసిన చందు... అక్కడే ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో ఎన్నో ప్రయత్నాలు చేశారు. అమెరికాలో మారిన పరిస్థితులు, అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వల్ల తనకు ఉద్యోగం రాదన్న ఆందోళనతో తీవ్ర మానసిక వ్యథకు గురయ్యారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక ఏప్రిల్ 28న తాను ఉండే అపార్ట్‌మెంట్ గదిలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. తానా సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. చందు మృతదేహాన్ని ఇండియాకు పంపించేందుకు తానా టీం స్క్వేర్ కో-చైర్మన్ చిరంజీవి గల్లా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికోసం అక్కడి భారతీయ సమూహం ఫండ్ రైజింగ్ క్యాంపెయిన్ చేపట్టారు. రెండు రోజుల్లో సుమారు 76,000 డాలర్లు వచ్చాయి.



మృతదేహాన్ని నెల్లూరుకు పంపించడానికి సుమారు 25వేల డాలర్లు ఖర్చు అవుతుంది. మిగిలిన డబ్బులు కుటుంబానికి ఆర్థిక సహాయం కింద అందజేయనున్నట్లు తెలిసింది.

స్పందించిన మంత్రి లోకేశ్

చందు మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు సహాయం కోరుతూ సోషల్ మీడియాలో యూజర్ ఒకరు మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. తక్షణమే స్పందించిన మంత్రి... చందు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతదేహాన్ని ఇండియాకు తెప్పించే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చినట్లు చందు సోదరుడు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చందు మృతదేహాన్ని భారత్‌కు తెప్పించడంతో పాటు కర్నూలుకు తరలించేలా చూడాలని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడును మంత్రి లోకేశ్ కోరారు. ఈ కష్టకాలంలో చందు కుటుంబానికి అండగా నిలబడటానికి తమ వంతు కృషి చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.